



# చైతన్యరథం
సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు





# ఆధ్యాత్మిక చింతనే ఒత్తిడి తగ్గించే మంత్రం

- సమాజాన్ని ప్రశాంతంగా ఉంచే క్షేత్రాలు దేవాలయాలు
- అమరావతి విశ్వనగరిగా ఎదగాలి
- జగన్నాథ రథయాత్రలో కోరుకున్న సీఎం చంద్రబాబు
- జగన్నాథస్వామి నామస్మరణతో హోరెత్తిన అమరావతి

*ఒడిశాలోని పూరీ జగన్నాథుని ఆలయ సంప్రదాయం అమరావతి గడ్డపై పరిమళించింది. వెంకటపాలెంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో తొలిసారిగా నిర్వహించిన జగన్నాథ రథోత్సవానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముఖ్య అతిథిగా విచ్చేశారు. 'చేరా పహారా' సంప్రదాయం ప్రకారం స్వయంగా బంగారు చీపురు పట్టి రథ మార్గాన్ని శుభ్రం చేసి భక్తిభావం చాటుకున్నారు. భక్తుల జయజయధ్వానాల మధ్య రథాన్ని లాగారు. రాజధాని మాస్టర్ ప్లాన్‌ను తలపై పెట్టుకుని అమరావతి విశ్వనగరిగా ఎదగాలని జగన్నాథుని ప్రార్థించారు. నేటి యాంత్రిక జీవనంలో క్షీణిస్తున్న మానవ సంబంధాల పునరుద్ధరణకు, మానసిక ప్రశాంతతకు ఆధ్యాత్మిక చింతనే ఏకైక మార్గమన్నారు. సమాజాన్ని ప్రశాంతంగా ఉంచే క్షేత్రాలే మన దేవాలయాలు అన్నారు. అందుకే ఏపీలో రూ.కోట్ల వ్యయంతో ఐదు వేల శ్రీవారి ఆలయాలను నిర్మిస్తున్నట్టు సీఎం ప్రకటించారు.*

2

## తల్లులకు వం'ధనం'




- ఒకటి నుంచి ఇంటర్ వరకు 67,47,190 మంది విద్యార్థులకు లబ్ధి
- ఈ నెల 24వ తేదీలోగా 42,70,802 మంది తల్లుల ఖాతాల్లో రూ.10,120 కోట్లు జమ
- గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే అంగన్‌వాడీలకూ 'తల్లికి వందనం' వర్తింపు
- విద్యా శాఖ మంత్రి నారా లోకేష్

2



*రాష్ట్రంలోని విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు భరోసానిస్తూ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'తల్లికి వందనం' పథకం రెండో ఏడాది నిధుల విడుదలకు ముహూర్తం ఖరారైంది. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకుంటున్న విద్యార్థుల తల్లులు 42,70,802 మంది బ్యాంకు ఖాతాల్లో రూ.10,120 కోట్లను నిధులను ప్రభుత్వం నేరుగా జమ చేయనుంది. దీని ద్వారా ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న 67,47,190 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. ఈసారి గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే 17వేల మందికి పైగా అంగన్‌వాడీ కార్యకర్తల పిల్లలను కూడా ఇందులో చేర్చారు. అడ్మిషన్లు, వెరిఫికేషన్ పూర్తికాని వారికి ఆగస్టులో నిధులు విడుదల చేస్తామని, అర్హుల వివరాలను 'మనమిత్ర', 'లీప్' యాప్‌లలో చూసుకోవచ్చని విద్యా శాఖ మంత్రి లోకేష్ ప్రకటించారు.*



## భవిష్యత్తులో వీజీఎఫ్ విప్లవం

- పీపీపీ ప్రాజెక్టులతోనే వేగంగా అభివృద్ధి
- 'పీపీపీ-వీజీఎఫ్ పాలసీ 1.0'ను వచ్చే కేబినెట్‌లో చర్చకు పెట్టాలి
- ఉన్నత స్థాయి సమీక్షలో సీఎం చంద్రబాబు

4

*రాష్ట్ర భవిష్యత్తు, సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (PPP), వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (VGF) విధానాలే అత్యంత కీలకమైనవని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. గతంలో దేశంలో ఆర్థిక సంస్కరణలు నడిస్తే, ప్రస్తుతం మౌలిక సదుపాయాల విప్లవం కొనసాగుతోందని, దీనిని ఏపీ అద్భుతంగా అందిపుచ్చుకోవాలని దిశానిర్దేశం చేశారు. పీపీపీ విధానం, వివిధ మౌలిక వసతుల ప్రాజెక్టుల ప్రగతిపై సచివాలయంలో ఆయన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌తో కలిసి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. 'పీపీపీ-వీజీఎఫ్ పాలసీ 1.0'ను వచ్చే కేబినెట్ సమావేశంలో చర్చకు పెట్టాలని అధికారులను ఆదేశించారు. త్వరలోనే గైడ్‌లైన్స్ విడుదల చేయాలని సూచించారు.*

## అమరావతి పూర్తయితే రూ.లక్ష కోట్ల ఆదాయం

- 175 నియోజకవర్గాల అభివృద్ధికి ఆస్కారం
- రాజధాని సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్టు
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



9

## దేశానికే దిక్సూచిగా 'స్వర్ణాంధ్ర' పర్యాటక విజన్

- ఢిల్లీ 'ఫెయిత్' కాన్‌క్లేవ్-2026లో మంత్రి కందుల దుర్గేష్
- ఏపీ టూరిజం వైభవం, పర్యాటక ప్రగతి ప్రస్థానాన్ని చాటిచెప్పిన మంత్రి
- పెట్టుబడులు పెట్టాలని ఇన్వెస్టర్లకు ఆహ్వానం
- అన్ని విధాలా సహకరిస్తామని హామీ

8




## భోగాపురం విమానాశ్రయం నెలలో ప్రారంభం

- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

8



చైతన్యరథం



# ఆధ్యాత్మిక చింతనే ఒత్తిడి తగ్గించే మంత్రం

- సమాజాన్ని ప్రశాంతంగా ఉంచే క్షేత్రాలు దేవాలయాలు
- అమరావతి విశ్వనగరిగా ఎదగాలి
- జగన్నాథ రథయాత్రలో కోరుకున్న సీఎం చంద్రబాబు
- జగన్నాథస్వామి నామస్మరణతో హోరెత్తిన అమరావతి

అమరావతి (చైతన్యరథం): రోజువారీ జీవితంలో ఒత్తిడి తగ్గించే అత్యుత్తమ మంత్రం ఆధ్యాత్మికత ఒక్కటేనని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. సమాజాన్ని ప్రశాంతంగా ఉంచే క్షేత్రాలే మన దేవాలయాలని సీఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. సమాజంలో మానవ సంబంధాలు తగ్గి సామాజిక మాధ్యమాల ప్రతికూల ప్రభావం పడుతోందన్నారు. ఈ కారణంగా కొన్ని కుటుంబాల్లో ఆత్మహత్యలు, చిన్నారులపై అఘాయిత్యాల లాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. అందరి జీవితాల్లో ఒత్తిడి దూరమై మానసిక ప్రశాంతత చేకూరేందుకు ఆధ్యాత్మికతే మార్గమని ఆయన వివరించారు. అందుకే రాష్ట్రంలో ఐదువేల శ్రీవారి ఆలయాలు నిర్మిస్తున్నామని చెప్పారు. గురువారం సాయంత్రం అమరావతి రాజధానిలోని వెంకటపాలెంలో జగన్నాథుడి రథయాత్రను ముఖ్యమంత్రి ప్రారంభించారు. పూరీ క్షేత్రంలో నిర్వహించే సంప్రదాయ క్రతువులను అనుసరిస్తూ జగన్నాథ, బలభద్ర, సుభద్రలతో కూడిన రథం ముందు సీఎం బంగారు చీపురుతో ఊడ్చి శుభ్రం చేసి స్వామివారి రథయాత్రను తాడుతో లాగి ప్రారంభించారు. అమరావతి రాజధాని నగర బృహత్ ప్రణాళికతో కూడిన చిత్రపటాన్ని శిరస్సుపై ధరించి విశ్వ నగరిగా అమరావతి ఎదగాలని ముఖ్యమంత్రి జగన్నాథస్వామిని కోరుకున్నారు. అంతకు ముందు అక్కడే ఏర్పాటుచేసిన రథయాత్ర ప్రారంభోత్సవంలో పాల్గొని సీఎం ప్రసంగించారు. భారతీయ సంస్కృతిలో భాగమైన ఉమ్మడి కుటుంబాలు రావాలని మైక్రో ఫ్యామిలీలు కాదన్నారు. పూరీ క్షేత్రంలో నిర్వహించే జగన్నాథ రథ యాత్రకు ఎంతో ప్రత్యేకత ఉందని.. అలాంటి రథయాత్రను అమరావతిలో తొలిసారి నిర్వహించడంపై సీఎం సంతోషం వ్యక్తం చేశారు. ప్రతిఏటా జగన్నాథ రథయాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఇస్కాన్ సంస్థ ప్రకటించిందన్నారు. ఆధ్యాత్మికత, ప్రజా సేవలో ఇస్కాన్, అక్షయపాత్ర ఫౌండేషన్ పనిచేస్తున్నాయని తెలిపారు. దేశంలోని 16 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో 25వేల పాఠశాలల్లో ఆహారం అందిస్తున్నాయన్నారు. ఏపీలోని 10 సెంట్రలైజ్డ్ కిచెన్ల ద్వారా 1.80 లక్షల మంది విద్యార్థులకు అక్షయపాత్ర ఫౌండేషన్ ఆహారం అందిస్తోందన్నారు. భారతీయ సంస్కృతిని కాపాడేందుకు ఇస్కాన్ లాంటి సంస్థలతో కలిసి పని చేస్తామన్నారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి పి.నారాయణ, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





# తల్లులకు వం'ధనం'

- ఒకటి నుంచి ఇంటర్ వరకు 67,47,190 మంది విద్యార్థులకు లబ్ధి
- ఈ నెల 24వ తేదీలోగా 42,70,802 మంది తల్లుల ఖాతాల్లో రూ. 10,120 కోట్లు జమ
- గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే అంగన్‌వాడీలకూ 'తల్లికి వందనం' వర్తింపు
- అడ్మిషన్లు, వెరిఫికేషన్ పూర్తికాని వారికి ఆగస్టులో నిధుల విడుదల
- 'తల్లికి వందనం' అర్హుల వివరాలను మనమిత్ర, లీప్ యాప్ ల ద్వారా తెలుసుకోవచ్చు
- విద్యా శాఖ మంత్రి నారా లోకేష్




అమరావతి (చైతన్యరథం): ఏ మంచి పని చేపట్టాలన్నా తల్లిని తలచుకుని ప్రారంభిస్తారు. పిల్లల బంగారు భవిష్యత్తుకు భరోసా ఇచ్చేందుకు విద్యా శాఖను చేపట్టిన నారా లోకేష్... పిల్లల చదువులకు మూలధనంగా అందించే ఆర్థిక సాయం పథకానికి 'తల్లికి వందనం'గా నామకరణం చేశారు. చదివే పిల్లలు అందరికీ వారి తల్లుల ఖాతాల్లో నగదు జమ చేస్తామని ఎన్నికలకు ముందు 'యువగళం' పాదయాత్రలో ఇచ్చిన మాటను తు.చ. తప్పకుండా అమలు చేశారు. రెండో ఏడాది విద్యా సంవత్సరం ఆరంభంలోనే 'తల్లికి వందనం' నిధులను ఈ నెల 22వ తేదీ నుంచి తల్లుల ఖాతాల్లో జమచేసేలా జీవో విడుదల చేశారు. ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రూపొందించేందుకు లోకేష్ ఒక బృహత్తర యజ్ఞం చేపట్టారు. దేశంలోనే విద్యకు అత్యంత ప్రాధాన్యమిస్తూ అతి ఎక్కువ మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చే పథకంగా 'తల్లికి వందనం' నిలుస్తోంది.

ఎటువంటి ఆంక్షలు లేకుండా పిల్లలను చదివించడమే అర్హతగా రూపొందించిన 'తల్లికి వందనం' పథకం నిధులు ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు తల్లుల ఖాతాల్లో జమ అయ్యేలా ఏర్పాట్లు చేశారు. వరసగా రెండో ఏడాదీ విద్యా సంవత్సరం ఆరంభంలోనే నిధులు విడుదల చేయడం పిల్లల విద్యకు ఎంతో సాయంగా నిలవనుంది. గతసారి పట్టణ ప్రాంతాల అంగన్‌వాడీలకు 'తల్లికి వందనం' పథకాన్ని వర్తింపజేశారు. ఈసారి గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న అంగన్ వాడీలకు కూడా ఈ పథకం ఇవ్వాలని నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా 17వేల మందికి పైగా అంగన్‌వాడీ కార్యకర్తల పిల్లల చదువులకు తల్లికి వందనం పథకం కింద మూలధనం అందనుంది.

1 నుంచి 12వ తరగతి వరకు విద్యనభ్యసించే 67,47,190 మంది విద్యార్థులకు సంబంధించి 42,70,802 మంది తల్లుల ఖాతాలో రూ.10,120 కోట్లను ప్రజా ప్రభుత్వం జమ చేయనుంది. గత ప్రభుత్వ హయాంలో ఎంతమంది పిల్లలు ఉన్నప్పటికీ కేవలం ఒక్కరికే డబ్బులు ఇచ్చేవారు. ఈ వివక్షాపూరిత విధానానికి ముగింపు పలికిన కూటమి ప్రభుత్వం చదువుకునే ప్రతిబిడ్డకూ తల్లికి వందనం పథకాన్ని అందిస్తోంది.

ఏదైనా సాంకేతిక కారణాల వల్ల ఖాతాల్లో తల్లికి వందనం డబ్బులు పడనివారికి ఈ నెలాఖరు నాటికి క్లియర్ చేయాలని మంత్రి లోకేష్ ఆదేశాలు జారీ చేశారు. ఒకటో తరగతి, ఇంటర్ మొదటి ఏడాది అడ్మిషన్లు పూర్తి కాని లేదా ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి కాని లబ్ధిదారులకు ఆగస్టులో నిధులు విడుదల చేయనున్నారు. తల్లికి వందనం పథకం కింద అర్హులైన వారి వివరాలను మనమిత్ర, లీప్ యాప్ ద్వారా తెలుసుకునే అవకాశం కల్పించాలని మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. చదువుకునే ప్రతి చిన్నారికీ 'తల్లికి వందనం' పథకం అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు.







## వెంకటపాలెంలో వైభవంగా జగన్నాథ రథయాత్ర


అమరావతి (చైతన్యరథం): అమరావతిలోని వెంకటపాలెంలో గురువారం సాయంత్రం జరిగిన జగన్నాథ రథయాత్రలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాల్గొన్నారు. జగన్నాథ స్వామికి ప్రత్యేక పూజలు జరిపి బంగారు చీపురుతో మార్గాన్ని ఊడ్చి శుభ్రం చేశారు. అనంతరం రథాన్ని తాడుతో లాగారు. కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర శాఖ మంత్రి నారాయణ గారు, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, పలువురు ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.













# భవిష్యత్తులో వీజీఎఫ్ విప్లవం

- పీపీపీ ప్రాజెక్టులతోనే వేగంగా అభివృద్ధి
- ప్రతి ప్రభుత్వ శాఖకూ ఓ ఫైనాన్షియల్ ప్లాన్
- నిరర్థకంగా ఉన్న ప్రభుత్వ ఆస్తుల సద్వినియోగం
- మెడికల్ కాలేజీల నిర్మాణంలో పీపీపీ విధానంపై కేంద్రం ప్రశంసలు
- పీపీపీ-వీజీఎఫ్ పాలసీ 1.0 మార్గదర్శకాలు త్వరలో విడుదల
- పీపీపీ ప్రాజెక్టులు, పీపీపీ విధానంపై సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి (చైతన్యరథం): భవిష్యత్తులో వయబిలిటీ గ్యాప్ ఫండింగ్‌తో కూడిన ప్రాజెక్టులే కీలకంగా మారనున్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. గతంలో ఆర్థిక సంస్కరణలు, ప్రస్తుతం మౌలిక సదుపాయాల విప్లవం దేశంలో నడుస్తోందన్నారు. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతోనే వివిధ రంగాల్లో ప్రాజెక్టులు చేపట్టి వేగంగా అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలో పీపీపీ కింద చేపట్టిన ప్రాజెక్టులు, ప్రభుత్వం చేస్తున్న వ్యయం తదితర అంశాలపై గురువారం ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించారు. ప్రస్తుతం పోర్టులు, షిప్ యార్డులు, ఎయిర్ పోర్టులు, పర్యాటక ప్రాజెక్టులు సహా మొత్తం 260 ప్రాజెక్టులను పీపీపీ కింద చేపట్టినట్టు ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, పురపాలక, టూరిజం, వైద్య కళాశాలలు, రహదారులు, సౌర విద్యుత్‌లాంటి రంగాల్లో రూ. 1,23,229 కోట్ల విలువైన ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. దీనికి స్పందించిన సీఎం అన్ని పీపీపీ ప్రాజెక్టులనూ సస్టెయినబుల్ మోడల్‌లో అభివృద్ధి చేయాలని... ప్రతి ప్రాజెక్టు వద్దా ఆర్థిక కార్యకలాపాలకు అవకాశం ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. వివిధ ప్రాజెక్టులకు కేంద్రం ఇచ్చే అర్బన్ ఛాలెంజ్ ఫండ్ లాంటి వాటిని కూడా సమర్ధంగా వినియోగించుకోవాలన్నారు. పోర్టులు, ఎయిర్‌పోర్టులు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను సమర్ధంగా నడిపేందుకు అవసరమైన మెకానిజాన్ని సిద్ధం చేయాలని సూచించారు. కోస్టల్ టూరిజం ప్రాజెక్టుల్లో స్థానిక మత్స్యకారులను కూడా భాగస్వాములను చేసి వారికి



ప్రయోజనాలు కలిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 21 ప్రధాన దేవాలయాల వద్ద పబ్లిక్ టచ్ పాయింట్ల వద్ద మెరుగైన మౌలిక సదుపాయాలు, ఆర్థిక కార్యకలాపాలకు అవకాశాలు కల్పించాలన్నారు. విజయవాడ, తిరుపతిల్లోని వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు రూ. 178 కోట్ల వీజీఎఫ్‌ను కేంద్రం ఇస్తోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మెడికల్ కాలేజీలకు రూ. 1,468 కోట్ల వీజీఎఫ్ రానుందని.. ఈ ప్రాజెక్టులు చేపట్టిన విధానంపై కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగం ప్రశంసించిందని అధికారులు తెలిపారు.

## వచ్చే కేబినెట్‌కు నూతన విధానం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం-వీజీఎఫ్ పాలసీ 1.0ను వచ్చే కేబినెట్ సమావేశంలో చర్చకు పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీనికి సంబంధించి త్వరలోనే మార్గదర్శకాలు విడుదల చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వేర్వేరు విధానాలను కూడా అధ్యయనం చేయాల్సిందిగా సూచించారు. 2047 స్వర్ణాంధ్ర లక్ష్యాల మేరకు ప్రతిఏటా పీపీపీ కింద రూ. 8 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అధికారులు అంచనా వేశారు. రాష్ట్రంలోని విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్లలో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కింద వీటిని చేపట్టాల్సి రావొచ్చని సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన చంద్రబాబు స్వర్ణాంధ్ర విజన్ మైక్రో, మ్యాక్రో లక్ష్యాలకు అనుగుణంగా ప్రాజెక్టులు చేపట్టాలన్నారు. లోటుపాట్లను ఎప్పటికప్పుడు సరిదిద్దుకుంటూ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. భవిష్యత్తులో పరిశ్రమలకు సరఫరా చేసే నీటి ద్వారా జలవనరుల శాఖకు ఆదాయం వస్తుందని... సాగునీటి సంఘాలు కూడా ఈ ప్రక్రియలో కీలకంగా ఉంటాయన్నారు. ప్రతి ప్రభుత్వ శాఖ ఫైనాన్షియల్ ప్లాన్ తయారు చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికల ద్వారా ఆదాయ మార్గాలను నిర్దేశించుకోవాలన్నారు. ప్రభుత్వ శాఖలు పెట్టుబడిదారుల నుంచి విశ్వాసాన్ని కలిగించేలా పీపీపీ ప్రాజెక్టులను చేపట్టాలని సీఎం సూచించారు. ఏ రంగమైనా ఏపీకి ఫస్ట్ మూవర్ అడ్వాంటేజీ రావాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

## ప్రభుత్వ ఆస్తుల సద్వినియోగం

ప్రభుత్వం వద్ద నిరర్థకంగా ఉన్న ఆస్తులను అవకాశాలుగా మలచుకోవాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని అన్ని బస్టాండ్ల వద్ద ప్రభుత్వానికి ఉన్న భూములను వాణిజ్యపరంగా వినియోగించుకునే అవకాశాన్ని పరిశీలించాలని స్పష్టం చేశారు. పంప్డ్ స్టోరేజీ, సౌర విద్యుత్ ప్రాజెక్టులు కూడా పీపీపీ కింద చేపట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గనులు, నెడ్ క్యాప్, పర్యాటకం, లాజిస్టిక్స్ రంగాల్లో భారీగా ఆదాయం ఆర్జించే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ,ఎ స్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ హాస్టళ్లలో ఉన్న విద్యార్థుల సంఖ్యను రెట్టింపు చేసేందుకు ఆలోచన చేస్తున్నామన్నారు. పట్టణ ప్రాంతాల్లో రహదారులకు సమీపంలోనే మినీ టౌన్‌షిప్‌లా రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేసేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సీఎం సూచించారు. బలహీనవర్గాలకు చెందిన విద్యార్థులను నైపుణ్యం ఉన్న మానవ వనరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. ఐఐటీ, ఐఐఎంలాంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లోనూ చదివేలా వీరిని తీర్చిదిద్దాలన్నారు.

సమీక్షలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఆ శాఖ ఉన్నతాధికారులు పీయూష్‌కుమార్, వి.వినయ్‌చంద్, రోనాల్డ్ రోస్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్, ఐఅండ్ఐ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు పాల్గొన్నారు.

## బ్రహ్మం చౌదరి త్వరగా కోలుకోవాలి: మంత్రి లోకేష్




అమరావతి (చైతన్యరథం): బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బ్రహ్మం చౌదరి త్వరగా కోలుకోవాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ దేవుడిని ప్రార్థించారు. బ్రహ్మం చౌదరి సతీమణి గౌతమీ శ్వేతను ఆయన ఫోనులో పరామర్శించాను. అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. మణిపాల్ ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి బ్రహ్మం చౌదరి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నాను. త్వరగా కోలుకునేలా మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

## గల్లా జయదేవ్‌కు మంత్రి లోకేష్ క్షమాపణలు

### ఏపీలో మళ్లీ పెట్టుబడులు పెట్టాలని పిలుపు

*అమరావతి (చైతన్యరథం): గత ప్రభుత్వ హయాంలో అమర రాజా గ్రూప్ ఎదుర్కొన్న వేధింపులపై రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేష్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. “ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మీకు క్షమాపణ చెప్పాలి జయదేవ్” అంటూ ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక బహిరంగ లేఖను పోస్ట్ చేశారు. తెలంగాణలో అమరరాజా గ్రూప్ కొత్త ప్లాంట్ ప్రారంభించిన నేపథ్యంలో లోకేష్ స్పందిస్తూ.. నాలుగు దశాబ్దాలుగా చిత్తూరు పేరును, ఏపీ ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటిన అమర రాజా సంస్థకు గత ప్రభుత్వంలో అన్యాయం జరగకూడాల్సింది అని పేర్కొన్నారు. సొంత రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టిన పారిశ్రామికవేత్తను ప్రోత్సహించాల్సింది పోయి భయపెట్టడం బాధాకరమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పుట్టిన సంస్థ తన తదుపరి విస్తరణ కోసం పొరుగు రాష్ట్రానికి వెళ్లాల్సి రావడం తనను కలిచివేసిందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో పారిశ్రామిక నమ్మకాన్ని మళ్లీ పునర్నిర్మిస్తున్నామని, అమర రాజా కోసం ఏపీ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని స్పష్టం చేశారు. అమర రాజా గ్రూప్ తెలంగాణలో కొత్తగా ఏర్పాటు చేసిన ఫెసిలిటీకి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.*

## బ్రహ్మం చౌదరి ఆరోగ్యంపై సీఎం చంద్రబాబు ఆరా



అమరావతి (చైతన్యరథం): కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి ఆరోగ్య పరిస్థితిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరా తీశారు. తాడేపల్లిలోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు సమాచారం తెలుసుకున్న సీఎం చంద్రబాబు... బ్రహ్మం చౌదరి ఆరోగ్య పరిస్థితిపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో మాట్లాడారు. వైద్యులు, కుటుంబ సభ్యులను సమన్వయం చేసుకుని బ్రహ్మం చౌదరికి నాణ్యమైన వైద్యం అందేలా చూడాలని శ్రీనివాసరావును ఆదేశించారు.

◆ జలయజ్ఞ అగ్నిపరీక్ష



## ప్రయోజనాల ప్రవాహం..

# సవాళ్ల సుడిగుండం

**నదుల అనుసంధానం సాకారమైతే అది కేవలం సాగునీటి పథకం కాదు.. రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రాన్నే మార్చే సంపద సృష్టి యజ్ఞం. కరవు నివారణ, తాగునీటి భద్రత, పంటల విస్తీర్ణం పెంపు, వ్యవసాయాధారిత పరిశ్రమలు, గ్రామీణ ఉపాధి.. ఇలా ప్రయోజనాల ప్రవాహం అనూహ్యం. కానీ రూ.81,900 కోట్ల బనకచర్ల ప్రాజెక్టు ముందు నిధుల సమీకరణ మొదలు.. తెలంగాణ అభ్యంతరాలు, సుప్రీంకోర్టు విచారణ, పర్యావరణ అనుమతులు, పునరావాస బాధ్యతల వరకు సవాళ్ల సుడిగుండాలెన్నో. అసలు నదుల అనుసంధానం శాస్త్రీయంగా సాధ్యమేనా? అన్న మౌలిక ప్రశ్నను లేవనెత్తే నిపుణులూ లేకపోలేదు. వరద జలాల మళ్లింపునకే పరిమితమవుతూ, భాగస్వామ్య రాష్ట్రాలతో సఖ్యత సాధిస్తూ, పర్యావరణ బాధ్యతతో అడుగేస్తేనే ఈ స్వప్నం సాకారమవుతుంది. అనుసంధానంతో ఒనగూరే మేలు.. ఎదురయ్యే అగ్నిపరీక్షలు.. రెండింటినీ నిష్పాక్షికంగా తరచి చూడాలి.**

- మహాదేవ

నదుల అనుసంధానం విజయవంతమైతే ఆంధ్రప్రదేశ్‌కు ఒనగూరే ప్రయోజనాలు అనూహ్యం. మొదటిది –కరవు నివారణ. రాష్ట్రంలో సాగుభూమిలో గణనీయ భాగం వర్షాధారం. రుతుపవనాల మోజుపై ఆధారపడిన ఆ భూముల్లో ఏటా పంట అనిశ్చితి, రైతు ఆత్మహత్యలు, వలసలు పరిపాటి. గోదావరి వరద జలాలు అక్కడి చెరువులు, జలాశయాలను నింపగలిగితే.. రెండు పంటలకు భరోసా దొరుకుతుంది. రెండోది –తాగునీటి భద్రత. ఫ్లోరైడ్, ఉప్పునీటి సమస్యలతో సతమతమవుతున్న ప్రాంతాలకు నదీజలాలే శాశ్వత పరిష్కారం. మూడోది –సంపద సృష్టి. ఇక్కడే అనుసంధాన ఆర్థిక కోణాన్ని లోతుగా చూడాలి. నీటి లభ్యత పెరిగితే పంటల విస్తీర్ణం, దిగుబడులు పెరుగుతాయి. ఉద్యాన పంటలు, ఆక్వా, పాడివంటి అధిక విలువ రంగాలకు ఊతం లభిస్తుంది. వ్యవసాయాధారిత పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు గ్రామీణ ఉపాధిని పెంచుతాయి. పరిశ్రమలకు, డేటా సెంటర్లవంటి కొత్తతరం పెట్టుబడులకు నిరంతర నీటి సరఫరా కీలక ఆకర్షణ. బొల్లాపల్లివంటి భారీ జలాశయాలు మత్స్య సంపదకు, పర్యాటకానికీ కేంద్రాలవుతాయి. నిర్మాణ దశలోనే వేల కోట్ల పనులు స్థానిక ఉపాధిని సృష్టిస్తాయి. అంటే అనుసంధానం కేవలం సాగునీటి పథకం కాదు.. అది గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పునర్నిర్మాణ ప్రక్రియ. 'ప్రతి ఎకరాకూ నీరు' అన్న నినాదం సాకారమైతే.. రాష్ట్ర జీఎస్‌డీపీలో వ్యవసాయ రంగ వాటా పరుగులు పెడుతుంది. పేదరిక నిర్మూలన, తలసరి ఆదాయ పెంపు అనే ప్రభుత్వ లక్ష్యాలకు ఇది చోదకశక్తి అవుతుంది. అభివృద్ధి చెందిన దేశాల అనుభవం చెప్పే పాఠం కూడా ఇదే. నీటి నిర్వహణలో ముందున్న సమాజాలే సంపద సృష్టిలోనూ ముందుంటాయి. ఈ కోణంలో చంద్రబాబు అనుసంధాన స్వప్నం.. ఆయన 'స్వర్ణాంధ్ర–2047' విజన్‌లో అంతర్భాగంగా చూడాలి.

అయితే ఇంతటి బృహత్ స్వప్నం ముందు నిలిచిన సవాళ్లనూ నిష్పాక్షికంగా గుర్తించాలి. మొదటిది.. నిధుల సమస్య. రూ.81,900 కోట్ల బనకచర్ల ప్రాజెక్టుకు తోడు 36 ప్రాజెక్టులకు రూ.35 వేల కోట్లు అంటే మాటలు కాదు. అప్పుల భారం, సంక్షేమ వ్యయాల ఒత్తిడి మధ్య ఉన్న రాష్ట్ర ఖజానాకు ఇది భారీ పరీక్ష. కేంద్ర సాయం, హైబ్రిడ్ ఫండింగ్ నమూనాలు, అంతర్జాతీయ రుణ సంస్థల భాగస్వామ్యం లేకుండా ఇది ముందుకు సాగదు. రెండోది.. అంతర్రాష్ట్ర వివాదాలు. బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. గోదావరిలో తమ వాటా జలాలకు గండి పడుతుందని, ట్రైబ్యునల్ కేటాయింపులకు ఇది విరుద్ధమని ఆ రాష్ట్రం వాదిస్తోంది. ఈ అంశం సుప్రీంకోర్టు విచారణ వరకూ వెళ్లింది. అపెక్స్ కౌన్సిల్, నదీ యాజమాన్య బోర్డుల వేదికలపై ఏకాభిప్రాయం సాధించకుండా ప్రాజెక్టు నిర్విఘ్నంగా సాగడం కష్టం. వాస్తవానికి 'వరద జలాలే తీసుకుంటాం, ఎవరి వాటాకూ నష్టం లేదు' అన్నది ఏపీ వాదన. ఏటా సగటున మూడు వేల టీఎంసీలకు పైగా గోదావరి జలాలు సముద్రం పాలవుతున్న గణాంకాల నేపథ్యంలో ఈ వాదనకు బలముంది. కానీ జల వివాదాల చరిత్ర చెప్పేదేమిటంటే.. సాంకేతిక వాస్తవాలకంటే రాజకీయ విశ్వాసమే కీలకం. మూడోది.. పర్యావరణ, పునరావాస సవాళ్లు. నల్లమల అటవీ ప్రాంతం మీదుగా టన్నెళ్లు, బొల్లాపల్లివంటి భారీ జలాశయాల నిర్మాణం అటవీ, వన్యప్రాణి అనుమతుల పరీక్షలను దాటాలి. ముంపు గ్రామాల ప్రజల పునరావాసం మానవీయంగా, పారదర్శకంగా జరగాలి. పోలవరం నిర్వాసితుల అనుభవాలు ఇక్కడ గుణపాఠాలు కావాలి. ఇక నాలుగోది.. అసలు నదుల అనుసంధానం శాస్త్రీయంగా సాధ్యమేనా? అన్న మౌలిక ప్రశ్న. దేశవ్యాప్తంగా కొందరు జలరంగ నిపుణులు దీనిపై సందేహాలు లేవనెత్తుతున్నారు. నదులు కేవలం నీటి పైపులు కావని, అవి జీవావరణ వ్యవస్థలని.. వరద జలాల మళ్లింపు డెల్టాల మనుగడపై, భూగర్భ జలాలపై ప్రభావం చూపవచ్చని వారి వాదన. అంచనా వ్యయాలు అమలు నాటికి రెట్టింపవడం, నిర్వహణ వ్యయాల భారంవంటి ఆర్థిక ప్రశ్నలూ ఉన్నాయి.



ఈ సందేహాలకు సమాధానం సిద్ధాంత చర్చల్లో కాదు.. జాగ్రత్తతో కూడిన ఆచరణలోనే దొరుకుతుంది. పట్టిసీమ ద్వారా చిన్న స్థాయిలో అనుసంధానం సాధ్యమేనని ఏపీ నిరూపించింది. కేన్–బెత్వా ద్వారా జాతీయ స్థాయిలోనూ తొలి అడుగు పడింది. కావాల్సిందల్లా.. ప్రతి దశలోనూ శాస్త్రీయ అధ్యయనాలు, పర్యావరణ ప్రభావ మదింపులు, స్వతంత్ర నిపుణుల పర్యవేక్షణ. వరద జలాల మళ్లింపునకే పరిమితమవుతూ, దిగువ డెల్టాల అవసరాలను కాపాడుతూ, భాగస్వామ్య రాష్ట్రాలతో నిరంతర సంప్రదింపులు జరుపుతూ ముందుకెళ్తే.. ఈ ప్రాజెక్టు వివాదాల ఊబిలో కూరుకుపోకుండా గట్టెక్కుతుంది. గడువుల విషయంలోనూ వాస్తవిక దృష్టి అవసరం. ప్రకటనల్లో వేగం ఎంత ముఖ్యమో.. నాణ్యత, భద్రతల్లో రాజీపడని నిదానమూ అంతే ముఖ్యం. పోలవరం డయాఫ్రం వాల్ అనుభవం ఈ విషయంలో శాశ్వత హెచ్చరిక. అలాగే భారీ ప్రాజెక్టుల వెలుగులో చిన్ననీటి వనరుల నిర్వహణను విస్మరించరాదు. చెరువుల పునరుద్ధరణ, వాటర్‌షెడ్ అభివృద్ధి, సూక్ష్మసేద్యం, నీటి వినియోగ సామర్థ్య పెంపు.. ఇవన్నీ అనుసంధానానికి అనుబంధ వ్యూహాలుగా సాగాలి. తెచ్చిన నీటిని పొదుపుగా వాడుకునే సంస్కృతి లేకపోతే.. ఎన్ని నదులు కలిపినా దాహం తీరదు. మొత్తంగా చూస్తే.. వృథా జలాలను వరప్రసాదాలుగా మార్చాలన్న చంద్రబాబు సంకల్పం ఔచిత్యంలో ప్రశ్నార్థం కాదు. ప్రశ్నలన్నీ అమలు మార్గంలోనే. నిధుల క్రమశిక్షణ, పొరుగు రాష్ట్రాలతో సఖ్యత, పర్యావరణ బాధ్యత, పారదర్శకత అనే నాలుగు స్తంభాలపై ఈ జలయజ్ఞం నడిస్తే.. మార్చి 2027న పోలవరం జాతికి అంకితమయ్యే క్షణం రాష్ట్ర చరిత్రలో సువర్ణాధ్యాయమవుతుంది. కృష్ణా–గోదావరి సంగమం వద్ద ఇచ్చిన జలహారతి.. తరతరాల కరవు కథకు ముగింపు పలికే మంగళహారతిగా మారాలని ఆకాంక్షిద్దాం. నదులు కలిస్తే నీరు మాత్రమే కాదు.. ప్రాంతాల మధ్య అభివృద్ధి అంతరాలూ కలిసిపోతాయి. అదే ఈ మహాసంకల్పానికి అసలైన సార్థకత!

# పలాస ఘటనలో తప్పుచేసిన వారిని వదిలేది లేదు

## - హోం మంత్రి అనిత స్పష్టీకరణ



విజయనగరం (చైతన్యరథం): శ్రీకాకుళం జిల్లా పలాస రోడ్డు ప్రమాదం ఉదంతంలో తప్పు ఎవరూ చేసినా ఉపేక్షించేది లేదని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. మాజీ మంత్రి, వైసీపీ నాయకుడు సీదిరి అప్పలరాజు కుమారుడు అరవ్ వర్మ నడుపుతున్న మోటార్ బైక్ ఢీకొని ఒకరు చనిపోగా, నిందితుడిని తారుమారు చేసేందుకు జరిగిన ప్రయత్నాలు తెలిసిందే. అరవ్‌ను కేసు నుంచి తప్పించేందుకు మరో యువకుడిని నిందితునిగా చూపేందుకు అప్పలరాజు ప్లాన్ వేశారు. అయితే తరువాత నిజాలు బయటకి రావటంతో అరవ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. ఈ వ్యవహారంపై ఇటీవల విశాఖ పర్యటనలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను హోం మంత్రి అనిత తప్పుబట్టారు. పలాస ఘటనను కూడా తాము సీరియస్‌గా తీసుకున్నామని స్పష్టం చేశారు. గొడ్డలి పార్టీ నీచపు రాజకీయాలు చేస్తోందని ధ్వజమెత్తారు. గురువారం విజయనగరంలో హోం మంత్రి అనిత పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. బాధితులను పరామర్శించడానికి వచ్చిన ప్రతిసారి జగన్ రెడ్డి బలప్రదర్శన చేస్తున్నారని దుయ్యబట్టారు.

విశాఖపట్నం మత్స్యకారుల విషయాన్ని జగన్ అండ్ కో రాజకీయం చేయడానికి ప్రయత్నించి విఫలమైందని అనిత విమర్శించారు. వైసీపీ హయాంలో ఒక్క మత్స్యకారుడిని కూడా పట్టించుకున్న పాపాన పోలేదని ఆగ్రహించారు. బోటు గల్లంతైన వెంటనే ప్రభుత్వం స్పందించి నేవీ అధికారులకు సమాచారం అందజేసిందని తెలిపారు. వెంటనే 72 గంటల పాటు గాలింపు చర్యలు చేపట్టామని వివరించారు.

జగన్ హయాంలో పోలీసులను వాడుకున్నారే తప్పా వారి సంక్షేమాన్ని ఎందుకు పట్టించుకోలేదని అనిత ప్రశ్నించారు. ఎన్‌డీఏ ప్రభుత్వం పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు పెండింగ్‌లోని పరిహారం చెల్లిస్తామని మాటిచ్చారు. జిందాల్ పరిశ్రమకు సంబంధించి రైతులకు కూడా పరిహార చెక్కులను వెంటనే చెల్లిస్తామని హోం మంత్రి అనిత పేర్కొన్నారు.

# పర్యాటక ప్రాంతంగా పోలవరం

## - బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్



రాజమహేంద్రవరం (చైతన్యరథం): గత వైసీనీ సర్కారు పోలవరం ప్రాజెక్టును తీవ్ర నిర్లక్ష్యం చేస్తే.. సీఎం చంద్రబాబు పరుగులు పెట్టిస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ అన్నారు. పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన ప్రధాని మోదీ.. ప్రాజెక్టు పూర్తి చేసేందుకు సహకారం అందిస్తున్నారని తెలిపారు. త్వరలో పోలవరం కుడికాలువకు నీరు విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేయనున్నట్టు వెల్లడించారు. భవిష్యత్తులో పోలవరం ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణ స్థితిగతులు, పర్యాటక విభాగం, అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర బీజేపీ నేతలు గురువారం రాజమహేంద్రవరం నుంచి పోలవరం సందర్శనయాత్ర చేపట్టారు. వెయ్యి మందితో కూడిన కమలదళం కార్లతో ర్యాలీగా పోలవరం వద్దకు వెళ్లారు. ఈ ర్యాలీని ఎంపీ పురంధేశ్వరి జెండా ఊపి ప్రారంభించారు. కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులు పర్యటనలో ఉన్నారు.

# నాడు 'ఆక్వా'ను నిండా ముంచేసి..

# నేడు నిస్సిగ్గుగా అబద్ధాలు

- జగన్ జమానాలో 'జే' ట్యాక్స్‌తో దోపిడీ
- జోన్‌ల పేరుతో విద్యుత్ సబ్సిడీకి శఠగోపం
- వైసీపీ హయాంలో రొయ్యల మద్దతు ధరను రూ.240 నుండి రూ. 210కి తగ్గించి రైతులకు దగా
- ఆక్వా సాగు నీటి పన్ను రూ.12 నుండి ఏకంగా రూ.120కి పెంపు
- ట్రాన్స్‌ఫార్మర్ ధరలోనూ బాదుడే బాదుడు
- నేడు ఆక్వా రైతుకు అండగా కూటమి ప్రభుత్వం
- నిరంతర పర్యవేక్షణతో ఫీడ్ ధరల నియంత్రణ, రైతులందరికీ విద్యుత్ సబ్సిడీ
- ఈక్వెడార్ పోటీని, అమెరికా సుంకాలను తట్టుకునేలా కేంద్ర ప్రభుత్వంతో సీఎం చంద్రబాబు చర్చలు
- ఎవరి హయాంలో మేలు జరిగిందో చర్చిద్దాం రండి
- ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు

అమరావతి (చైతన్యరథం): జగన్ రెడ్డి జమానాలో జోన్‌లు, జె-ట్యాక్స్ పేరుతో ఆక్వా రైతుపై భారాలు మోపితే... కూటమి ప్రభుత్వం అండగా నిలిచి ఆక్వా రంగానికి ఊతమిస్తోందని ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు అన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఆక్వా రంగాన్ని పూర్తిగా సంక్షోభంలోకి నెట్టేసిన జగన్ రెడ్డి, ఇప్పుడు భీమవరం వచ్చి ఆక్వా రంగంపై అడ్డగోలుగా అబద్ధాలు ఆడటం జుగుప్సాకరంగా ఉందన్నారు. జగన్ రాజకీయ ప్రయోజనాల కోసం ముడిసరుకుల ధరలపై, విద్యుత్ సబ్సిడీలపై, ఎగుమతులపై పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. ఆక్వా రంగానికి మేలు చేసిన చరిత్ర కేవలం చంద్రబాబు నాయుడుకి, తెలుగుదేశంపార్టీకి మాత్రమే ఉంది.వైసీపీ హయాంలో జరిగిన మోసాలను కప్పిపుచ్చుకునేందుకే జగన్ ఈ తరహా డ్రామాలు ఆడుతున్నారు. ఆక్వా రంగంపై ఏ ప్రభుత్వ హయాంలో ఏం జరిగిందో ప్రతి అంశాన్ని ఆధారాలతో సహా పేపర్ మీద పెట్టి చర్చించడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. మీరు సిద్ధమా జగన్ రెడ్డి అంటూ రామరాజు సవాల్ విసిరారు.

### రొయ్యల మేత (ఫీడ్) ధరల వాస్తవాలు

ముఖ్యంగా రొయ్యల మేత(ఫీడ్) ధరలు పెరిగిపోవడానికి కూటమి ప్రభుత్వం కారణమంటూ జగన్ ఆరోపించడం పూర్తిగా అవాస్తవం. గడిచిన 15ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా అంతర్జాతీయంగా రొయ్యల మేతకు వాడే సోయాబీన్, ఫిష్ మీల్, ఫిష్ ఆయిల్ వంటి ముడిసరుకుల ధరలు గత రెండున్నరేళ్లలో విపరీతంగా పెరిగాయి. కంపెనీలు కేజీ ముడిపదార్థాలపై రూ.10 నుండి రూ.12వరకు ధరలు పెంచినప్పటికీ,కూటమి ప్రభుత్వం ఆభారాన్ని రైతులపై పడకుండా నిరంతరం పర్యవేక్షిస్తోంది. మూడు సార్లు ఆక్వా రంగ భాగస్వాములతో మాట్లాడి ఫీడ్ ధరలను స్థిరీకరించింది. కూటమి ప్రభుత్వంలో కిలోకు కేవలం రూ.2 మాత్రమే పెరిగితే, గత వైకాపా ప్రభుత్వం మాత్రం తన 5 ఏళ్ల పాలనలో ఏకంగా 7 సార్లు ఫీడ్ ధరలను పెంచి రొయ్యల మేత ధరను 27 శాతం(అంటే దాదాపు రూ.18 నుండి రూ.19వరకు) పెంచేసింది. గతంలోకి ఒకసారి చూస్తే, 2010లో కాంగ్రెస్ ప్రభుత్వ సమయంలో రొయ్యల మేత ధర రూ.41.50 ఉంటే, 2014 నాటికి వైఎస్సార్సీపీ మద్దతుదారుల దౌర్జన్యాలు, మార్కెట్ శక్తుల వల్ల అది 58 శాతం పెరిగి రూ. 24 అదనపు భారంగా మారింది. ఆ తర్వాత 2014-2019 మధ్య చంద్రబాబు ప్రభుత్వం ముడి సరుకుల రేట్లు పెరిగినా రూ.65గా ఉన్న ధరను నియంత్రణలో ఉంచగలిగిందని రామరాజు వివరించారు.

### జోన్ల వివక్షకు చెక్, విద్యుత్ సబ్సిడీలు

ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీని తీసుకొచ్చిందే తెలుగుదేశం ప్రభుత్వం.2014-2019మధ్య కాలంలో యూనిట్ విద్యుత్ ధర రూ.4.63 పైసలు ఉంటే, చంద్రబాబు మొదట 73పైసలు తగ్గించి రూ.3.86కి, ఆ తర్వాత రైతుల అభ్యర్థన మేరకు ఏకంగా రూ.2 కే యూనిట్ విద్యుత్ అందించి రికార్డు సృష్టించారు. కానీ జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఆక్వా జోన్, నాన్ -జోన్ అనే అసంబద్ధ నిబంధనలు తెచ్చి, 10 ఎకరాల లోపు ఉన్నవారికే సబ్సిడీ అంటూ 70శాతం మంది రైతులకు మొండిచేయి చూపించారు. నాన్-



జోన్ పరిధిలోని రైతులనుండి యూనిట్‌కు రూ.3.85 వసూలు చేయడంతో, గతంలో రూ.30వేలు వచ్చే కరెంట్ బిల్లులు రూ.80వేలకు పైగా పెరిగాయి. జగన్ కేవలం 29వేల కనెక్షన్లకు మాత్రమే సబ్సిడీ ఇచ్చి, సుమారు రూ.450కోట్ల భారాన్ని రైతుల నెత్తిపై వేశారు. చివరకు డిస్కంలకు సైతం రూ.1,990కోట్ల విద్యుత్ సబ్సిడీ బాకీలు పెట్టి వాటిని దివాలా తీయించారు.దీనికి భిన్నంగా కూటమి ప్రభుత్వం జోన్, నాన్ -జోన్ అనే తేడా లేకుండా రిజిస్ట్రేషన్ చేసుకున్న ఆక్వా రైతులందరికీ యూనిట్ విద్యుత్‌ను రూ.1.50 కే ఇస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం విద్యుత్ రాయితీని రూ.800కోట్ల నుండి ఏకంగా రూ.1,200కోట్లకు పెంచింది.ఈ ఏడాది ఫిబ్రవరి నెలలోనే సుమారు 12వేల కనెక్షన్లకు సంబంధించి రూ. 1,150 కోట్లు వచ్చేలా సీఎం చంద్రబాబు ఫైల్ పంపగా, అది ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో క్లియర్ అయి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం మొత్తం 62 వేల కనెక్షన్లకు సబ్సిడీ ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అలాగే రైతులకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ అందించేందుకు గ్రామాల్లో కొత్త సబ్ స్టేషన్లను కూడా నిర్మిస్తోందని రామరాజు చెప్పారు.

### మౌలిక వసతుల ధరల పెంపు, 'జే-ట్యాక్స్' దోపిడీ

జగన్ పాలనలో ఆక్వా రైతులకు ఉపయోగపడే మౌలిక వసతుల ధరలను కూడా విపరీతంగా పెంచేశారు. గతంలో రూ. 64 వేలు ఉన్న 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ధరను రూ. 3.24 లక్షలకు పెంచారు. అలాగే రూ. 3.56 లక్షలు ఉన్న 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ధరను రూ. 8.30 లక్షలకు పెంచి, ఎకరానికి రూ. 1.80 లక్షల వరకు అదనపు భారం మోపి రైతుల నడ్డి విరిచారు. నీటి పన్నును కూడా రూ. 12 నుండి ఏకంగా రూ. 120 కి (10 రెట్లు) పెంచేశారు. 'అప్సడా' చట్టం తెచ్చి సీడ్, ఫీడ్ రేట్లు పెంచబోమని, కరెంటు సబ్సిడీలు ఇస్తామని, దానికి ముఖ్యమంత్రే ఛైర్మన్‌గా ఉంటారని నమ్మబలికిన జగన్.. తెరవెనుక సీడ్, ఫీడ్, ప్రాసెసింగ్ పరిశ్రమల ద్వారా సుమారు రూ. 5,000 కోట్ల 'జే-ట్యాక్స్' వసూలు చేసి ఆక్వా రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టారు. అందుకు భిన్నంగా ఆక్వా రంగంపై ఉన్న మార్కెట్ సెస్సును పూర్తిగా రద్దు చేసి రైతులకు వ్యయ భారాన్ని తగ్గించిన ఘనత ప్రస్తుత కూటమి సర్కార్‌దేని రామరాజు అన్నారు.

### కూటమి ప్రభుత్వం అండ

గత వైకాపా ప్రభుత్వం మొదట రొయ్యలకు రూ. 240 మద్దతు ధర ప్రకటించి, ఆ తర్వాత కనీస నైతిక బాధ్యత లేకుండా దాన్ని రూ. 210 కి తగ్గించి చేతులు ఎత్తేసింది. అంతర్జాతీయంగా చూస్తే, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధించిన 26% నుండి 50% వరకు ఉన్న టారిఫ్‌లు (దిగుమతి సుంకాలు), యాంటీ-డంపింగ్ డ్యూటీల వల్ల భారత ఆక్వా రంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. మన దేశ ఎగుమతులు నిలిచిపోయి కోల్డ్ స్టోరేజ్ గోదాములు నిండిపోతుంటే నాటి జగన్ ప్రభుత్వం కనీసం స్పందించలేదు, కేంద్రానికి లేఖ కూడా రాయలేదు. ఒకప్పుడు అంతర్జాతీయ రొయ్యల ఎగుమతుల్లో భారతదేశం రెండో స్థానంలో ఉండేది. కానీ ఈక్వెడార్ వంటి చిన్న దేశం రవాణా ఛార్జీలు తక్కువగా ఉండటం, వంద కౌంట్ రొయ్యలను మనకంటే రూ. 40 నుండి రూ. 50 తక్కువకే విక్రయించడం వల్ల భారత మార్కెట్‌కు గట్టి పోటీ ఎదురైంది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్, కేంద్ర మంత్రులు నిరంతరం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి అమెరికా విధిస్తున్న సుంకాలను అధిగమించేలా చర్యలు తీసుకున్నారు. మార్కెట్‌ను నిలకడగా ఉంచారు. గత సంవత్సరం డీఓబీ ధర రూ. 13 ఉంటే, కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల ఈ రోజు మార్కెట్లో అది రూ. 82 కి చేరింది. రాజకీయ లాభాల కోసం కాకుండా, ఆక్వా రైతులను ఆర్థిక నష్టాల నుండి గట్టెక్కించడానికి ఎన్డీయే కూటమి ప్రభుత్వం శాయశక్తులా ప్రయత్నిస్తూ కొండంత అండగా నిలబడిందని రామరాజు స్పష్టం చేశారు.

### 24 నెలల కూటమి పాలనలో...

# సీమలో అభివృద్ధి పరుగులు

- రెండేళ్లలో సాగునీటి ప్రాజెక్టులకు రూ.12,484 కోట్లు ఖర్చు
- లక్ష కోట్లతో హార్టికల్చర్ హబ్ అభివృద్ధికి అడుగులు
- రెండేళ్లల్లో రూ.4.58 లక్షల కోట్ల పెట్టుబడులు, 2.76ఉద్యోగాల కల్పన శ్రీకారం
- గొడ్డలి పార్టీ హయంలో అడుగంటిన సీమ అభివృద్ధి
- బెదిరించి పరిశ్రమలను తరిమేసిన జగన్‌రెడ్డి ముఠా




కూటమి ప్రభుత్వ పాలనతో రాయలసీమ పరిస్థితులు పూర్తిగా మారుతున్నాయి. దశాబ్దాలుగా వెనుకబడిన ఈ సీమ.. నేడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికతతో పారిశ్రామికంగా, ఆర్థికంగా కొత్త పుంతలు తొక్కుతోంది. ఒకప్పుడు బాంబుల మోతతో భయపెట్టిన రాయలసీమ, నేడు పరిశ్రమల సైరన్లతో ఉపాధికి బాటలు వేస్తోంది. సాగునీటి కష్టాలను తీర్చడమే లక్ష్యంగా చంద్రబాబు తీసుకున్న నిర్ణయాలు సీమ రూపురేఖలను మారుస్తున్నాయి.

రాయలసీమను సస్యశ్యామలం చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ, దశాబ్దాల కరువుకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అడుగులు వేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 24నెలల్లోనే రూ.12,484కోట్లు ఖర్చు చేసి ప్రాజెక్టులను వేగవంతం చేసింది. 2026–27 బడ్జెట్‌లో రాష్ట్రవ్యాప్త సాగునీటి ప్రాజెక్టులకు రూ.18,224 కోట్లు కేటాయించగా, అందులో ఏకంగా రూ.10,014 కోట్లను కేవలం రాయలసీమ ప్రాజెక్టులకే కేటాయించింది. హంద్రీనీవాకు రూ.2,621 కోట్లు, తెలుగు గంగకు రూ.936 కోట్లు, గాలేరు నగరికి రూ. 665 కోట్లు, కేసీ కెనాల్‌కు రూ.184 కోట్లు, ఉమ్మడి జిల్లాల్లోని ఇతర ప్రాజెక్టులకు రూ.4,500 కోట్లు కేటాయిస్తూ, సీమలోని 464 టీఎంసీల నిల్వ సామర్థ్యానికి గాను 366 టీఎంసీల నీటిని నిల్వ చేసి రికార్డు సృష్టించింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన హంద్రీనీవా, గాలేరు నగరి, తెలుగు గంగ వంటి ప్రాజెక్టులకు కూటమి ప్రభుత్వం ప్రాణం పోసింది. హంద్రీనీవాకు రూ.3,870 కోట్లు ఖర్చు చేసి రాయలసీమ చివరి భూములకు సాగునీటిని అందజేసింది. ఫేజ్ 2కి రూ.1,180 కోట్లు ఖర్చు చేస్తోంది. కేవలం సాగునీటి ప్రాజెక్టులకే పరిమితం కాకుండా, జగన్‌రెడ్డి రద్దు చేసిన బిందు సేద్యం (డ్రిప్ ఇరిగేషన్) పథకాన్ని పునరుద్ధరించి, రాయలసీమ ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టు కోసం రూ.లక్ష కోట్లతో కార్యాచరణ సిద్ధం చేయడం ద్వారా, ఈ ప్రాంతాన్ని 'హార్టికల్చర్ హబ్'గా మార్చి ప్రతి రైతును రాజును చేసే దిశగా చంద్రబాబు నాయుడు అపర భగీరథుడిలా అభివృద్ధి యజ్ఞాన్ని కొనసాగిస్తున్నారు.

ఒకప్పుడు కరువు కాటకాలు, వలసలు, ఫ్యాక్షన్ రాజకీయాలకు నిలయంగా ముద్రపడిన రాయలసీమ, నేడు చంద్రబాబు దార్శనికతతో దేశ తయారీ రంగం భవిష్యత్తుగా మారుతోంది. కేవలం 24నెలల కాలంలోనే 'మిషన్ రాయలసీమ' ద్వారా ఈ ప్రాంత ముఖచిత్రాన్ని ప్రభుత్వం పూర్తిగా మార్చివేసింది. సుమారు రూ. 4.58లక్షల కోట్ల భారీ పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా, 2.76 లక్షల మంది యువతకు ఉపాధి కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనికి నిదర్శనంగా, జమ్మలమడుగులో రూ.3,478 కోట్ల వ్యయంతో దాల్మియా సిమెంట్ రెండో ప్లాంట్ విస్తరణ పనులు, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో పట్టాలెక్కాయి.







సీమను 'రాయల్ సీమ'గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా, రాష్ట్రంలోని డబుల్ ఇంజిన్ సర్కార్ ప్రభుత్వం పని చేస్తోంది. అనంతపురంలో కియా మోటార్స్ రాకతో 13 వేల ఉద్యోగాలు, రూ.10వేల కోట్ల ఆదాయం సమకూరగా, అదే స్ఫూర్తితో ఇప్పుడు పుట్టపర్తిలో యుద్ధ విమానాల తయారీ యూనిట్, రాయల్ ఎన్ ఫీల్డ్ వంటి దిగ్గజ సంస్థలను తీసుకొచ్చింది. ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామిక వాడల కోసం రూ.5 వేల కోట్లు కేటాయించడమే కాకుండా, కడప ఉక్కు పరిశ్రమ పనులను రూ.16,400కోట్లతో ప్రారంభించింది. కర్నూలు, నంద్యాల జిల్లాలు సోలార్, విండ్ హబ్‌లుగా మారుతుండగా, త్వరలోనే కర్నూలుకు హైకోర్టు బెంచ్ కూడా రాబోతోంది.

శ్రీసిటీ అభివృద్ధి శిల్పి చంద్రబాబు, 'మేక్ ఇన్ ఏపీ' పాలసీల ద్వారా అంతర్జాతీయ తయారీ హబ్‌గా మార్చారు. ఇసుజు, డైకిన్, ఫాక్స్‌కాన్ వంటి 30కి పైగా అంతర్జాతీయ బ్రాండ్లు ఇక్కడ కొలువుదీరాయి. గత ప్రభుత్వంలో ఆగిపోయిన అమరావతి–అనంతపురం గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే వంటి ప్రాజెక్టులను మళ్లీ పట్టాలెక్కించారు. రాయల సీమ సాగునీటి రంగంలో కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో రూ. 12,484 కోట్లు ఖర్చు చేయగా, హంద్రీ–నీవా ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేసే దిశగా అడుగులు వేస్తోంది.

రాయలసీమను 'ఉద్యానవన పంటల రాజధాని'గా మార్చి, రైతులను రాజులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అపర భగీరథుడిలా కృషి చేస్తున్నారు. ఒకప్పుడు కరువు, వలసలకు నిలయంగా ఉన్న అనంతపురం జిల్లాను, చంద్రబాబు తన దార్శనికతతో బిందు సేద్యంలో (డ్రిప్ ఇరిగేషన్) దేశంలోనే అగ్రస్థానంలో నిలిపి, సాక్షాత్తు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసలు అందుకునే స్థాయికి తీసుకురావడం ఆయన పాలనా పటిమకు నిదర్శనం. గత జగన్‌రెడ్డి పాలనలో అటకెక్కిన డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీలను పునరుద్ధరించి, రాయలసీమను ప్రపంచ స్థాయి హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు ఏకంగా రూ.లక్ష కోట్ల వ్యయంతో 'సమగ్ర ఉద్యానవన అభివృద్ధి ప్రణాళిక (ఐహెచ్‌డీపీ)'ను ప్రభుత్వం అమలు చేస్తోంది. 2030 నాటికి ఉద్యాన సాగును 14.41 లక్షల హెక్టార్లకు, ఉత్పత్తులను 43.5 లక్షల టన్నులకు పెంచడమే లక్ష్యంగా, 2026–27 బడ్జెట్‌లో రూ.30 వేల కోట్లు కేటాయించడమే కాకుండా, సాగు నుండి మార్కెటింగ్ వరకు ప్రతి దశలోనూ రైతులకు అండగా నిలుస్తూ రాయల సీమను నిజమైన 'రత్నాల సీమ'గా మార్చేందుకు కూటమి ప్రభుత్వం సంకల్పంతో పనిచేస్తోంది.

ఐదేళ్ల 'గొడ్డలి పార్టీ' పాలనలో రాయలసీమ పారిశ్రామికంగా, సామాజికంగా ఎంతో వెనక్కి వెళ్లింది. పరిశ్రమలు తేవాల్సింది పోయి ఫ్యాక్షన్ రాజకీయాలు, భయానక వాతావరణంతో ఏపీ బ్రాండ్ విలువను దిగజార్చారు. ఐదేళ్ల గొడ్డలి పార్టీ పాలన రాయలసీమకు తీరని ద్రోహం చేసింది. 2014–19 మధ్య చంద్రబాబు నాయుడు కియా వంటి అంతర్జాతీయ పరిశ్రమలను తీసుకువచ్చి,

**కరెంట్ అనాలిసిస్**

తెలుసుకుందాం | విశ్లేషిద్దాం | సిద్ధమవుదాం

**ప్రవీణ్ బోయ, అనలిస్ట్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్**

ఫ్యాక్షనిజాన్ని రూపుమాపి రాయలసీమలో శాంతిని, అభివృద్ధిని నెలకొల్పితే, 2019–24 మధ్య జగన్ రెడ్డి పాలనలో ఫ్యాక్షన్ రాజకీయాలు మళ్లీ రాజ్య మేలాయి. ఈ కాలంలో పరిశ్రమలు రావడమే కాదు, ఉన్న పరిశ్రమలు కూడా పారిపోయే దుస్థితి నెలకొంది. గొడ్డలి పార్టీ నేతల బెదిరింపులు, కక్ష సాధింపు రాజకీయాల వల్ల కియా మోటార్స్ 19 అనుబంధ సంస్థలు ఇతర రాష్ట్రాలకు తరలివెళ్లగా, ఇది ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను, రాష్ట్ర ప్రతిష్టను దారుణంగా దెబ్బతీసింది. ఫ్యాక్షన్, భయానక వాతావరణాన్ని సృష్టించి యువత ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లేలా చేసిన జగన్‌రెడ్డి, తన రూ.12 లక్షల కోట్ల బడ్జెట్ పాలనలో రాయలసీమ ప్రాజెక్టుల కోసం కేవలం రూ.2వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసి చేతులు దులుపుకున్నారు, అందులోనూ సగం నిధులు సొంత మనుషుల పనులకే మళ్లాయనే ఆరోపణలు ఉన్నాయి. జీఓ 365 ద్వారా సీమలోని 102 సాగునీటి ప్రాజెక్టులను రద్దు చేయడం, రైతులకు మేలు చేసే డ్రిప్ ఇరిగేషన్‌ను అటకెక్కించడం, అన్నమయ్య డ్యామ్ ప్రమాదంలో 39 మంది చనిపోయినా కనీసం పరామర్శించకపోవడం, ప్రాజెక్టుల మరమ్మతులకు నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం వహించడం వంటి చర్యలు జగన్ రెడ్డికి సీమ పట్ల ఉన్న నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం.

చైతన్యరథం

# దేశానికే దిక్సూచిగా స్వర్ణాంధ్ర పర్యాటక విజన్

- మంత్రి కందుల దుర్గేష్ ఉద్ఘాటన
- ఢిల్లీ 'ఫెయిత్' కాన్‌క్లేవ్-2026లో పాల్గొన్న మంత్రి
- ఏపీ టూరిజం వైభవం, పర్యాటక ప్రగతి ప్రస్థానాన్ని చాటిచెప్పిన మంత్రి
- పెట్టుబడులు పెట్టాలని ఇన్వెస్టర్లకు ఆహ్వానం
- అన్ని విధాలా సహకరిస్తామని హామీ




న్యూఢిల్లీ (చైతన్యరథం): సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చెబుతున్నట్లుగా "పర్యాటకమే భవిష్యత్ ప్రగతి చక్రం" అని నమ్ముతూ ఆంధ్రప్రదేశ్‌ను భారతదేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన పర్యాటక రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. దేశ రాజధాని న్యూఢిల్లీలోని తాజ్ ప్యాలెస్ హోటల్‌లో ఇన్ క్రెడిబుల్ ఇండియా..ఇన్‌వాల్యుబుల్ ఎకనామిక్స్ అంశంపై గురు, శుక్రవారాల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న "ఫెయిత్ టూరిజం కాన్ క్లేవ్ 2026" సదస్సులో తొలిరోజు మంత్రి కందుల దుర్గేష్ పాల్గొని ప్రసంగించారు. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తరంజిత్ సింగ్ సంధు, జమ్మూ అండ్ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, అరుణాచల్ ప్రదేశ్ ప్రభుత్వ పర్యాటక, విద్యా, గ్రామీణ పనులు, పార్లమెంటరీ వ్యవహారాలు, గ్రంథాలయాల శాఖ మంత్రి పాసాంగ్ దోర్జీ సోనా, కేంద్ర పర్యాటక శాఖ అదనపు కార్యదర్శి అండ్ డైరెక్టర్ జనరల్ సుమన్ బిల్లా, జాతీయ, అంతర్జాతీయ పర్యాటక రంగ విధాన నిర్ణేతలు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు హాజరైన ఈ ఉన్నత స్థాయి వేదికపై ఆంధ్రప్రదేశ్ అద్భుత పర్యాటక సామర్థ్యాన్ని, భవిష్యత్ కార్యాచరణను మంత్రి దుర్గేష్ వివరించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో రూపొందించిన 'స్వర్ణాంధ్ర పర్యాటక విజన్ 2047' ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను అంతర్జాతీయ పర్యాటక పటంలో అగ్రగామిగా నిలపడమే తమ సంకల్పమని ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న 'వికసిత్ భారత్' లక్ష్యాలకు అనుగుణంగా, స్థానిక సమాజాల భాగస్వామ్యంతో పర్యావరణహిత, సుస్థిర పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక వైవిధ్యాన్ని వివరిస్తూ, భారతదేశంలోని అన్ని అద్భుతాలు ఏపీలో కొలువై ఉన్నాయని ("ఎవ్రీ బిట్ ఆఫ్ ఇండియా ఈజ్ ఇన్ ఆంధ్రప్రదేశ్")పేర్కొన్నారు.

సువిశాల సముద్ర తీరంలో 283 బీచ్ లున్నాయని, తిరుమల సహా 80,000కు పైగా దివ్య ఆలయాలు తమ సొంతమని పేర్కొన్నారు. అంతేగాక 13 వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలు, 3 జాతీయ పార్కులు, దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వ్, విస్తారమైన బ్యాక్ వాటర్స్ (దేశంలో 2వ స్థానం) కలిగిన రాష్ట్రం ఏపీ అని తెలిపారు. లేపాక్షి, తిరుమల కొండలు, ఎర్రమట్టి దిబ్బలు వంటి ప్రాంతాలు యునెస్కో తాత్కాలిక జాబితాలో చోటు దక్కించుకున్నాయని వివరించారు. ప్రధానంగా ఆధ్యాత్మిక (తిరుపతి, అహోబిలం, శ్రీశైలం, సింహాచలం), బౌద్ధ (అమరావతి, నాగార్జునకొండ, తొట్లకొండ, బొజ్జన కొండ), వారసత్వ (లేపాక్షి, గండికోట, ఉండవల్లి గుహలు, చంద్రగిరి కోట), ఎకో టూరిజం (అరకు, మారేడుమిల్లి, కొండకర్ల ఆవ, పులికాట్ సరస్సు), అరుదైన రుచులు (పూతరేకులు, చేపల పులుసు, రాగి సంగటి, బొంగు చికెన్), కళలు-చేనేత (కొండపల్లి బొమ్మలు, కలంకారీ, నిమ్మలకుంట తోలుబొమ్మలాట, కోనసీమ ప్రభల తీర్థం), సాహస క్రీడల్లో భాగంగా రాక్ క్లైంబింగ్, స్కూబా డైవింగ్, సర్ఫింగ్, బౌల్డరింగ్, బీచ్ టూరిజం (సూర్యలంక, విశాఖ, పేరుపాలెం, సీతపాలెం, కోనసీమ బ్యాక్ వాటర్) వంటి సకల పర్యాటక అనుభూతుల సమాహారమే ఆంధ్రప్రదేశ్ అని మంత్రి దుర్గేష్ ప్రకటించారు.

గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వ తీసుకున్న విప్లవాత్మక చర్యల వల్ల పర్యాటకుల రాక రికార్డు స్థాయికి చేరిందని గణాంకాలతో వివరించారు. 2023-24లో 28.58 కోట్లుగా ఉన్న పర్యాటకుల సంఖ్య, 2025-26 నాటికి 36.42 కోట్లకు చేరిందని తెలిపారు. దేశీయ పర్యాటకుల సంఖ్య 28.56 కోట్ల నుండి 36.39 కోట్లకు పెరిగిందని, దేశంలోనే 4వ స్థానంలో ఉన్నామన్నారు. విదేశీ పర్యాటకుల సంఖ్య 1.70 లక్షల నుండి రికార్డు స్థాయిలో 2.72 లక్షలకు పెరిగిందని, గత ఏడాదిలోనే ఏకంగా 48.63% వృద్ధి నమోదు కావడం విశేషమని పేర్కొన్నారు.

ఏపీలో టూరిజం ప్రాజెక్టులకు పారిశ్రామిక హోదా కల్పించడంతో పాటు, అత్యంత పారదర్శకమైన 'నూతన పర్యాటక పాలసీ'ని అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటివరకు రూ.19,693 కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించగా.. ఇప్పటికే రూ. 9,200.73 కోట్ల విలువైన ప్రాజెక్టులకు అనుమతులు మంజూరయ్యాయని తద్వారా 7,994 క్లాసిఫైడ్ హోటల్ గదులు అందుబాటులోకి రానున్నాయని స్పష్టం చేశారు. క్యాపిటల్ సబ్సిడీ, 100% స్టాంప్ డ్యూటీ రీయింబర్స్‌మెంట్, 100% భూ మార్పిడి ఛార్జీల మినహాయింపు, పారిశ్రామిక ధరలకే విద్యుత్ సరఫరా, జీఎస్టీ రీయింబర్స్‌మెంట్, సింగిల్ విండో అనుమతులను అందిస్తున్నామన్నారు. పర్యాటక రంగాన్ని అన్ని రంగాలతో అనుసంధానిస్తూ దేశంలోనే మొట్టమొదటిసారిగా సమగ్ర పాలసీ వ్యవస్థను తీసుకొచ్చినట్లు మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.

అడ్వెంచర్ టూరిజం గైడ్‌లైన్స్ 2025 ద్వారా ల్యాండ్, వాటర్, ఎయిర్ స్పోర్ట్స్ కోసం కఠినమైన భద్రతా ప్రమాణాలు తెచ్చామని, క్యారవాన్ టూరిజం పాలసీ ద్వారా 25 క్యారవాన్ పార్కుల నిర్మాణం, 150 క్యారవాన్ల మొబిలైజేషన్ ద్వారా 5,000 స్థానిక ఉపాధి అవకాశాలు కల్పించినట్లు పేర్కొన్నారు. హోమ్‌స్టేలు మరియు బీ అండ్ బీ పాలసీ ద్వారా ఐదేళ్లలో 10,000 హోమ్‌స్టేల ఏర్పాటు, 50,000 ఉద్యోగాలు, 20,000 కుటుంబాలకు ఉపాధి నైపుణ్యాల శిక్షణ అందించనున్నామన్నారు. ఎంప్లాయిమెంట్ ఇన్సెంటివ్ పాలసీ ద్వారా రాబోయే ఐదేళ్లలో పర్యాటక రంగాన్ని నమ్ముకుని 3 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా పెట్టుకున్నామన్నారు. పర్యాటక రంగంలో కొత్తగా ఉద్యోగాలు కల్పించే సంస్థలకు, ఆయా సంస్థలు చెల్లించాల్సిన ఈపీఎఫ్, ఈఎస్ఐ యజమాన్య వాటాను ప్రభుత్వం రీయింబర్స్ చేస్తుందని తెలిపారు. ఇవే గాక బీచ్ షాక్స్ పాలసీ, రాష్ట్రంలో పెద్ద ఎత్తున అంతర్జాతీయ, జాతీయ సంగీత కచేరీలు, ఈవెంట్లను నిర్వహించడానికి కాన్సర్ట్ పాలసీ, ఫిల్మ్ టూరిజం పాలసీ, చారిత్రక కట్టడాల పరిరక్షణలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ అడాప్ట్ ఎ మాన్యుమెంట్ గైడ్‌లైన్స్ మరియు పర్యాటక ప్రాంతాల సహజ సిద్ధమైన అందాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ల్యాండ్‌స్కేప్‌ను కాపాడుతూ డెస్టినేషన్ వ్యూ ప్రొటెక్షన్ గైడ్‌లైన్స్ అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. పర్యావరణానికి హాని కలగకుండా పర్యాటకాన్ని ప్రోత్సహించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పర్యాటకులకు స్థానిక సంస్కృతిని దగ్గరుండి పరిచయం చేసే గైడ్‌లు/హోస్ట్‌ల వ్యవస్థను బలోపేతం చేస్తున్నామన్నారు. పర్యాటక రంగంలో ఉన్న ఏజెన్సీలు, ఆపరేటర్లను నేరుగా పర్యాటక శాఖతో అనుసంధానం చేస్తూ ఒక అధికారిక "వెరిఫైడ్ పార్ట్నర్ నెట్‌వర్క్"ను ఏర్పాటు చేశామన్నారు.

పర్యాటకులు ఎక్కువ రోజులు రాష్ట్రంలో గడిపేలా విశాఖపట్నం, అరకు వ్యాలీ, రాజమహేంద్రవరం, అమరావతి, శ్రీశైలం, గండికోట, తిరుపతిలను ఏడు ప్రధాన 'యాంకర్ హబ్‌లుగా' మార్చామని మంత్రి దుర్గేష్ తెలిపారు. టెంపుల్, క్రూయిజ్, బౌద్ధ, ఎకో, బీచ్, రివర్, సీప్లేన్ సర్క్యూట్ల ద్వారా పర్యాటకాన్ని సుసంపన్నం చేస్తున్నామన్నారు. అదే విధంగా చేనేత, జియోగ్రాఫికల్ ఇండికేషన్ ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ఈ క్రమంలో ధర్మవరం, మంగళగిరి, వెంకటగిరి, ఉప్పాడ చీరలు, శ్రీకాళహస్తి-మచిలీపట్నం కలంకారీ కళలు, ఏటికొప్పాక-కొండపల్లి బొమ్మలు, బొబ్బిలి వీణ, అరకు కాఫీ, ఆత్రేయపురం పూతరేకులు వంటి జీఐ గుర్తింపు పొందిన మన సంస్కృతీ వారసత్వ ఉత్పత్తులను పర్యాటక అనుభూతిలో భాగం చేస్తున్నామన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో 3 అంతర్జాతీయ (విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి), 3 దేశీయ (రాజమహేంద్రవరం, కడప, కర్నూలు) విమానాశ్రయాలతో పాటు, 700కు పైగా రైల్వే స్టేషన్లు, బలమైన జాతీయ రహదారుల నెట్‌వర్క్ ఉందన్నారు. కృష్ణా, గోదావరి నదులపై రివర్ క్రూయిజ్ టూరిజంను వేగంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

సంవత్సరమంతా పర్యాటక పండుగ వాతావరణం ఉండేలా క్యాలెండర్‌ను సిద్ధం చేశామని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. "హాలిడే ఇన్ ఆంధ్రప్రదేశ్" ప్రచారంలో భాగంగా...వెడ్డింగ్స్ (డెస్టినేషన్ వెడ్డింగ్స్), ఎక్స్‌పీరియన్సెస్, కల్నరీ (వంటకాలు), మరియు వైన్ అనే నాలుగు ప్రధానస్తంభాలపై దృష్టి పెట్టామన్నారు.

ఆంధ్రప్రదేశ్ కేవలం చూడదగిన ప్రదేశం కాదు.. అదొక పరిపూర్ణ జీవన అనుభూతి. ఆధ్యాత్మికత, సముద్రతీరం, సంస్కృతి, ప్రకృతి సంపద, రుచులు, వ్యాపార అనుకూలత కలిసిన అద్భుత వేదిక. ఆంధ్రప్రదేశ్‌కు రండి.. భాగస్వామ్యాలు నెలకొల్పండి.. ప్యాకేజీలు రూపొందించండి.. పెట్టుబడులు పెట్టండి. మీతో కలిసి ప్రయాణించేందుకు ఏపీ టూరిజం సిద్ధంగా ఉందని మంత్రి కందుల దుర్గేష్ ఢిల్లీ వేదికగా ఇన్వెస్టర్లను ఆత్మీయంగా ఆహ్వానించారు.

# నెలరోజుల్లో 'భోగాపురం' ప్రారంభం

## - కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు



న్యూఢిల్లీ (చైతన్యరథం): ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభానికి సిద్ధమైందని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. నెల రోజుల్లో భోగాపురం విమానాశ్రయం ప్రాంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఉడాన్ 2.0 పథకం అమలు తీరుతెన్నులపై గురువారం ఢిల్లీలో జరిగిన వర్క్‌షాప్‌లో పాల్గొన్న అనంతరం రామ్మోహన్ నాయుడు మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణపనులు పూర్తయ్యాయని, ప్రతిష్టాత్మక ప్రాజెక్టును ప్రధాని చేతుల మీదుగా ప్రారంభించాలని కోరినట్టు చెప్పారు. తేదీ ఖరారైన వెంటనే.. నెల రోజుల్లో విమాన కార్యకలాపాలు ప్రారంభిస్తామని తెలిపారు. విమాన సర్వీసుల నిర్వహణకు అత్యంత కీలకమైన డీజీసీఏ లైసెన్స్ కూడా అధికారికంగా మంజూరైందని ఆయన తెలిపారు. విమానాశ్రయానికి సంబంధించిన నిర్మాణ పనులతో పాటు ఆపరేషన్స్ ప్రారంభించడానికి అవసరమైన అన్ని రకాల పనులు ఇప్పటికే విజయవంతంగా పూర్తయ్యాయన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టుకు ఇటీవల కేంద్ర హోంశాఖ కీలక గుర్తింపు ఇచ్చింది.

"ఇమిగ్రేషన్, విదేశీయుల చట్టం- 2025' పరిధిలోకి ఈ ఎయిర్‌పోర్టును చేర్చింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం అధికారిక గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో కేటగిరీ-1 విమానాశ్రయాల జాబితాలో భోగాపురం 39వ స్థానంలోకి చేరింది. కేంద్ర హోంశాఖ నిర్ణయంతో ఈ ఎయిర్‌పోర్టు నుంచి అంతర్జాతీయ విమానాల రాకపోకలకు మార్గం సుగమం కానుంది. ఈ నోటిఫికేషన్‌తో ఇమిగ్రేషన్ చెక్‌పోస్ట్‌గా భోగాపురం ఎయిర్‌పోర్టు గుర్తింపు పొందింది.

# అమరావతి పూర్తయితే రూ.లక్ష కోట్ల ఆదాయం

- 175 నియోజకవర్గాల అభివృద్ధికి ఆస్కారం
- రాజధాని సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్
- స్థిరం లేని గొడ్డలి పార్టీ నేత మాటలు నమ్మొద్దు
- మంత్రి నిమ్మల రామానాయుడు



అమరావతి (చైతన్యరథం): ప్రపంచ స్థాయి ప్రమాణాలతో రూపుదిద్దుకొంటున్న రాజధాని అమరావతి నగరం పూర్తయితే లక్ష కోట్ల రూపాయల ఆదాయం ఇస్తుందని, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చెప్పారు. మున్సిపల్, పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావులతో కలిసి అమరావతిలో నిర్మాణంలో ఉన్న ఐకానిక్ భవనాలను, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్వార్టర్లను, అఖిల భారత సర్వీస్ ఉద్యోగుల క్వార్టర్లను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మంత్రి నారాయణ, శ్రీనివాసరావులతో కలిపి మీడియాతో మాట్లాడారు.

అమరావతిపై గొడ్డలి పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి, ఆ పార్టీ ఇతర నేతలు చేస్తున్న విష ప్రచారాన్ని మంత్రి రామానాయుడు ఖండించారు. ప్రతిపక్షంలో ఉండగా అమరావతి రాజధానిని స్వాగతిస్తున్నానని, 30,000 ఎకరాలు సరిపోవని, తాను ఇక్కడే ఇల్లు కట్టుకుంటున్నానని, అమరావతి రాజధానిని కదిలే ప్రసక్తి లేదని జగన్‌రెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించిన విషయాలను రామానాయుడు గుర్తు చేశారు. 2019లో అధికారంలోకి వచ్చినవెంటనే, మాట మార్చి, మడమ తిప్పి మూడు రాజధానులు అంటూ,మూడుముక్కలాట ఆడాడని విమర్శించారు.తాను ప్రతిపాదించిన మూడు రాజధానులలో మూడు ఇటుకలు కూడా పెట్టకుండా ఐదేళ్ళు కాలయాపన చేశాడన్నారు.

పదవిపోయి పదకొండు సీట్లు కే పరిమితమైనా, ఇప్పుడు మళ్లీ మాట మార్చి మావిగన్ అంటూ మతి స్థిరం లేని మాటలు మాట్లాడుతున్నాడని దుయ్యబట్టారు.ఆపార్టీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి విజయవాడ రాజధాని అంటున్నారు.పెద్దిరెడ్డి 3 రాజధానులు అంటున్నారు. ఇలా ఆ గొడ్డలి పార్టీకి రాజధాని విషయంలో వాళ్లలోవాళ్లకే క్లారిటీ లేదని రామానాయుడు విమర్శించారు. పిచ్చి తుగ్లక్ సైతం అసూయ పడేలా, ఆశ్చర్య పోయేలా అమరావతిపై గొడ్డలి పార్టీ నాయకుడు మాట్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు.

కర్ణాటకకు బెంగళూరు, తమిళనాడుకు చెన్నై, తెలంగాణాకు హైదరాబాద్ నుండి 70శాతం ఆదాయం అందిస్తున్నట్లే, ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి ఆదాయం ఇస్తుందన్నారు. అమరావతి రాజధాని వైఖరిలో జగన్ తీరు చూస్తే ఊసరవెల్లి సైతం సిగ్గుపడుతుందని ఎద్దేవా చేశారు. సచివాలయ, అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, సుమారు 16,000 మంది ఒకేచోట పని చేసే విధంగా 5 ఐకానిక్ టవర్లు డిజైన్ చేశారన్నారు. ప్రపంచం లోనే అత్యంత ఎత్తయిన సెక్రటేరియట్ భవనంగా 204 మీటర్లు ఎత్తుతో నిర్మిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. దేశంలోనే సచివాలయం, హెచ్‌ఓడి టవర్లు ఒకే చోట మెదటి సారిగా నిర్మిస్తున్నది మన రాష్ట్రంలోనే అని రామానాయుడు కొనియాడారు.

దేశంలోనే మొదటి డయా గ్రిడ్ బిల్డింగ్, లోపల ఎటువంటి పిల్లర్లు, లేకుండా,తుఫాన్‌లు వంటి ప్రకృతి వైపరీత్యాలు తట్టుకునేలా నిర్మిస్తున్నారని చెప్పారు.

చంద్రబాబు నాయకత్వంలో ప్రపంచ స్థాయిలో ప్రజా రాజధాని నిర్మిస్తున్నామని మంత్రులు, పల్లా శ్రీనివాసరావు చెప్పారు. సీడ్ యాక్సెస్ రోడ్ కోసం మొత్తం 45.47 ఎకరాలకు గాను, 99.5 శాతం మంది రైతులు నుండి భూమిని సమీకరించామన్నారు. ఇంకా కేవలం 1.52 ఎకరాలు మాత్రమే భూ సమీకరణ ద్వారా రావలసి ఉందని ఇది కేవలం 0.5% మాత్రమేనని రామానాయుడు చెప్పారు. కేవలం ఒకరో, ఇద్దరో రైతులు రాజకీయ దురుదేశ్యంతో భూములు ఇవ్వకుండా అడ్డు పడుతున్నారని ఆయన అన్నారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు 12 టవర్లలో 276 ఫ్లాట్స్.. అల్ ఇండియా సర్వీస్ అధికారులకు 6 టవర్లతో 138 ఫ్లాట్స్ నిర్మాణ పనులుదాదాపు పూర్తయ్యాయని నిమ్మల కు, పల్లాకు మున్సిపల్ మంత్రి నారాయణ ప్రత్యక్షంగా చూపించారు.

## నాతవరం ప్రజల ఆప్యాయత, ఆశీర్వాదాలు మరువలేనివి

**రాజ్యసభ సభ్యుడు చింతకాయల విజయ్ - అపూర్వ స్వాగతం పలికిన కూటమి శ్రేణులు**



నాతవరం (చైతన్యరథం): రాజ్యసభ సభ్యుడు చింతకాయల విజయ్ తొలిసారిగా నర్సీపట్నం నియోజకవర్గం నాతవరం మండలంలో విస్తృతంగా పర్యటించారు. నర్సీపట్నంలోని బాలవినాయక స్వామి, మరిడితల్లి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపి ప్రజల శ్రేయస్సు, ప్రాంత అభివృద్ధి కోసం ప్రార్థించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలతో కలిసి నాతవరం మండల పర్యటన ప్రారంభించారు. మండల సరిహద్దు అయిన బెన్నవరం వద్ద వందలాది కార్లు, నాతవరం పెట్రోల్ బంక్ వద్ద వేలాది మంది కార్యకర్తలతో ఆయనకు అపూర్వ స్వాగతం లభించింది. అక్కడి నుంచి విజయ్ సైకిల్‌పై ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో వాలీబాల్ పోటీలను ఎంపీ విజయ్ మొదటి బంతి ఆడి ప్రారంభించారు. ఎంపీపీ స్కూల్లో ప్లే గ్రౌండ్‌ను ప్రారంభించి ప్రాంగణంలో మొక్కలు నాటడంతో పాటు విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. 'గడపగడపకు' కార్యక్రమంలో భాగంగా బీసీ కాలనీలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత రెండేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.

అనంతరం ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఎంపీ విజయ్ మాట్లాడుతూ.. నాతవరం ప్రజల ఆప్యాయత, ఆశీర్వాదాలు మరువలేనివన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆశీస్సులతో సొంత గడ్డపై అడుగుపెట్టడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. ముఖ్యంగా మంత్రి నారా లోకేష్ గురించి ప్రస్తావిస్తూ.. యువగళం పేరుతో సుమారు 4వేల కిలోమీటర్ల మేర పాదయాత్ర చేసి, పేదలు, మహిళలు, యువత కష్టాలను స్వయంగా తెలుసుకున్న ఏకైక దమ్మున్న నాయకుడు లోకేష్ అని కొనియాడారు. రాష్ట్రానికి, తెలుగుదేశం పార్టీకి నారా లోకేష్ భవిష్యత్తు అని స్పష్టం చేశారు. తన తండ్రికి 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎటువంటి అవినీతి మచ్చలేదని, ఆయన స్ఫూర్తితోనే తాను నిబద్ధతతో ముందుకు వెళ్తున్నానని తెలిపారు. తెలుగుదేశం పార్టీ మొదటి నుంచీ మహిళల పక్షపాతి అని, ఎన్టీఆర్ హయాం నుంచే మహిళలకు పెద్దపీట వేశారని విజయ్ గుర్తు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఉచిత బస్సు ప్రయాణం పథకానికి మహిళల నుంచి విశేష స్పందన వస్తోందని సంతోషం వ్యక్తం చేశారు. కేవలం రెండేళ్ల వ్యవధిలోనే నియోజకవర్గంలో సుమారు రూ.532 కోట్లతో అభివృద్ధి పనులు, రూ.568 కోట్లతో సంక్షేమ కార్యక్రమాలు కలిపి దాదాపు రూ.1100 కోట్లు ప్రజల కోసం వెచ్చించామని, 1896 పనులు పూర్తి చేశామని వివరించారు. రానున్న రోజుల్లో నాతవరం మండలంతో పాటు నర్సీపట్నం నియోజకవర్గ అభివృద్ధికి తాను, తన సోదరుడు రాజేష్ నిరంతరం కృషి చేస్తామని హామీనిచ్చారు. పర్యటనను విజయవంతం చేసిన జనసేన, బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు విజయ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## రాజకీయ లబ్ధి కోసమే కాకాణి కపట నాటకం

**పోలీసు శాఖపై నిరాధార ఆరోపణలు - మాజీమంత్రి సోమిరెడ్డి ధ్వజం**



నెల్లూరు (చైతన్యరథం): మనుబోలు మండలం ఏడుకొండలు మృతి ఘటనను రాజకీయ లబ్ధి కోసం వక్రీకరించి పోలీసు శాఖపై నిరాధార ఆరోపణలు చేయడం వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డికి అలవాటైందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విరుచుకుపడ్డారు. నిజాలు వెలుగులోకి రాకముందే పోలీసులను దోషులుగా చిత్రీకరించడం వారి మనోధైర్యాన్ని దెబ్బతీసే చర్య అని అన్నారు. "పోలీసులు తప్పు చేస్తే ముందుగా మేమే చర్యలు కోరతాం... కానీ అబద్ధాలతో ఆ శాఖను అపఖ్యాతిపాలు చేయడాన్ని సహించం" అని స్పష్టం చేశారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన సోమిరెడ్డి, ఇటీవల మనుబోలు మండలంలో జరిగిన వ్యవసాయ మోటార్లు, బంగారు గొలుసుల చోరీ కేసులో పోలీసులు విచారణ చేపట్టారని వెల్లడించారు. విచారణలో ఇద్దరు నిందితులు దొంగతనం చేసినట్లు అంగీకరించి, చోరీ సొత్తును కూడా అప్పగించారని చెప్పారు. అదే వ్యక్తులను పక్కన కూర్చోబెట్టి కాకాణి మీడియా సమావేశం నిర్వహించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. "దొంగతనం చేశామని ఒప్పుకున్న వారికే వైసీపీలో పదవులు ఇవ్వండి" అంటూ ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

ఏడుకొండలు మృతి బాధాకరమేనని, కానీ ఆ మరణానికి పోలీసులకు ఎలాంటి సంబంధం లేదని సోమిరెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీన పోలీసులు విచారించి పంపించగా, తర్వాత జరిగిన పరిణామాలన్నీ అధికారిక రికార్డులు, సీసీటీవీ దృశ్యాల్లో ఉన్నాయని చెప్పారు. మృతదేహానికి పోస్టుమార్టం, అవసరమైతే రీ పోస్టుమార్టం చేసే అవకాశమూ ఉందన్నారు. నిజాలు బయటకు వచ్చే వరకు రాజకీయ ప్రచారం చేయడం బాధ్యతారాహిత్యమని అన్నారు.

జిల్లా ఎస్పీ అజితపై కాకాణి చేస్తున్న విమర్శలను సోమిరెడ్డి ఖండించారు. శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ లేకుండా పనిచేస్తున్న అధికారిపై ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. బుచ్చిరెడ్డిపాళెం వ్యవసాయాధికారి హత్య కేసులో నిర్లక్ష్యం వహించిన సీఐని సస్పెండ్ చేయడం, స్టేషన్ సిబ్బందిని బదిలీ చేయడం, ముత్తుకూరులో విధుల్లో నిర్లక్ష్యం చూపిన అధికారులపై చర్యలు తీసుకోవడం ప్రస్తుత ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని స్పష్టం చేశారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఉదయగిరి నారాయణ కస్టడీ మరణం ఘటనను ప్రస్తావిస్తూ, అప్పట్లో జరిగిన ఘటనలను సమర్థించిన వారే ఇప్పుడు పోలీసు వ్యవస్థపై నీతులు చెప్పడం విడ్డూరమని సోమిరెడ్డి పేర్కొన్నారు. అప్పటి ఘటనల్లో నిజాలు బయటకు రాకుండా వ్యవహరించారని, బాధిత కుటుంబాలకు న్యాయం కోసం తాము పోరాడాల్సి వచ్చిందని గుర్తు చేశారు.

కాకాణిపై పలు కేసులు, పాత వివాదాలను ప్రస్తావించిన సోమిరెడ్డి, 2014 నకిలీ మద్యం కేసు, 2016 నకిలీ పత్రాల కేసు, భూకుంభకోణాల వ్యవహారాల్లో చట్టపరమైన ప్రక్రియ కొనసాగుతోందని అన్నారు. మట్టెంపాడు, వావిలేటిపాడు ప్రాంతాల్లో జరిగినట్లు తాము చెబుతున్న భూ అక్రమాలపై కూడా విచారణ జరిగి బాధ్యులపై చర్యలు తప్పవని వ్యాఖ్యానించారు.

వైసీపీ పాలనలో అమాయకులపై అక్రమ కేసులు, రౌడీషీట్లు, భూ ఆక్రమణలు, పేదలపై వేధింపులు జరిగాయని సోమిరెడ్డి ఆరోపించారు. ఇప్పుడు కూడా పోలీసులను లక్ష్యంగా చేసుకుని రాజకీయ ప్రయోజనాలు పొందాలని ప్రయత్నించడం ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

"చట్టం ముందు అందరూ సమానమే. పోలీసు తప్పు చేసినా చర్యలు తప్పవు... కానీ నిరాధార ఆరోపణలతో పోలీసుల మనోధైర్యాన్ని దెబ్బతీయాలనుకుంటే సహించం. నిజం ఎప్పటికైనా గెలుస్తుంది... చట్టమే తుది తీర్పు చెబుతుంది" అని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి స్పష్టం చేశారు.

చైతన్యరథం

# ఉద్యోగాల పేరిట రూ.20.50 లక్షలకు వైసీపీ నేత టోపీ

- గిరిజనుడి స్థలంపై వైసీపీ మహిళా నాయకురాలి కన్ను
- ఐదెకరాల భూమి రాసివ్వాలంటూ వైసీపీ రౌడీ మూకల దౌర్జన్యం
- ఫోర్జరీ పత్రాలతో భూమి కబ్జాకు యత్నం
- న్యాయం చేయాలంటూ టీడీపీ నేతలకు బాధితుల వినతి
- అర్జీలు స్వీకరించిన మంత్రి డీవీబీ స్వామి, మాదిగ సంక్షేమ సహకార ఆర్థిక సంస్థ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి



అమరావతి (చైతన్యరథం): వివిధ సమస్యలపై పెద్ద సంఖ్యలో అర్జీదారులు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయానికి తరలివచ్చారు. గురువారం నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో అర్జీలు సమర్పించుకున్నారు. బాధితుల నుండి సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డా.డోలా బాల వీరాంజనేయ స్వామి, ఏపీ మాదిగ సంక్షేమ సహకార ఆర్థిక సంస్థ లిమిటెడ్ చైర్‌పర్సన్ డా.ఉండవల్లి శ్రీదేవి వినతులు స్వీకరించారు.

సర్వ శిక్ష అభియాన్‌లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు ఇప్పిస్తానంటూ పలువురిదగ్గరనుండి లక్షలాది రూపాయలు వసూలు చేసి మోసగించటమే కాకుండా తన భర్త మరణానికి కారకుడైన వైసీపీ నేతపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన సరోజమ్మ అభ్యర్థించారు. గతంలో ఆదోని మున్సిపాలిటీలో టీడీపీ తరపున కౌన్సిలర్‌గా పనిచేశామని తెలిపారు. మూడు సంవత్సరాల క్రితం తన భర్త ఆంజనేయులుకు గుంటూరుజిల్లా తాడేపల్లికి చెందిన వైసీపీ నాయకుడు భవనం ఈశ్వర్‌రెడ్డితో పరిచయం ఏర్పడింది. 2024లో సర్వ శిక్ష అభియాన్ ద్వారా ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదలైన సమయం లో.. తనకు ఉన్నతాధికారులు, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బాగా తెలుసని ఈశ్వర్ రెడ్డి నమ్మబలికాడు. తన భర్త ద్వారా సుమారు 12 మంది నిరుద్యోగుల నుండి ఉద్యోగాల కోసం డబ్బులు వసూలు చేశాడు. ఈశ్వర్‌రెడ్డి వ్యక్తిగత మొబైల్ నెంబర్‌కు ఫోన్ పే ద్వారా, అలాగే ఆయన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అకౌంట్ నెంబర్‌కు విడతల వారీగా రూ.12,50,000 బదిలీ చేశాం. అంతేకాకుండా, ఈశ్వర్ రెడ్డి ఆదోని వచ్చినప్పుడు స్థానిక గెస్ట్ హౌస్‌లో తన సమక్షంలోనే నేరుగా మరో రూ.8,00,000నగదును తీసుకున్నాడు. ఇలా మొత్తంగా రూ.20,50,000వసూలు చేసి మోసగించాడు. డబ్బులు తీసుకున్నప్పటికీ ఉద్యోగాలు రాకపోవడం, అటు బాధితుల నుండి ఒత్తిడి పెరగడంతో ఆంజనేయులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వైసీపీ నాయకుడు చేసిన మోసం, నమ్మకద్రోహం కారణంగా తీవ్రమానసిక ఒత్తిడికి లోనైన ఆంజనేయులుకు బ్రెయిన్ స్ట్రోక్ (పక్షవాతం) వచ్చి అకాల మరణం చెందారు. తన భర్త మరణానికి భవనం ఈశ్వర్ రెడ్డే కారణమని, ప్రస్తుతం ఇద్దరు కుమారులతో తాను ఒంటరిగా మిగిలానని కన్నీటిపర్యంతమయ్యారు. తగు చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని అభ్యర్థించారు.

తన ఇంటిస్థలాన్ని కబ్జా చెర నుండి విడిపించి న్యాయం చేయాలని శ్రీ సత్యసాయిజిల్లా కదిరి మండలం పట్నం గ్రామానికి చెందిన డి.భాస్కర్‌నాయక్ విజ్ఞప్తి చేశారు. 2010వ సంవత్సరంలో నల్లచెరువు గ్రామంలోని సర్వే నంబర్ 133-410, 133-429లలో ముంతాజ్ బేగం అనే మహిళ వద్ద 125 చదరపు గజాల నివాస స్థలాన్ని చట్టబద్ధంగా కొనుగోలు చేశానన్నారు. నాటి నుండి ఆ స్థలం తన ఆధీనం లోనే ఉంది. అయితే, స్థానికంగా రాజకీయ పలుకుబడి ఉన్న వైసీపీ మహిళా నాయకురాలు మోదీనమ్మ తన స్థలంపై కన్ను వేశారు. గిరిజన సామాజిక వర్గానికి చెందిన తనకు ఎలాంటి అండలేదనే ఉద్దేశంతో మోదీనమ్మ తన అనుచరులతో కలిసి ఆ 125 చదరపు గజాల స్థలాన్ని అక్రమంగా కబ్జా చేశారు. స్థలం గురించి అడిగితే బెదిరింపులకు దిగుతున్నారు. కావున వారిపై చర్యలు తీసుకొని తమ భూ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

వైసీపీ నాయకుల వేధింపుల నుండి రక్షణ కల్పించాలని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం, తిరుమలాపురం గ్రామానికి చెందిన డా.మౌనిక యాగంటి విజ్ఞప్తి చేశారు. తన తండ్రి సుబ్రహ్మణ్యం మరణానంతరం కుటుంబంలో నలుగురు మహిళలే ఉండటాన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది వైసీపీ నాయకులు వ్యక్తిగత కక్షలతో వేధింపులకు దిగారు. తన వ్యవసాయ భూముల్లోకి అక్రమంగా చొరబడి, మోటార్ గేట్ వాల్ ను పగలగొట్టి ధ్వంసం చేశారు. పొలాల్లో పనులకు వచ్చే రైతులను, కూలీలను కూడా భయభ్రాంతులకు గురిచేస్తూ, ఎవరూ పొలంలోకి అడుగుపెట్టవద్దంటూ దౌర్జన్యం చేస్తున్నారు. దీనివల్ల తన కుటుంబానికి ఆర్థికంగా, మానసికంగా తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఇటీవల కాలంలో ఈ వేధింపులు మరీ ఎక్కువయ్యాయి. ప్రాణాలు దక్కించుకోవాలంటే రెండు కోట్లరూపాయలు ఇవ్వాలి,లేదా మీకున్న ఐదు ఎకరాల భూమిని మాకు అప్పగించాలంటూ సదరు రౌడీ మూకలు బహిరంగంగా హెచ్చరిస్తున్నారు. ఈ ప్రాణహాని, దౌర్జన్యాలపై జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్లో పలుమార్లు ఫిర్యాదుచేసినప్పటికీ స్థానిక పోలీసుల నుండి ఎలాంటి రక్షణకానీ, ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు కానీ తీసుకోలేదు. కావున వారిపై చర్యలు తీసుకొని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

తన భూమిని తప్పుడు పత్రాలతో కబ్జా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని పల్నాడు జిల్లా పిడుగురాళ్ళకు చెందిన నరసమ్మ విజ్ఞప్తి చేశారు. తమ మామ మొక్కరాల హనుమయ్య ఆయనకు వారసత్వంగా వచ్చిన 0,20సెంట్ల భూమిని 1992లో కోడలైన తన పేరు మీద రిజిస్ట్రేషన్ చేశారన్నారు. దీనికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు, అడంగల్, 1బి కాపీలు, సర్వే సర్టిఫికెట్లు అన్నీ పక్కాగా ఉన్నాయి.అయితే ఈభూమికి పక్కనే హద్దుదారుగా ఉన్న వైసీపీ నాయకుడొకరు గత ప్రభుత్వ హయాంలో రాజకీయ పలుకుబడితో ఆ 20సెంట్ల భూమిని కొనుగోలు చేసినట్లు తప్పుడు పత్రాలతో ఆన్‌లైన్‌లో అతడి పేరు మీదకు మార్పించుకున్నాడు. నా భూమిని నాకు ఇచ్చేయాలని కోరగా, పలుకుబడితో నా పైనే తప్పుడు కేసులు బనాయించారు.ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో తనతో పాటు తన కుటుంబ సభ్యులపై బైండోవర్ కేసులు నమోదు చేయించి, మూడు సార్లు పోలీస్ స్టేషన్‌లో ఉంచి తీవ్రంగా వేధించారు. వారిపై చర్యలు తీసుకొని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

తమ భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్న కొందరు నిరంతరం బెదిరిస్తున్నారని, తమకు న్యాయం చేయాలని చిత్తూరు జిల్లా గుడుపల్లి మండలం బూరుగులపల్లి గ్రామానికి చెందిన యశోదమ్మ విజ్ఞప్తి చేశారు. తనకు చెందిన 50సెంట్ల భూమిపై కన్నేసిన కొందరు వ్యక్తులు తప్పుడు సంతకాలు, ఫోర్జరీ డాక్యుమెంట్లతో ఒక అగ్రిమెంట్ బాండ్ సృష్టించారన్నారు. అందులో వారు రూ.30 లక్షలు ఇచ్చినట్లుగా,సేల్ అగ్రిమెంట్‌లో మరో రూ.50 లక్షలు రాసుకుని.. "డబ్బులైనా కట్టండి లేదా భూమినైనా వదిలేసి వెళ్ళిపోండి" అంటూ తనపై, తన పిల్లలపై నిరంతరం దౌర్జన్యానికి దిగుతున్నారు. ఈ అక్రమ కబ్జా ప్రయత్నంపై గుడుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. అధికారులు పట్టించుకోకపోవడంతో కబ్జాదారులు రోజురోజుకూ రెచ్చిపోతూ, తమపై మరింత దౌర్జన్యం చేస్తూ, బెదిరింపులకు గురిచేస్తున్నారు.కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

రీ సర్వేలో తేడాల వల్ల భూమి కోల్పోతున్న తనకు న్యాయం చేయాలని అనకాపల్లి జిల్లా యలమంచిలి మండలం పేరంటాలపాలెం గ్రామానికి చెందిన అచ్చియ్యమ్మ విజ్ఞప్తి చేశారు. రేగుపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 245లో తనకు 0.58సెంట్ల భూమి ఉంది. అయితే, గతంలో నిర్వహించిన రీసర్వే సమయంలో రికార్డుల్లో తీవ్ర వ్యత్యాసాలు చోటుచేసుకున్నాయి. ఈ తేడాల వల్ల 0.58సెంట్ల భూమికి గాను ప్రస్తుతం కేవలం 0.26సెంట్లు మాత్రమే రికార్డుల్లో నమోదైంది. మిగిలిన 0.32సెంట్ల భూమి రికార్డుల్లో మాయమైంది. ఈ రికార్డుల తప్పుల వల్ల తన భూమిని కోల్పోయే పరిస్థితివచ్చింది.ఈ విషయంపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి న్యాయం జరగలేదు.కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

సర్వేలో భూమి కొలత తక్కువగా వచ్చిందని, తనకు న్యాయంచేయాలని పల్నాడుజిల్లా రెంటచింతల మండలం పాలువాయి గ్రామాని చెందిన కొంగర వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. తమ గ్రామ శివారులోని సర్వే నెంబర్లు 356-1, 356-2లలో తనకు 2.18 ఎకరాల వ్యవసాయ భూమి ఉందన్నారు. ఈ భూమికి సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకాలు, ఆర్.ఎస్.ఆర్, 1-బి, అడంగల్ రికార్డులన్నింటిలోనూ 2.18 ఎకరాలుగానే స్పష్టంగా నమోదై ఉంది. అయితే, వాస్తవంగా క్షేత్రస్థాయిలో ఆ భూమిని కొలిచి చూస్తే కేవలం 1.90 ఎకరాలు మాత్రమే ఉంది. దాదాపు 0.28 సెంట్ల భూమి తక్కువగా చూపిస్తోంది. ఈ సమస్యపై గత 10 సంవత్సరాలుగా మండల తహశీల్దార్, ఆర్.డి.ఓ, జిల్లా కలెక్టరు కార్యాలయాల్లో దరఖాస్తులు చేసుకున్నప్పటికీ ఎలాంటి న్యాయం జరగలేదు. తగు చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

తమ ఇంటిని దౌర్జన్యంగా ఆక్రమించుకున్న వ్యక్తులపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని ఏలూరు జిల్లా మండవల్లి మండలం భైరవపట్నం గ్రామానికి చెందిన గొల్లేరు లక్ష్మి విజ్ఞప్తిచేశారు. తాము నిర్మించుకున్న ఇంటిని తమ బంధువులైన కొందరు దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని తెలిపారు. వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

వారసత్వంగా తమకు సంక్రమించిన పొలాన్ని కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని పల్నాడు జిల్లా క్రోసూరు మండలం గరికపాడు గ్రామానికిచెందిన తోట పద్మజ విజ్ఞప్తి చేశారు. 1966 నుంచీ అన్ని రికార్డులు పక్కాగా ఉన్న తమ ఆధీనంలోనే ఉన్న ఈభూమిని 7ఎకరాల 59 సెంట్ల భూమిని కొందరు కబ్జా చేశారన్నారు. తాము కానీ, తమ తండ్రి, ఇతర హక్కుదారులు కానీ ఈ భూమిని ఎవరికీ విక్రయించలేదు. కానీ సమీప గ్రామ సర్పంచ్ ఒకరు వెనుక ఉండి నడిపిస్తూ, సదరు భూమిని కబ్జా చేయించారు.ఆ భూమిపై పలురకాల నకిలీ రిజిస్ట్రేషన్లు సృష్టిస్తూ, అసలు హక్కుదారులైన తమని సాగు చేసుకోకుండా పొలంలోకి రాకుండా అడ్డుకుంటున్నారు. ఈ విషయమై ఎదురు తిరిగితే తీవ్ర పరిణామాల ఉంటాయని సర్పంచ్ వర్గీయులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. కొన్నేళ్లుగా తాము ఎన్ని ప్రయత్నాలు చేసినా వారి అక్రమాలను అడ్డుకోలేకపోతున్నాం. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

తన భూమిపై కన్నేసిన అన్నా, వదినలు తనను బెదిరిస్తూ, చిత్రహింసలకు గురి చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని అనంతపురంజిల్లా కందుకూరు గ్రామానికి చెందిన బి.కవిత విజ్ఞప్తి చేశారు. తనకు తల్లి నుండి సంక్రమించిన 2 ఎకరాల భూమిని గతంలో పెద్దల సమక్షంలో తనకు 'పసుపు కుంకుమ' కింద అగ్రిమెంట్ చేసి ఇచ్చారని తెలిపారు. ఈ 2ఎకరాల భూమే తమకు,తమ పిల్లలకు ఏకైక జీవనాధారం.ప్రస్తుతం అనంతపురంలో నివాసం ఉంటుండగా, ఈ 2 ఎకరాల భూమిపై తన అన్న, వదిన వారి బంధువుల కన్ను పడింది. గడిచిన మూడు నెలలుగా వారు తనను తీవ్ర మానసిక, శారీరక చిత్రహింసలకు గురిచేస్తున్నారు. ఆ భూమిని వారి పేరిట రాయించుకోవడానికి బెదిరిస్తూ హత్యాయత్నానికి సైతం ఒడిగట్టారు. ఈ వేధింపులపై గతంలో అనంతపురంజిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయగా, ఆయన సదరు నిందితులకు పలుమార్లు గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. అయినప్పటికీ, పోలీసుల హెచ్చరికలను ఏమాత్రం లెక్కచేయకుండా వారు తనపై నిరంతరం దాడులకు తెగబడుతున్నారు. కావునవారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఆక్రమణదారులపై చర్యలుతీసుకుని శ్మశానవాటిక స్థలాన్ని కాపాడాలని కాకినాడజిల్లా కాజులూరు మండలం పాతమండేజరు గ్రామానికి చెందిన సూర్య నారాయణ మూర్తి విజ్ఞప్తిచేశారు. తమ గ్రామ పరిధిలోని సర్వేనెంబర్ 207లో శ్మశాన వాటికకు రికార్డుల ప్రకారం 3.40ఎకరాల భూమి ఉందన్నారు. అయితే, ఈ భూమిపై కన్నేసిన కొందరు స్థానిక వ్యక్తులు రికార్డులను తారుమారుచేసి,అత్యధిక భాగాన్ని అక్రమంగా ఆక్రమించుకున్నారు. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో కేవలం 60 సెంట్ల భూమి మాత్రమే మిగిలి ఉంది. మిగిలిన భూమినంతా కబ్జాదారులు తమ ఆధీనంలోకి తెచ్చుకోవడమే కాకుండా, అంత్యక్రియల నిమిత్తం అక్కడికి వెళ్లే గ్రామ ప్రజలను, పార్థివ దేహాల వాహనాలను రాకుండా అడ్డుకుంటూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఈ శ్మశాన భూమి వివాదంపై గతంలో కోర్టు కూడా ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో అధికారులు ఆ ఆదేశాలను అమలు చేయలేదు. వారిపై చర్యలు తీసుకోని పూర్తి శ్మశాన భూమిని సర్వే చేసి సరిహద్దులు నిర్ణయించాలని, కబ్జాదారుల నుండి భూమిని విడిపించి చుట్టూ రక్షణ గోడ నిర్మించాలని కోరారు.

డబుల్ రిజిస్ట్రేషన్‌తో మోసగించిన మహిళపై చర్యలు తీసుకుని,తనకు న్యాయం చేయాలని ఎన్టీఆర్ జిల్లా విజయవాడకు చెందిన రావి అనిత విజ్ఞప్తి చేశారు. 2019లో తన స్నేహితురాలు అనురాధ దగ్గర నుంచి నమ్మకంతో ఒక స్థలాన్ని కొనుగోలు చేశానని తెలిపారు. అయితే, రెండేళ్ల క్రితం ఆ స్థలాన్ని అమ్ముదామని భావించి అక్కడికి వెళ్లగా..అప్పటికే ఆ స్థలంలో వేరే ఎవరో ఇల్లు నిర్మించి ఉండటం చూసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానన్నారు. దీనిపై విచారించగా, ఆ స్థలాన్ని డబుల్ రిజిస్ట్రేషన్ చేశారని,తనను మోసం చేసి వేరేవాళ్లకు కూడా దాన్ని కట్టబెట్టారని తెలిసింది. ఈ మోసంపై తన స్నేహితురాలు అనురాధను నిలదీయగా,ఆమె సమాధానం చెప్పకుండా ముఖంచాటేస్తూ తప్పించుకు తిరుగుతోంది. దీంతో న్యాయం కోసం తాడేపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించగా దాదాపు ఏడాదిన్నర పాటు స్టేషన్ చుట్టూ తిరిగిన తర్వాత ఆరు నెలల క్రితం పోలీసులు ఎఫ్ఐఆర్ అయితే నమోదు చేశారు కానీ, ఇప్పటివరకు నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా కేసును పూర్తిగా పక్కన పెట్టేశారు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

వీటితో పాటు పలువురు పింఛన్, రేషన్,ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్‌లు ఇచ్చారు.అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థిక తోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.






# పారిశ్రామిక ప్రగతి

## 'చంద్రబాబు బ్రాండ్'తో మారిన రాష్ట్ర భవిష్యత్తు

## సత్ఫలితాలు ఇస్తున్న లోకేష్ విదేశీ పర్యటనలు

## ఏపీవైపు పరుగులు తీస్తున్న గ్లోబల్ కంపెనీలు

## రెండేళ్లలోనే రూ.20 లక్షల కోట్ల పెట్టుబడుల దిశగా అడుగులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో కనిపించిన అతిపెద్ద మార్పు ఏదైనా ఉందంటే అది "ట్రస్ట్". పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం మీద నమ్మకం ఏర్పడింది. విధానాల్లో స్థిరత్వం ఉంటుందనే విశ్వాసం వచ్చింది. అనుమతుల కోసం నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదనే ధైర్యం వచ్చింది. ముఖ్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేరు, ఆయన పాలనా అనుభవం, ప్రపంచ స్థాయి నెట్‌వర్క్... ఇవే నేడు ఆంధ్రప్రదేశ్‌కు అతి పెద్ద బ్రాండ్ అంబాసిడర్లుగా మారాయి.

### పెట్టుబడుల గమ్యస్థానంగా ఏపీ

రెండేళ్లలో రాష్ట్రానికి దాదాపు రూ.20లక్షల కోట్ల పెట్టుబడులు రావడం చిన్న విషయం కాదు. ఇది దేశంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న పెట్టుబడి గమ్యస్థానాల్లో ఏపీని నిలబెట్టింది. రాష్ట్ర ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు ద్వారా రూ.7.66 లక్షల కోట్ల పెట్టుబడులు ఇప్పటికే క్లియర్ అయి గ్రౌండింగ్ దశలో ఉండటం చూస్తే... ప్రకటనలు మాత్రమే కాదు, అమలు కూడా వేగంగా జరుగుతోందనే విషయం స్పష్టమవుతోంది.

ఈ పెట్టుబడుల వెనుక ఉన్న అసలు బలం ఒక్కటే... "చంద్రబాబు బ్రాండ్." దావోస్ నుంచి దుబాయ్ వరకు... ఢిల్లీ నుంచి సియోల్ వరకు... ఎక్కడికి వెళ్లినా ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ అంతర్జాతీయ సంస్థల సీఈవోలు, పారిశ్రామిక దిగ్గజాలతో జరిపిన సమావేశాలు ఇప్పుడు ఫలితాలుగా మారుతున్నాయి.

గూగుల్ ఏఐ డేటా సెంటర్, అమరావతి క్వాంటం వ్యాలీ, ఎలక్ట్రానిక్స్ క్లస్టర్లు, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు... ఇవన్నీ కేవలం ప్రాజెక్టులు కాదు. ఇవి రాబోయే దశాబ్దాల ఉద్యోగాల పునాది.

ఒకప్పుడు పరిశ్రమ పెట్టాలంటే అర ఎకరం భూమి కోసం కూడా క్యాబినెట్ ఆమోదం కోసం నెలల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు 50 ఎకరాలలోపు భూముల కేటాయింపును ఏపీఐఐసీ స్థాయిలోనే పూర్తి చేసేలా విధానాన్ని మార్చడం పరిపాలనా సంస్కరణకు మంచి ఉదాహరణ. ప్రభుత్వం అంటే అడ్డంకి కాదు... భాగస్వామి అనే భావనను ఈ మార్పు తీసుకొచ్చింది.

అదే సమయంలో పరిశ్రమల పేరుతో భూములు తీసుకుని పనులు ప్రారంభించకుండా నిల్వ పెట్టే సంస్కృతికి కూడా ప్రభుత్వం బ్రేక్ వేసింది. ఇప్పటికే వందలాది నోటీసులు జారీ చేసి భూముల వినియోగంపై కఠినంగా వ్యవహరించడం ద్వారా నిజమైన పెట్టుబడిదారులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు సంకేతం ఇచ్చింది.

పెట్టుబడులు వస్తే ఉద్యోగాలు వస్తాయి. కానీ ఉద్యోగాలపై పర్యవేక్షణ కూడా అంతే ముఖ్యమని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే ఎన్నికల్లో ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాల హామీని కేవలం ఎన్నికల వాగ్దానంగా కాకుండా ప్రభుత్వ బాధ్యతగా తీసుకుంది. ఉద్యోగాల కల్పన కోసం ప్రత్యేక మంత్రివర్గ ఉప సంఘం పని చేయడం, వచ్చిన ఉద్యోగాలను ఆధార్‌తో అనుసంధానం చేసి పారదర్శక వ్యవస్థను తీసుకురావడం దేశంలోనే కొత్త ప్రయోగంగా చెప్పవచ్చు.

యువతకు ఉద్యోగాలు కల్పించడం అంటే కేవలం పెద్ద కంపెనీలను తీసుకురావడం మాత్రమే కాదు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా అవకాశాలు పెరగాలి. అందుకే రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో 175 ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. "ఇంటింటికీ ఒక పారిశ్రామికవేత్త" అనే లక్ష్యం వినడానికి నినాదంలా అనిపించినా... గ్రామీణ పారిశ్రామికీకరణ దిశగా కీలక ఆలోచన.

త్వరలో రానున్న ఏపీ టాయ్స్ మాన్యుఫాక్చరింగ్ పాలసీ, ఫర్నిచర్ మాన్యుఫాక్చరింగ్ పాలసీ, ఇండస్ట్రియల్ హౌసింగ్ పాలసీ... పరిశ్రమల ఎకో సిస్టమ్‌ను మరింత బలోపేతం చేయనున్నాయి. ప్రపంచ స్థాయి పరిశ్రమలు రావాలంటే కార్మికులకు కూడా ప్రపంచ స్థాయి వసతులు ఉండాలనే ఆలోచన ఈ విధానాల వెనుక కనిపిస్తోంది.




### సీడ్ టు ప్లేట్ విజన్...

వ్యవసాయం బలంగా ఉంటేనే పరిశ్రమలు బలపడతాయి. అందుకే ప్రభుత్వం "సీడ్ టు ప్లేట్" విజన్‌తో ఆహార శుద్ధి రంగాన్ని అభివృద్ధి చేస్తోంది. రూ.30వేల కోట్ల పెట్టుబడులను ఈ రంగంలో ఆకర్షించాలనే లక్ష్యంతో ఇప్పటికే సగానికి పైగా పెట్టుబడులను తీసుకొచ్చినట్టు ప్రభుత్వం చెప్తోంది.

భారతదేశంలో ఉత్పత్తి అయ్యే కోకో బీన్స్‌లో సగం ఆంధ్రప్రదేశ్ నుంచే రావడం రాష్ట్రానికి ఉన్న ప్రత్యేకత. ఈ బలాన్ని ఉపయోగించుకుని విలువ ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేయడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం కల్పించే ప్రయత్నం జరుగుతోంది.

కర్నూలు జిల్లాలో టమాటా రైతులు పంటను రోడ్లపై పారబోసే రోజులు గుర్తున్నాయి. ఇప్పుడు



అదే ప్రాంతంలో భారీ టమాటా ప్రాసెసింగ్ ప్లాంట్ నిర్మాణం చివరి దశకు చేరుకోవడం రైతులకు భరోసానిస్తోంది. అనకాపల్లిలో పనసపండు, చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్లు, తిరుపతి ఐఐటీ ఇంక్యుబేషన్ కేంద్రంలో మామిడి, టమాటా, సిట్రస్ ప్రాసెసింగ్... ఇవన్నీ రైతు ఉత్పత్తికి మార్కెట్ విలువ పెంచే ప్రయత్నాలే.

### నవంబరులో గ్లోబల్ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్

ప్రపంచ పెట్టుబడిదారులను మరోసారి ఏపీవైపు తిప్పేందుకు ప్రభుత్వం నవంబరులో గ్లోబల్ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ నిర్వహించబోతోంది. దేశవ్యాప్తంగా, విదేశాల్లో రోడ్‌షోలు నిర్వహిస్తూ ఏపీ అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయాలని నిర్ణయించింది. ఇది ఒక రాష్ట్రం తనను తాను ప్రపంచ పెట్టుబడి మ్యాప్‌లో ఎలా నిలబెట్టుకోవాలో చూపించే ప్రయత్నం.




అరకు కాఫీకి ప్రపంచ మార్కెట్లో మరింత బ్రాండింగ్ కల్పించడం కూడా ఇదే ఆలోచనలో భాగం. గిరిజన రైతు పండించిన ఉత్పత్తి అంతర్జాతీయ మార్కెట్లో విలువ పెంచుకుంటేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది.

గత ప్రభుత్వ కాలంలో పరిశ్రమలు తగ్గుముఖం పట్టాయని, పెట్టుబడిదారుల్లో అనిశ్చితి పెరిగిందనే విమర్శలొచ్చాయి. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిందని ప్రభుత్వం చెప్తోంది. దేశ, విదేశాల్లోని పెట్టుబడిదారులు తిరిగి ఏపీవైపు చూస్తుండటం, పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌లో వచ్చిన పెట్టుబడుల్లో ఇప్పటికే 40శాతానికి పైగా గ్రౌండింగ్ దశకు చేరుకోవడం ఆ మార్పునకు సంకేతంగా కనిపిస్తోంది.

**ఒక రాష్ట్ర భవిష్యత్తును మార్చేది కేవలం ప్రకటనలు కాదు... పెట్టుబడులు.**
**పెట్టుబడులు వస్తే పరిశ్రమలు వస్తాయి.**
**పరిశ్రమలు వస్తే ఉద్యోగాలు వస్తాయి.**
**ఉద్యోగాలు వస్తే యువత భవిష్యత్తు మారుతుంది. అదే అసలు అభివృద్ధి.**
**ఈ సత్యాన్ని గత రెండేళ్లలో ఆంధ్రప్రదేశ్ మరోసారి నిరూపించింది.**
**ఒకప్పుడు పెట్టుబడిదారులు ఆంధ్రప్రదేశ్ వైపు చూడడానికి కూడా వెనుకాడిన పరిస్థితి. నేడు ప్రపంచ స్థాయి కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడుల కోసం పోటీపడుతున్న పరిస్థితి.**
**ఈ మార్పు యాదృచ్ఛికం కాదు.**
**ఇది నాయకత్వంపై ఏర్పడిన నమ్మకం ఫలితం.**
**అందుకే "రెండేళ్ల నమ్మకం" అనే మాట ఇప్పుడు రాజకీయ నినాదం కాదు... పారిశ్రామిక వాస్తవం.**

ప్రపంచ స్థాయి కంపెనీలు ఒక రాష్ట్రంలో పెట్టుబడి పెట్టే ముందు అక్కడి రాజకీయ స్థిరత్వం, విధానాల పారదర్శకత, ప్రభుత్వ స్పందన, మౌలిక వసతులు, నాయకత్వంపై విశ్వాసం... ఈ ఐదు అంశాలను ప్రధానంగా పరిశీలిస్తాయి. గత రెండేళ్లలో ఆంధ్రప్రదేశ్ ఈ ఐదు రంగాల్లో సానుకూల సంకేతాలు ఇవ్వగలిగిందనే అభిప్రాయం పెట్టుబడుల రూపంలో కనిపిస్తోంది.

అయితే అసలు పరీక్ష ఇప్పుడు మొదలవుతోంది. ప్రకటించిన పెట్టుబడులన్నీ ఎంత వేగంగా గ్రౌండింగ్ అవుతాయి? వాగ్దానం చేసిన 20లక్షల ఉద్యోగాలు ఎంత వేగంగా యువతకు అందుతాయి? పరిశ్రమలు గ్రామీణ ప్రాంతాల వరకు ఎంతమేర విస్తరిస్తాయి? చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఎంత బలోపేతం అవుతాయి? ఇవే రాబోయే సంవత్సరాల్లో ప్రభుత్వ పనితీరును నిర్ణయించే అసలు ప్రమాణాలు.

అయినప్పటికీ ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. రెండేళ్లలో ఆంధ్రప్రదేశ్‌పై పెట్టుబడిదారుల నమ్మకం తిరిగి వచ్చింది. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పరిశ్రమలను ఉత్పత్తిగా, ఉత్పత్తిని ఉద్యోగాలుగా, ఉద్యోగాలను యువత భవిష్యత్తుగా మార్చగలిగితే... "స్వర్ణాంధ్ర 2047" కేవలం ఒక విజన్ డాక్యుమెంట్‌గా కాకుండా, ఆచరణలో కనిపించే అభివృద్ధి గాథగా నిలిచే అవకాశం ఉంది.

ఎందుకంటే... పెట్టుబడులు రాష్ట్రాన్ని మార్చవు. ఆ పెట్టుబడులపై ప్రజల్లో ఏర్పడిన నమ్మకమే రాష్ట్ర భవిష్యత్తును మారుస్తుంది. ఇదే గత రెండేళ్ల ఆంధ్రప్రదేశ్ కథ. ఇదే "రెండేళ్ల నమ్మకం"కు అసలైన అర్థం.

**శశికుమార్**
**తెలుగుదేశం సైనికుడు**



## కురుపాం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పార్టీలోకి చేరికలు

● జెండా కప్పి ఆహ్వానించిన ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి



పార్వతీపురం (చైతన్యరథం): పార్వతీపురం మన్యం జిల్లా, గుమ్మలక్ష్మీపురం మండలం, రాయఘడ జమ్ము పంచాయతీ పరిధిలోని వల్లాడ గ్రామానికి చెందిన 65 కుటుంబాలు గురువారం నాడు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, కురుపాం నియోజకవర్గ శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి వారికి పార్టీ పసుపు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పెద్ద ఎత్తున ప్రజలు స్వచ్ఛందంగా తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తుండటంతో టీడీపీపై రోజురోజుకూ విశ్వాసం పెరుగుతోందన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి గ్రామానికి ప్రభుత్వ పథకాల ఫలాలు చేరేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు ఉంటుందని, పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వల్లాడ గ్రామానికి చెందిన 65 కుటుంబాలు ఒకేసారి టీడీపీలో చేరడం పార్టీకి మరింత బలాన్ని చేకూరుస్తుందని ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## కేజీ బీవీ పాఠశాలలో ఎమ్మెల్యే జీఎంఆర్ తనిఖీలు



హీర మండలం (చైతన్యరథం): హీర మండలం కేజీ బీవీ పాఠశాలలో ఎమ్మెల్యే ఏం గోవిందరావు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. స్టాక్ రూంలో ఉన్న సరుకులను పరిశీలించారు. తాగునీరు, పరిసర ప్రాంతాలు, శౌచాలయాలు శు భ్రంగా ఉంచాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, కూరగాయలు నాణ్యమైనవి కొనుగోలు చేయాలన్నారు. కేజీబీవీ పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వసతి గృహంలో చిన్న చిన్న లోపాలు ఉన్నాయని వాటిని సరిచేసుకోవాలని సిబ్బందికి ఎమ్మెల్యే సూచించారు. మరోసారి పాఠశాలను తనిఖీ చేస్తానని అప్పటికీ ఇలాగే ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఎంఈఓ కే రాంబాబును ఎమ్మెల్యే ఆదేశించారు.

## సమస్యలు పరిష్కరించే దిశగా కృషి



విజయనగరం (చైతన్యరథం): ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా దృష్టి సారించాలని జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. విజయనగరం కలెక్టరేట్లో మంత్రి అనిత జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా చేపట్టాలని, సంక్షేమ ఫలాలు ప్రజలందరికీ అందాలని కోరారు. గత సమావేశంలో ప్రజా ప్రతినిధులు ప్రస్తావించిన అంశాలు, అధికారులు తీసుకున్న చర్యలపై చర్చించారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, ఎస్పీ ఏఆర్ దామోదర్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, తదితరులు ఉన్నారు.

## బంగాళాఖాతంలో అల్పపీడనం

బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అమరావతి వాతావరణ కేంద్రం ప్రకారం.. వాయువ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న ఉత్తర ఒడిశా - పశ్చిమ బెంగాల్ తీరాల మీదుగా ఉన్న అల్పపీడనం, జూలై 16న ఉదయం అదే ప్రాంతంలో బలమైన అల్పపీడన ప్రాంతంగా మారింది. దీని అనుబంధ ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి, ఎత్తు పెరిగే కొద్దీ నైరుతి దిశగా వంగి ఉంది. ఇది రాబోయే 2 రోజులలో ఉత్తర ఒడిశా, గంగానది పశ్చిమ బెంగాల్ మీదుగా వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉంది. సగటు సముద్ర మట్టం వద్ద ఉన్న రుతుపవన ద్రోణి ఇప్పుడు జమ్మూ, బరేలీ, బస్తీ, డాల్టన్‌గంజ్, వాయువ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న ఉత్తర ఒడిశా -- పశ్చిమ బెంగాల్ తీరాల మీదుగా ఉన్న బలమైన అల్పపీడన ప్రాంత కేంద్రం గుండా ప్రయాణించి, అక్కడి నుండి తూర్పు-ఆగ్నేయ దిశగా ఈశాన్య బంగాళాఖాతం వైపు కదులుతుంది.

## అర్జీల పరిష్కారంలో ప్రజలు సంతృప్తి చెందాలి : ఎమ్మెల్యే నిమ్మక




భామిని (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కారంలో అర్జీ పెట్టిన ప్రతీ వ్యక్తి సంతృప్తి చెందేలా ఉండాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, జిల్లా కలెక్టర్ ప్రభాకర రెడ్డిలు పేర్కొన్నారు. గురువారం మేజర్ పంచాయతీ బత్తిలిలో 'వన్ మంత్.. వన్ విలేజ్.. ఫోర్ విజిట్స్' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు జిల్లాలో 'ఒక నెల.. ఒక గ్రామం.. నాలుగు సందర్శనలు' కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామన్నారు. అందులో అందిన అర్జీలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు వివిధ సమస్యలకు సంబంధించిన వినతి పత్రాలను కలెక్టరుకు అందజేశారు. గ్రామస్థాయిలో ఉన్న సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వివిధ శాఖల పరిధిలో నమోదైన దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ప్రజల నుంచి అందిన అర్జీల పరిష్కార ప్రగతిని కలెక్టర్ సమీక్షించారు. వచ్చే వారం నాటికి అర్జీలన్నింటిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## సుపరిపాలనలో కురుపాం మేజర్ పంచాయతీకి ఐ.ఎస్.ఓ గుర్తింపు




కురుపాం (చైతన్యరథం): ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడం, సమర్థవంతంగా దస్త్రాల నిర్వహణ, పారిశుద్ధ్యం, పారదర్శక పరిపాలన, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రంలోని 23 గ్రామ పంచాయతీలకు అంతర్జాతీయ ప్రమాణాల సంస్థ (ఐఎస్ వో) ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ జాబితాలో పార్వతీపురం మన్యం జిల్లా నుంచి కురుపాం మేజర్ గ్రామ పంచాయతీ ఉండడం విశేషం. తాడేపల్లిలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ కమీషనర్ కృష్ణతేజ చేతుల మీదుగా పంచాయతీ ఈవో ఎ. వెంకటనాయుడు ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు. గతంలో పనిచేసిన పంచాయతీ ఈవో కె. సురేష్ తోపాటు ప్రస్తుత ఈవో వెంకటనాయుడు, సిబ్బంది సమిష్టిగా కృషి చేయడం వల్లే ఈ అరుదైన గుర్తింపు సాధ్యమైందన్నారు. ఐఎస్వో ధ్రువీకరణ పత్రం లభించడం మండలానికి గర్వకారణమని అధికారులు తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ, పారదర్శక పాలనను కొనసాగించి, పంచాయతీకి మరిన్ని గుర్తింపులు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## టీడీపీ తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక : ఎంపీ కలిశెట్టి



విజయనగరం (చైతన్యరథం): పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు ఆధ్వర్యంలో గురువారం ఎచ్చెర్ల నియోజకవర్గం, రణస్థలం మండలం హెడ్ క్వార్టర్‌లో ఎంపీ క్యాంప్ కార్యాలయం నందు ఎచ్చెర్ల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా డిసిఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, నియోజకవర్గం నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, జనరల్ సెక్రెటరీలు, PACS చైర్మన్లు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు డీజీఎం ఆనందరావు, పిసిని జగన్నాథం నాయుడు, బాల బొమ్మన వెంకటేశ్వరరావు, ఇనపకుర్తి తోటయ్య దొర, లంక నారాయణరావు, వద్దుపల్లి శ్రీనివాస్‌రావు, ముక్కు ఆదినారాయణ, దుమ్ము అశోక్, మైలపల్లి పోలీస్, ధన్నాన సత్తిబాబు, లంకలపల్లి శ్రీను, కొప్పిశెట్టి లక్ష్మణరావు, సూరడా రాముడు, ధన్నాన మహేష్, సుంకర ధనుంజయ రావు, శంబాన రమేష్, దుమ్ము రత్నరాజు, ధన్నాన వంశీ, బగ్గు జ్ఞానేశ్వరరావు, బాలి శ్రీను, సత్యం అప్పడు, కలిశెట్టి కన్నంనాయుడు, ధన్నాన స్వామినాయుడు, చిత్తిరి నారాయణరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లు, యూనిట్ ఇన్‌ఛార్జ్‌లు తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అప్పలనాయుడు మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ అనేది కేవలం ఒక రాజకీయ పార్టీ మాత్రమే కాదు, తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక. పార్టీ స్థాపించిన నాటి నుంచి ప్రజాసేవ, అభివృద్ధి, సంక్షేమం అనే లక్ష్యాలతో ముందుకు సాగుతోంది. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త చేసిన కృషి అమూల్యమైనది. కార్యకర్తలే పార్టీకి వెన్నెముక. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దూరదృష్టి నాయకత్వంలో రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలో నడిపిస్తూ, ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పరిపాలన అందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రానికి పెట్టుబడులు, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువతకు ఉద్యోగ అవకాశాల కల్పన వంటి అనేక రంగాల్లో వేగవంతమైన పురోగతి సాధిస్తోంది. ఈ విజయాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లే బాధ్యత మన అందరిదీ. ప్రభుత్వం చేస్తున్న ప్రతి మంచి పనిని ఇంటింటికీ చేరవేయాలి. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలి.

## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పోలీసులు పిలుపు




ఆనందపురం (చైతన్యరథం): 'పల్లెబాట'లో భాగంగా విశాఖపట్నం సిటీ పోలీసుల ఆధ్వర్యంలో ఆనందపురం మండలం బోని గ్రామంలో గురువారం ఈగల్ యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థుల భాగస్వామ్యంతో జరిగిన ఈ కార్యక్రమంలో గంజాయి, మద్యం తదితర మాదక ద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తులు, కుటుంబాలు, సమాజంపై పడే దుష్ప్రభావాలను పోలీసులు వివరించారు. ఈ మేరకు ఈగల్ టీం సీఐ టి. కల్యాణి మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలన్నారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల సాగు, రవాణా, విక్రయాల వినియోగాన్ని అరికట్టడంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతోనే డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆనందపురం సీఐ వి.వి.సి.ఎం.ఎర్రం నాయుడు, పోలీసులు, ఈగల్ బృందం సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జోన్ - 2
(కాకినాడ, అమలాపురం, నర్సాపురం, రాజమహేంద్రవరం, ఏలూరు)
చైతన్యరథం

# ముద్రగడ మరణాన్ని వైసీపీ స్వార్థ రాజకీయాలకు వాడుకోవడం శోచనీయం

**● టీడీపీ ఎల్లప్పుడూ ముద్రగడకు సముచిత గౌరవం ఇచ్చింది: జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**



జగ్గంపేట (చైతన్యరథం): కాపు సామాజిక వర్గ ఉద్యమకారుడు, మాజీమంత్రి దివంగత ముద్రగడ పద్మనాభం మరణం అత్యంత బాధాకరమని, అనేక ఉన్నత పదవులను అధిష్టించి ఆ పదవులకే వన్నె తెచ్చిన గొప్ప నాయకుడు అని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, జగ్గంపేట శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ అన్నారు. ఆయన మరణాన్ని వైసీపీ నాయకులు, సాక్షి మీడియా తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం సిగ్గుచేటున్నారు. వైసీపీ నాయకులు చావులో కూడా టీడీపీ, జనసేన అధినేతలపై అభూతకల్పనలు సృష్టించడం అత్యంత దుర్మార్గమన్నారు. ముద్రగడ పద్మనాభం మరణం క్యాన్సర్ వ్యాధి కారణంగా జరిగితే... అందుకు కూటమి నాయకులు కారణం అనేవిధంగా సాక్షి మీడియా అబద్ధాలు రాయడం దారుణమన్నారు. నాడు అన్న ఎన్టీఆర్... ముద్రగడకు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చి, తన క్యాబినెట్‌లో మంత్రిని చేశారని, అనంతరం కాంగ్రెస్‌లోకి వెళ్లి బయటకు వచ్చినప్పుడు కూడా నారా చంద్రబాబునాయుడు ఆయనను పార్టీలోకి ఆహ్వానించి ఎంపీగా సముచిత గౌరవం ఇచ్చారని అన్నారు. కాపులను బీసీల్లో చేర్చాలని కేంద్రానికి చంద్రబాబునాయుడు అసెంబ్లీ తీర్మానం చేశారని పంపారని, కేంద్రం ఇచ్చిన 10% ఈబీసీ కోటాలో 5% రిజర్వేషన్లను కాపులకే కేటాయించిన ఘనత చంద్రబాబునాయుడుకు దక్కుతుందన్నారు. కాపు ఉద్యమ సమయం శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకున్నప్పటికి, ముద్రగడని టీడీపీ ఎప్పుడూ వ్యక్తిగతంగా ఇబ్బంది పెట్టలేదన్నారు. ముద్రగడపై ఇప్పుడు అభిమానం చూపిస్తున్న జగన్... చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో ఉన్నప్పుడు ఆసుపత్రికి వెళ్లి ఎందుకు పరామర్శించలేదని జ్యోతుల నెహ్రూ ప్రశ్నించారు. ముద్రగడ పద్మనాభం బ్రతికున్నప్పుడు తన సమాధి ఇంటి పక్కనే చేయాలని, భార్యను పుణ్యస్త్రీగా ఉండనివ్వాలని కొన్ని మాటలు చెప్పింది నిజమే.... కానీ, తన హక్కుగా రావాల్సిన 'ప్రభుత్వ లాంఛనాలతో' అంత్యక్రియలను సైతం వైసీపీ నాయకులు అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. కన్న కూతురికి తండ్రి చివరి చూపు దక్కకుండా చేయడంలో వైసీపీ నాయకులు జ్యోకం ఎందుకని, వారి వ్యక్తిగత కుటుంబ విషయాల్లో వైసీపీ ఎందుకు తలదూరుస్తుందని జ్యోతుల నెహ్రూ నిలదీశారు. హిందూ ధర్మం ప్రకారం శత్రువు చనిపోయినా వెళ్లి చూస్తాం... అలాంటిది కన్న కూతురిని అడ్డుకొని, ఆమెను తండ్రికి దూరం చేసిన పాపం వైసీపీ నాయకులదేనన్నారు. ముద్రగడ మరణంపై వైసీపీ నాయకులు ఇకనైనా శవరాజకీయాలు చేయడం మానుకోవాలని జ్యోతుల నెహ్రూ హితవు పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, జిల్లా మాజీ మీడియా కోఆర్డినేటర్ ఉండవల్లి వీర్రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోదిరెడ్ల సుబ్బారావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ బొడ్డేటి సుమన్ తదితరులు పాల్గొన్నారు.


# ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లకు సంపూర్ణ మద్దతు



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ సింగ్‌నగర్‌లోని, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యుల కార్యాలయంలో ఆర్టీసీ ఉద్యోగ సంఘాల సంయుక్త కార్యాచరణ కమిట నాయకులు ప్రభుత్వ విప్, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావుని కలిసి తమ సమస్యలను వివరించి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, RTC ఉద్యోగ సంఘాల JAC ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చిన న్యాయమైన డిమాండ్లకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న విద్యుత్ వాహనాల విధానాన్ని అనుసరించడం అవసరమేనని, అయితే కొత్తగా ప్రవేశపెట్టే Ôáఎలక్ట్రిక్ బస్సుల్లో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న డ్రైవర్లు, కండక్టర్లనే కొనసాగించాలని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అనుభవజ్ఞులైన డ్రైవర్లు, కండక్టర్లు ప్రజలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చగల సామర్థ్యం కలిగి ఉన్నారని, వారి సేవలను కొనసాగించడం వల్ల ఉద్యోగులకు భరోసా కలగడంతో పాటు ప్రయాణికుల భద్రత కూడా మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణను పూర్తిగా ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే ఉద్యోగులతో పాటు ప్రజలు కూడా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఉద్యోగ సంఘాలు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని, ఉద్యోగుల భద్రతకు భరోసా కల్పించే అంశాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి, సత్వర పరిష్కారం కోసం కృషి చేస్తామని బొండా ఉమామహేశ్వరరావు హామీ ఇచ్చారు. ఎప్పటిలాగే విద్యుత్ బస్సుల నిర్వహణలో ఉద్యోగుల సేవలు కొనసాగేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని ఆయన తెలిపారు.

# తాగునీటి మౌలిక సదుపాయాల బలోపేతానికి మరో కీలక అడుగు

**●రూ.50.76 లక్షలతో మున్నేరు వాటర్ సప్లై పంపింగ్ మెయిన్ పనులకు ఆమోదం : ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**



నందిగామ (చైతన్యరథం): నందిగామ పురపాలక సంఘ పరిధిలో తాగునీటి సరఫరాను మరింత మెరుగుపరిచే దిశగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. 15వ ఆర్థిక సంఘం 2024-25 సంవత్సరానికి తొలి విడత టైడ్ గ్రాంట్ కింద మంజూరైన నిధులతో నందిగామ పట్టణంలో 6వ వార్డు బాబు జగ్జీవన్‌రామ్ భవన్ నుంచి 2వ వార్డు మార్కెట్ యార్డు వరకు 315 మి.మీ. హెచ్‌డీపీఈ మున్నేరు వాటర్ సప్లై పంపింగ్ మెయిన్ ఏర్పాటు పనులకు రూ.50,76,560 అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రత్యేక చొరవ, ప్రతిపాదనల మేరకు ఈ అభివృద్ధి పనులకు రూపకల్పన జరగడం పట్ల నందిగామ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు ఎమ్మెల్యేను ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ... ప్రజలకు నాణ్యమైన తాగునీటి సౌకర్యాల కల్పన ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో పట్టణాలు, గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం విశేష ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులను వేగవంతంగా అమలు చేస్తూ నందిగామను అన్ని రంగాల్లో ఆదర్శవంతమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి కొనసాగుతుందని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్పష్టం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ అమ్మినేని జ్వాలా ప్రసాద్, పాలకవర్గ సభ్యులు, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

# పరామర్శకు ర్యాలీగా వెళ్లడమేంటి? : గోరంట్ల బుచ్చయ్యచౌదరి



రాజమహేంద్రవరం (చైతన్యరథం): ముద్రగడను కడసారి చూసేందుకు వెళ్లిన ఆయన కుమార్తెను వైసీపీ నేతలు అడ్డుకోవడం ఏంటని టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ప్రశ్నించారు. పరామర్శకు వైసీపీ అధ్యక్షుడు జగన్ ర్యాలీగా వెళ్లడమేంటని ఆక్షేపించారు. ముద్రగడపై ప్రేమతో వెళ్లారా? రాజకీయ ప్రయోజనం కోసం వెళ్లారా? అని నిలదీశారు. రాజమహేంద్రవరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బుచ్చయ్యచౌదరి మాట్లాడారు. మత్స్యకారులు, ఆక్వా రైతులకు హయాంలో జగన్ ఏం చేశారో చెప్పాలని బుచ్చయ్యచౌదరి నిలదీశారు. బైక్తోత్ ఢీకొట్టి ఒకరి మృతికి కారణమైన మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడిని జగన్ వెనకేసుకుని రావడమేంటని ప్రశ్నించారు. ముద్రగడ అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహిస్తుంటే మాజీ మంత్రి అంబటి రాంబాబు, వైకాపా నేతలు అడ్డుకోవడంపై బుచ్చయ్యచౌదరి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు బుద్ధి చెప్పినా వైసీపీ నేతలకు బుద్ధి రాలేదన్నారు.

**రాష్టానికి విలువైన ప్రాజెక్టులు వస్తున్నాయి**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రానికి విలువైన ప్రాజెక్టులు తరలి వస్తున్నాయని గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రెండు స్టీల్ ప్లాంట్లతో పాటు ఆటో మొబైల్, సెల్ఫోన్ కంపెనీలు వస్తున్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన విధానాలతో ముందుకెళ్తాందన్నారు. మంత్రి లోకేశ్ కృషితో విదేశాల నుంచి పరిశ్రమలు వస్తున్నాయని వివరించారు. ఈ నెల 22న రాజమహేంద్రవరంలోని కలెక్టరేట్ కాంపౌండ్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. 1600 పోస్టుల భర్తీకి వివిధ కంపెనీలు వస్తున్నాయని చెప్పారు. నిరుద్యోగులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

# ఎమ్మెల్యే "ఆదిరెడ్డి" ప్రజలతో ముఖాముఖి

**●సమస్యల పరిష్కారానికి అధికారులకు తక్షణ ఆదేశాలు**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): "మన వార్డులో... మన ఆదిరెడ్డి" కార్యక్రమంలో భాగంగా రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) 24, 25 డివిజన్లలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. స్థానికంగా ఎదురవుతున్న సమస్యలను స్వయంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి పరిష్కారానికి చర్యలు ప్రారంభించడంతో కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. బుధవారం రాత్రి పార్టీ సీనియర్ నాయకుడు కర్రి కాశీ నివాసంలో బస చేసిన ఎమ్మెల్యే వాసు, గురువారం ఉదయం ప్రజలతో కలిసి ఆయా డివిజన్లలో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను ఓర్పుగా విన్నారు. డ్రైనేజీల నిర్వహణ, సీసీ రోడ్ల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు, విద్యుత్ అంతరాయాలు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, కాలువల శుభ్రత, పెన్షన్లు, రేషన్ కార్డులు, ప్రభుత్వ గృహాలు తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల తీవ్రతను బట్టి సంబంధిత శాఖల అధికారులతో ఎమ్మెల్యే నేరుగా ఫోన్‌లో మాట్లాడి, ఆలస్యం లేకుండా పరిష్కార చర్యలు చేపట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ... ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని, ప్రతి వార్డులో మౌలిక వసతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజల వద్దకే వచ్చి సమస్యలను తెలుసుకుని వెంటనే స్పందించడం పట్ల స్థానికులు ఎమ్మెల్యే వాసును అభినందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# ఈ నెల 22న రాజమహేంద్రవరంలో జాబ్‌మేళా... పాల్గొనున్న 14 కంపెనీలు

రాజమహేంద్రవరం (చైతన్యరథం): తూర్పుగోదావరి జిల్లా కలెక్టరేట్‌లో ఈనెల 22వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రకటించారు. ఈ జాబ్‌మేళాలో 14 ప్రముఖ కంపెనీలు పాల్గొని యువతకు ఉద్యోగాలు కల్పిస్తాయని పేర్కొన్నారు. గోదావరి పుష్కరాల కోసం రాజమండ్రి రూరల్ నియోజకవర్గంలో రోడ్లను అభివృద్ధి చేస్తామని తెలిపారు. మురుగు నీరు గోదావరిలో కలువకుండా 50 ఎంఎల్‌డీ ప్లాంట్‌లను అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పుకొచ్చారు. రాజమండ్రి రూరల్ నియోజకవర్గంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇస్తామని వెల్లడించారు. మోరంపూడిలో సర్వీస్ రోడ్లను వేయిస్తామని తెలిపారు. క్రికెట్ స్టేడియం కోసం భూములు సేకరిస్తున్నామని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు.

# ప్రజా ఫిర్యాదులు పరిష్కారంపై దృష్టి సారించాలి

**●ప్రజాదర్బార్‌లో ప్రభుత్వ చీఫ్ జీవి ఆంజనేయులు ఆదేశం**



వినుకొండ (చైతన్యరథం): ప్రజా సమస్యలను నిర్ణీత గడువులోగా వెంటనే పరిష్కరించాలని, ప్రజా దర్బార్ వేదికగా ప్రజలు సమర్పించిన ప్రతి ఒక్క అర్జీని పూర్తి చేసి ఆ విషయాన్ని వారికి తెలియజేయాలని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు అధికారులను ఆదేశించారు. వినుకొండ పట్టణంలోని చీఫ్ విప్ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి నియోజకవర్గం నలుమూలల నుండి ప్రజలు పెద్దఎత్తున తరలిరావడంతో అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా వివిధ వర్గాల ప్రజల నుండి గ్రామాల్లో పింఛన్లు, సైడ్ డ్రైన్లు, సిసి రోడ్లు, భూసమస్యలు, తదితర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి మొత్తం 34 అర్జీలు వచ్చాయి. ప్రతి ఒక్కరి సమస్యను పరిశీలించిన జీవి ఆంజనేయులు, ప్రజా దర్బార్ వేదిక నుండే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి తక్షణ ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు సుపరిపాలన, సమన్యాయం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా తీసుకెళ్తు ప్రజా ప్రభుత్వంగా మన్ననలు పొందుతున్నామని ఆయన వివరించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా పారదర్శక సేవలు అందించడమే ధ్యేయమని, ప్రస్తుతం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పెద్ద సంఖ్యలో సేవలు అందుబాటులోకి వచ్చాయని, ప్రజలు ఇంటి వద్ద నుంచే దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఆలోచనల ప్రకారం సేవలలో నాణ్యత, సమయపాలన కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అధికారులు నిరంతరం అందుబాటులో ఉంటూ, నిత్యం వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించినప్పుడే పాలనా యంత్రాంగంపై ప్రజలకు నమ్మకం కలుగుతుందని జీవి ఆంజనేయులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదులు పరిష్కారంపై దృష్టి సారించాలి

**●ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**

గుంటూరు (చైతన్యరథం): ప్రజలు ఎలాంటి సమస్యలపై వచ్చినా తాము అందుబాటులో ఉండి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గురువారం స్థానిక తూర్పు కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై వచ్చిన అర్జీలను ఎమ్మెల్యే నసీర్ స్వయంగా స్వీకరించారు. నూతన పింఛన్లు, ఇళ్ల స్థలాల కేటాయింపు, మురుగు నీటి సమస్య, విద్యుత్ స్థంభాల ఏర్పాటు వంటి వాటిపై ప్రజలు అర్జీలు అందజేశారు. ఆయా సమస్యలపై వెంటనే ఎమ్మెల్యే నసీర్ సంబంధిత అధికారులతో మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే ఆయా అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. ప్రతి అర్జీదారునితో సానుకూలంగా మాట్లాడాలని సూచించారు. కార్యాలయాల చుట్టూ పదే పదే తిప్పించుకుంటే అధికార యంత్రాంగంపై నమ్మకం కోల్పోతారని, అప్పుడే పీజీఆర్ఎస్ కు వెళతారని చెప్పారు. అలాంటి పరిస్థితులు రాకుండా కార్యాలయాలకు వచ్చిన వారితో మర్యాదగా మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ఇది ప్రజా ప్రభుత్వమని, ప్రజల కోసం పని చేస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో కూటమి రెండేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేశామని తెలిపారు.

# నాదెండ్ల బ్రహ్మంచౌదరి త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే యరపతినేని ఆకాంక్ష



విజయవాడ (చైతన్యరథం): బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరిని గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు, యువనేత యరపతినేని నిఖిల్ పరామర్శించారు. ఈ సందర్భంగా బ్రహ్మం చౌదరి కుటుంబసభ్యులను కలిసి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం వైద్యులను కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితి, అందిస్తున్న వైద్య చికిత్స గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం బ్రహ్మం చౌదరి వైద్యుల నిరంతర పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారని, ఆయన ఆరోగ్య పరిస్థితి క్రమంగా మెరుగుపడుతోందని వైద్య బృందం తెలిపింది. బ్రహ్మం చౌదరి త్వరగా పూర్తిస్థాయిలో కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో వస్తారని ఆకాంక్షిస్తూ, ఆ భగవంతుని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నట్లు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, యువనేత యరపతినేని నిఖిల్ తెలిపారు.

# బ్యాంకుల సహకారంతోనే సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గుతాయి : ప్రత్తిపాటి పుల్లారావు

**●దేశంలోనే భారీ రుణ వితరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం : ఎంపీ లావు**

**●అర్హులకు రుణాలందించడంలో బ్యాంకులు ఉదారంగా వ్యవహరించాలి : ప్రత్తిపాటి**



చిలకలూరిపేట (చైతన్యరథం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు...రాయితీ రుణాలపై అవగాహనతో పొదుపు సంఘాల మహిళలు, రైతులు తమకు నచ్చిన వ్యాపార, వ్యవసాయ రంగాల్లో రాణించి ఆర్థికంగా స్థిరపడవచ్చని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. బ్యాంకులు అందించే రాయితీ రుణాలు, ప్రభుత్వాలు అందించే ప్రోత్సాహకాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. గురువారం చిలకలూరిపేట మున్సిపల్ కౌన్సిల్ హాల్లో నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలుతో కలిసి ఎమ్మెల్యే ప్రత్తిపాటి, శుక్రవారం నరసరావుపేట ఇండోర్ స్టేడియంలో జరిగే కేంద్రమంత్రి, ముఖ్యమంత్రులు పాల్గొనే క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు.

**బ్యాంకులు ఉదారంగా రుణాలిస్తేనే.. ఆర్థిక అసమానతలు తగ్గుతాయి: ప్రత్తిపాటి**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, రాయితీ రుణాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలన్న లక్ష్యంతో, బ్యాంకుల్ని సమాయత్తం చేసే దిశగా తొలిసారి నరసరావుపేటలో శుక్రవారం భారీ రుణ పంపిణీ కార్యక్రమం జరగబోతోందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి చెప్పారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా రూ.3,200 కోట్లకు పైగా రుణాలను లబ్ధిదారులు స్వీకరించబోతున్నారని ఆయన తెలిపారు.

**దేశంలోనే భారీ రుణ వితరణ కార్యక్రమం.. క్రెడిట్ అవుట్ రీచ్ : ఎంపీ లావు**

దేశంలో తొలిసారి వెనుకబడిన పల్నాడు జిల్లాలో భారీ రుణ వితరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, శుక్రవారం నరసరావుపేటలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా రైతులు, మహిళలు, నిరుద్యోగ యువతకు రూ.3,216 కోట్ల రుణ పంపిణీ జరగబోతోందని నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే రుణ వితరణ కార్యక్రమానికి దేశంలోని ప్రధాన బ్యాంకుల ఛైర్మన్లు కూడా హాజరవుతున్నారని ఆయన తెలియజేశారు.

# అంగవైకల్యం ఆత్మగౌరవానికి అడ్డుకాకూడదు

**● విభిన్న ప్రతిభావంతులకు అండగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం: ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



గుంటూరు (చైతన్యరథం): విభిన్న ప్రతిభావంతులు స్వయం ఆధారిత జీవితం గడపాలని, అంగవైకల్యం వారి ఆత్మగౌరవానికి అడ్డంకిగా మారకూడదనే లక్ష్యంతో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి అన్నారు. గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్లు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మూడు చక్రాల మోటార్ స్కూటర్లు, ఫోల్డబుల్ వీల్‌చైర్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మరియు ఇతర ప్రజా ప్రతినిధులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... ఎన్డీయే కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి నియోజకవర్గానికి 10 చొప్పున మొత్తం 1,750 మోటార్ వెహికల్స్‌ను అర్హులైన విభిన్న ప్రతిభావంతులకు అందజేస్తోందని తెలిపారు. అంగవైకల్యం కారణంగా ఎవరూ ఇతరులపై ఆధారపడి జీవించాల్సిన అవసరం లేకుండా స్వతంత్రంగా జీవించేందుకు ఈ పథకం ఎంతో దోహదపడుతుందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చిందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పెంపు, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, వివిధ రకాల వైకల్యాలతో బాధపడుతున్న వారిని డిసేబుల్ కేటగిరీలో చేర్చి సంక్షేమ పథకాలు వర్తింపజేయడం వంటి చర్యలు చేపట్టిందన్నారు. విభిన్న ప్రతిభావంతులకు మాత్రమే కాకుండా వారికి సహాయకులుగా ఉండే వ్యక్తులకు కూడా ఉచిత బస్సు ప్రయాణంలో 50 శాతం రాయితీ కల్పించడం ప్రభుత్వం సామాజిక బాధ్యతకు నిదర్శనమని తెలిపారు. అదేవిధంగా కార్పొరేషన్ల ద్వారా ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాల కోసం రుణాలు, సొంత ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల వరకు రుణ సదుపాయాలు కూడా అందుబాటులో ఉంచినట్లు వివరించారు. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో ఇటీవల సీఎస్ఆర్ నిధుల ద్వారా కూడా పలువురు విభిన్న ప్రతిభావంతులకు మోటార్ వాహనాలు అందించిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తుచేశారు.

# చెప్పిన తేదీ ప్రకారమే శంకర్ విలాస్ బ్రిడ్జి ప్రారంభం : కేంద్రమంత్రి పెమ్మసాని



గుంటూరు (చైతన్యరథం): నగరంలో నిర్మిస్తున్న శంకర విలాస్ బ్రిడ్జి నిర్మాణ పనులను గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యేలు గల్లా మాధవి, మొహమ్మద్ నసీర్‌లతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా శంకర్ విలాస్ నిర్మాణ పనులతో పాటు స్థానిక శ్యామలనగర్ పనులలో జరుగుతున్న జాప్యాన్ని కూడా ఈ సందర్భంగా పెమ్మసాని వివరించే ప్రయత్నం చేశారు. అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ... శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణం అనుకున్న సమయంలోనే పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నామని, చిన్నచిన్న సమస్యలు అన్నిటిని పరిష్కరించుకుంటూ వంతెన నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామన్నారు. 2, 3 పిల్లర్ల పనుల నిమిత్తం మిగిలిన అన్ని పనులు వేగంగా సాగుతున్నాయని, మరికొన్ని గడ్డర్లు రావాల్సి ఉందన్నారు. రాబోయే ఏడాదిలో పనులన్నింటిని పూర్తిచేసి శంకర్ విలాస్ బ్రిడ్జ్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురాబోతున్నామని తెలిపారు. గుంటూరు ప్రజల అదృష్టం బట్టి మన జిల్లాలో ఇన్ని ఆర్‌ఓబీలు నిర్మాణం చేయబోతున్నామని, అవకాశానికి మించి పరిహారం కూడా ఇస్తున్నామన్నారు. శ్యామలనగర్ బ్రిడ్జ్ పనులకు కొందరు ఆర్ఓబి వద్దు ఆర్ యూ బి కావాలని అడుగుతున్నారని, దయచేసి అందరూ సహకరిస్తేనే ఒక ప్రాజెక్టు పూర్తవుతుందని అన్నారు. శ్యామలనగర్ పనులకు అందరూ ఒప్పుకుంటే ల్యాండ్ అక్విజేషన్‌కు త్వరలో నోటిఫికేషన్ విడుదల చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కోవూరులో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు : ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



కోవూరు (చైతన్యరథం): గత ప్రభుత్వం పనులకు కొబ్బరికాయలు కొట్టి అర్ధాంతరంగా వదిలేస్తే.. ఆ పనులన్నింటినీ పూర్తి చేసి, గుమ్మడికాయలు కొట్టి ప్రారంభోత్సవాలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. గురువారం కొడవలూరు మండలం నాయుడుపాళెం పంచాయతీలో రూ.50 లక్షల NREGS నిధులతో పూర్తయిన 1.5 కిలోమీటర్ల రోడ్డును, రూ.21 లక్షల వ్యయంతో నిర్మించిన 4 సీసీ రోడ్లను ఆమె స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ... మన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన ఈ స్వల్ప కాలంలోనే కేవలం నాయుడుపాళెం పంచాయతీలోనే సుమారు రూ. 1 కోటికి పైగా అభివృద్ధి, సంక్షేమ పనులు చేపట్టాం. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఎంత అస్తవ్యస్తం చేసినా, వాటన్నింటినీ సరిదిద్దుకుంటూ సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారు. గత హయాంలో కోవూరు నియోజకవర్గంలో ఒక తట్ట మట్టి కూడా వేయని పరిస్థితి ఉంటే.. నేడు ప్రతి గ్రామం బాగుండాలని రోడ్లు వేస్తున్నామని చెప్పారు.

**రోడ్ల నాణ్యతలో రెండో స్థానం**

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రధాన్ మంత్రి గ్రామ్ సడక్ యోజన పథకం అమలులో, రహదారుల నాణ్యతా ప్రమాణాల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే 2వ స్థానంలో నిలవడం మనందరికీ గర్వకారణమన్నారు. నాయుడుపాళెంలో మిగిలిన 1.10 కిలోమీటర్ల రోడ్డును కూడా రూ.40 లక్షల అంచనా వ్యయంతో త్వరలోనే పూర్తి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

**కిసాన్ సెజ్‌కు మళ్లీ ఊపిరి**

కోవూరు నియోజకవర్గంలో దాదాపు రూ.770కోట్ల అభివృద్ధి పనులు చేపట్టేందుకు సహకరించిన చంద్రబాబునాయుడుకి నియోజకవర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు చెబుతున్నామని ప్రశాంతి రెడ్డి అన్నారు. దాదాపు 30 ఏళ్లుగా మూలన పడిన కొడవలూరు కిసాన్ సెజ్ వ్యవహారంలో యువనేత, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో కదలిక వచ్చిందని, త్వరలోనే ఇక్కడ పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు.

**ప్రజల ప్రభుత్వం**

ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం నెరవేరుస్తోందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రైతులకు రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు అందించి వారి భూములకు శాశ్వత రక్షణ కల్పించాం. ఎలాంటి ఇబ్బంది లేకుండా సకాలంలో యూరియా పంపిణీ చేసి, ధాన్యం కొనుగోళ్లతో పాటు రైతులకు వెంటనే చెల్లింపులు జరిపి ఆదుకున్నాం. పేదల వైద్య సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా కోవూరు నియోజకవర్గంలోనే వెయ్యి మందికి పైగా లబ్ధిదారులకు దాదాపు రూ.10 కోట్ల విలువైన చెక్కులను అందించామని చెప్పారు.

# గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

**●రాబోయే స్థానిక ఎన్నికల్లో ఐక్యంగా పనిచేద్దాం: పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే కాకర్ల పిలుపు**



వరికుంటపాడు (చైతన్యరథం): వరికుంటపాడు మండలం, రామాపురం గ్రామపంచాయతీ పరిధిలోని కాకొల్లువారిపల్లి గ్రామంలో రూ.1 కోటి 67 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన తారు రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమం ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ అధ్యక్షతన అత్యంత వైభవంగా, ప్రజల హర్షధ్వానాల నడుమ ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ, నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నెల్లూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, కనిగిరి శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, పెదకూరపాడు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్, మాజీ శాసనసభ్యులు కంభం విజయరామిరెడ్డి, తానా మాజీ అధ్యక్షులు వేమన సతీష్ తదితర ప్రముఖులు ముఖ్య అతిథులుగా విచ్చేసి నూతన తారు రోడ్డును ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రహదారులే జీవనాడులని పేర్కొన్నారు. కాకొల్లువారిపల్లి గ్రామ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ఈ రహదారి నిర్మాణం పూర్తికావడంతో గ్రామ ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణం, విద్యార్థులకు సురక్షిత రవాణా, రైతులకు వ్యవసాయ ఉత్పత్తుల తరలింపులో సౌలభ్యం, అత్యవసర సేవలు వేగంగా అందుబాటులోకి రావడంతో పాటు గ్రామ ఆర్థికాభివృద్ధికి కొత్త ఊపు లభిస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వారు పేర్కొన్నారు. అనంతరం ఏర్పాటుచేసిన ఆత్మీయ అభినందన సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సహకారంతో రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన భాష్యం విద్యాసంస్థల అధినేత, విద్యావేత్త, సేవాభావం కలిగిన నాయకులు భాష్యం రామకృష్ణని సభకు విచ్చేసిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఘనంగా శాలువా కప్పి, పూలమాలలు వేసి సన్మానించి అభినందించారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ...** విద్యా రంగంలోనూ, సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ, పార్టీ బలోపేతంలోనూ భాష్యం రామకృష్ణ అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. పార్టీ పట్ల ఆయన చూపిన నిబద్ధత, క్రమశిక్షణ, సేవాభావానికి గుర్తింపుగానే రాజ్యసభ సభ్యత్వం లభించిందని పేర్కొన్నారు.

# నెల్లూరు రూరల్‌లో 60 కోట్లతో 97 పనులు

**●ఎన్నికలు లేనివేళ పార్టీలకు అతీతంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాం ఎమ్మెల్యే కోటంరెడ్డి**



నెల్లూరు (చైతన్యరథం): నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 1వ డివిజన్, కోడూరుపాడు కల్తీ కాలనీలో 80 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న సీసీ డ్రైన్ పనులకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, టీడీపీ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. పొదలకూరు రోడ్డు – గాంధీనగర్ రోడ్డు తరహాలో కొత్త కాలువ సెంటర్‌లో త్వరలో సెంట్రల్ లైటింగ్‌ను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఈ వయసులో కూడా రాష్ట్రం కోసం ఇంత కష్టం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ప్రజలందరి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, నెల్లూరు రూరల్ అభివృద్ధికి అన్నిరకాలుగా సహకరిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనేత నారా లోకేష్‌కి, మంత్రులు నారాయణకి, ఆనం రామనారాయణ రెడ్డి, నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, శాసనమండలి సభ్యులు బీద రవిచంద్రకి నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రజలపక్షాన ప్రత్యేక దన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే ఇంటూరి

**● 111 మంది లబ్ధిదారులకు రూ.78 లక్షల చెక్కులు పంపిణీ**



కందుకూరు (చైతన్యరథం): వివిధ ఆరోగ్య కారణాలతో ఇబ్బంది పడుతున్న పేదలను ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సీఎంఆర్ఎఫ్ ద్వారా అధిక మొత్తంలో వైద్య సహాయాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. కందుకూరులోని పార్టీ కార్యాలయంలో గురువారం 111 మంది లబ్ధిదారులకు రూ.78,28,829 విలువైన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కందుకూరు మండలంలో 30 మందికి రూ.24,83,106, ఉలవపాడు మండలంలో 39 మందికి రూ.34,19,413, వలేటివారిపాలెం మండలంలో 42 మందికి రూ.20,72,998 రూపాయలు విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఇప్పటివరకు నియోజకవర్గ వ్యాప్తంగా 1632 మంది పేదలకు 12.52 కోట్లు సహాయం అందించటం సంతోషంగా ఉందని నాగేశ్వరరావు తెలిపారు. ఆయా కుటుంబాలు సుఖ సంతోషాలతో ఉండాలన్న ఆలోచన తనదని చెప్పారు. పెద్ద సంఖ్యలో చెక్కులు అందుకున్న లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు, నాయకులతో టీడీపీ కార్యాలయంలో సందడి నెలకొంది. ఎప్పుడూ లేనివిధంగా నియోజకవర్గంలో భారీగా వైద్య సహాయాలు అందిస్తున్నారని, ఈ క్రెడిట్ అంతా ఎమ్మెల్యేగారిదేనని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం చేసిన మేలును మరిచిపోమని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మండల పార్టీల అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, జనిగర్ల నాగరాజు, పూరిమిట్ల గురునాథం, మాదాల లక్ష్మీనరసింహం, రాష్ట్ర కమిటీ నాయకులు షేక్ రఫీ, బెజవాడ ప్రసాద్, నాదెళ్ల వెంకటరమణయ్య, కూనం నరేంద్ర, పార్లమెంట్ కమిటీ నాయకులు షేక్ రూబీ, నేతలు రాయపాటి శ్రీను, షేక్ సలాం, షేక్ మున్నా, చిత్తారు మల్లికార్జున, తన్నీరు కొండలరావు, మాదాల రవి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ



ఒంగోలు (చైతన్యరథం): పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, మన కనిగిరి శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ పొందిన మహిళలు సమాజ సేవలో మరో మంచి కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ పాఠశాలలో చదువుతున్న కొంతమంది విద్యార్థులు యూనిఫామ్‌లు కుట్టించుకునే ఆర్థిక స్థోమత లేకుండా యూనిఫామ్ లేకుండానే పాఠశాలకు వెళ్తుండగా, వారిని గమనించిన ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి “ఎందుకు యూనిఫామ్ ధరించలేదు?” అని ఆరా తీశారు. అందుకు ఆ చిన్నారులు, “సార్... యూనిఫామ్ కుట్టించుకోవడానికి మా దగ్గర డబ్బులు లేవు” అని చెప్పడంతో, వెంటనే వారిని తన కార్యాలయానికి వచ్చి ఉచితంగా యూనిఫామ్‌లు కుట్టించుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు, గురువారం పలువురు విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్‌లు కుట్టించి అందించారు. ఈ కార్యక్రమాన్ని ధనలక్ష్మి మరియు శివలక్ష్మి ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. కొత్త యూనిఫామ్‌లు ధరించిన చిన్నారులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తూ, “థ్యాంక్యూ ఉగ్ర సార్” అంటూ తమ కృతజ్ఞతలు తెలియజేశారు.

# సర్ కార్యక్రమం పట్ల అప్రమత్తంగా ఉండాలి

**● యూనిట్ ఇన్‌ఛార్జ్‌లకు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సూచన**



మార్కాపురం (చైతన్యరథం): కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సర్ కార్యక్రమం పట్ల అప్రమత్తంగా ఉండాలని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి యూనిట్ ఇన్‌ఛార్జ్‌లకు సూచించారు. గురువారం మార్కాపురం పట్టణంలోని మార్కెట్ యార్డ్ ఆవరణలో టీడీపీ శ్రేణులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ... ప్రతి యూనిట్ ఇన్‌ఛార్జ్ సర్ కార్యక్రమం పట్ల వచ్చే పది రోజులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, యూనిట్ ఇన్‌ఛార్జ్‌లు విధిగా పార్టీకి శాయశక్తుల తమ సేవలు అందించాలన్నారు. పార్టీ ఆదేశించిన ఆదేశాల ప్రకారం తమ విధులను చక్కగా నిర్వర్తించాలని, ప్రతినెల రెండవ బుధవారం యూనిట్ ఇన్చార్జి విధిగా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో మార్కాపురం నియోజకవర్గం యూనిట్ ఇన్‌ఛార్జ్‌లు పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్యానికి అండగా కూటమి ప్రభుత్వం

**●ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేసిన కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్**




ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో పేదల వైద్య అవసరాలకు వేగంగా ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరు అవుతోందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు అవసరమైన

కదిరి (చైతన్యరథం): పట్టణ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో కదిరి నియోజకవర్గానికి చెందిన 11 మంది లబ్ధిదారులకు రూ.6,02,438 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు వైద్య ఖర్చులు భారంగా మారకుండా ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం ప్రయోజనాలు అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని, ప్రజలకు అవసరమైన ప్రతి సందర్భంలో తమ వంతు సహాయ సహకారాలు అందిస్తూనే ఉంటామని పేర్కొన్నారు. కూటమి సేవలను త్వరితగతిన అందించడం ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. కదిరి నియోజకవర్గంలో ఇప్పటివరకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 605 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.5,12,88,317 విలువైన చెక్కులు అందజేయడం ప్రజల పట్ల ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ నిబద్ధతకు నిదర్శనమనిలి పలువురు లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, రాష్ట్ర ప్రభుత్వానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఈ ఆర్థిక సహాయం అందించినందుకు లబ్ధిదారులు ముఖ్యమంత్రికి, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎమ్మెల్యే పరిటాల సునీత ఆకస్మిక తనిఖీలు

**●ఆసుపత్రి పరిశుభ్రంగా, వైద్యులు అందుబాటులో ఉండాలని సూచన**

**●పలు సమస్యల్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చిన వైద్యులు, సిబ్బంది**

**●శ్రేయోభిలాషుల కుటుంబానికి పరామర్శ, ప్రజల నుంచి వినతుల స్వీకరణ**



సమస్య ఉంటే తప్ప.. ఇతర హాస్పిటల్స్‌కు రెఫర్ చేయవద్దన్నారు. వైద్యులు, సిబ్బంది ఆసుపత్రిలో ఉన్న సమస్యల్ని ఎమ్మెల్యే సునీత దృష్టికి తీసుకెళ్లారు. ఫార్మసీ (మెడిసిన్స్) నిర్వహణ కోసం ప్రత్యేకంగా గది, వైద్యం కోసం వచ్చిన వారికి తగినన్ని బెడ్లు లేకపోవడం, నీటి సమస్యను ఎమ్మెల్యేకి వివరించగా వాటిని

రాప్తాడు (చైతన్యరథం): రామగిరి మండలం పేరూరు ప్రాజెక్టు సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే పరిటాల సునీత ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం ఉదయం ఆమె ఆసుపత్రికి వెళ్లగానే.. అక్కడున్న వైద్యులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఆసుపత్రిలో ఉన్న సౌకర్యాలు, రోగులకు అందుతున్న చికిత్సలను పరిశీలించారు. ఆసుపత్రితో పాటు పరిసరాల్ని పరిశీలించి.. వైద్యులకు పలు సూచనలు చేశారు. ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని.. వైద్యులు సమయానికి రావాలన్నారు. రోగులతో మర్యాదపూర్వకంగా ఉండాలని.. పెద్ద పరిష్కరిస్తామన్నారు. అనంతరం కంబదూరు మండలం రాళ్ల అనంతపురం గ్రామానికి చెందిన కుటుంబ శ్రేయోభిలాషి పెద్ద వెంకటేష్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా ఎమ్మెల్యే సునీత ఆయన నివాసానికి వెళ్లారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆ తర్వాత వెంకటాపురంలోని తన కార్యాలయానికి వివిధ కారణాలు సమస్యల నిమిత్తం వచ్చిన వారితో సమావేశమయ్యారు. వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సునీత హామీ ఇచ్చారు.

# ఏపీలో మరోసారి కరోనా కలకలం...

ఏపీలో మళ్లీ కరోనా కలకలం రేపుతోంది. రాష్ట్రంలో కోవిడ్ కేసులు పెరిగిపోతున్నాయి. జూన్ 26 నుంచి12 కొవిడ్ కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. కడప,గుంటూరు, కాకినాడ జిల్లాల్లో కేసులు నమోదవుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ కొవిడ్ పాజిటివ్‌తో నలుగురు మృతి చెందారు. ఒకే ప్రాంతంలో క్లస్టర్‌గా కేసులు నమోదు కాలేదని వైద్య ఆరోగ్య శాఖ వెల్లడించింది. కోవిడ్ పాజిటివ్ వచ్చిన వారిలో నలుగురు మృతి చెందగా, వారందరికీ ముందే తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వైరస్ జన్యుక్రమ విశ్లేషణ కోసం 5 నమూనాలు పుణెలోని జాతీయ వైరాలజీ సంస్థకు పంపించింది రాష్ట్ర ప్రభుత్వం. ప్రస్తుతం ముగ్గురు హోం ఐసోలేషన్‌లో ఉండగా, ఇద్దరు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ముగ్గురు కోవిడ్ నుంచి కోలుకుని డిశ్చార్జ్ అయినట్లు తెలుస్తోంది.

# వైసీపీ రీసర్వే అరాచకం.. రైతుల భూములకు సంకెళ్లు!

**●22ఏ పేరుతో ఊళ్లకు ఊళ్లు నిషేధ జాబితాలోకి.. రాజకీయ కక్షసాధింపుతో వేలాది కుటుంబాలు నష్టపోయాయి: సోమిరెడ్డి**

**●భూసమస్యల పరిష్కారానికి కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రత్యేక చొరవపై ప్రశంసలు**



నెల్లూరు (చైతన్యరథం): వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన రీసర్వే రైతుల జీవితాలను అస్తవ్యస్తం చేసి, రాజకీయ కక్షసాధింపులకు ప్రభుత్వ యంత్రాంగాన్ని వాడుకున్నారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. అధికార పార్టీకి వ్యతిరేకంగా ఉన్న గ్రామాలు, రైతుల భూములను 22ఏ, అనాధీనం, గయాలు పేర్లతో నిషేధ జాబితాలో చేర్చి వేలాది మంది రైతులను భూములకే పరిమితం చేశారని విమర్శించారు. భూములు అమ్ముకోలేని పరిస్థితి, బ్యాంకుల నుంచి పంట రుణాలు అందకపోవడం, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు కోల్పోవడం వంటి సమస్యలకు గత ప్రభుత్వ విధానాలే కారణమని ఆయన ఆరోపించారు. పొదలకూరు మండలం పులికల్లు పంచాయతీలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో కలిసి నిర్వహించిన పల్లెవీక్షణం కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం సోమిరెడ్డి మాట్లాడుతూ, ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు భూసమస్యల గురించే వినతిపత్రాలు ఇస్తున్నారని చెప్పారు. కలెక్టర్ ప్రజల నుంచి స్వయంగా అర్జీలు స్వీకరించి, ప్రతి సమస్యను ఆన్‌లైన్‌లో నమోదు చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం ప్రజల్లో కొత్త ఆశలు నింపిందన్నారు. "వైసీపీ పాలనలో రీసర్వే కాదు... రైతులపై రివెంజ్ సర్వే జరిగింది" అని సోమిరెడ్డి విమర్శించారు. ఎన్నికల ముందు ఓట్ల కోసం దొంగ పట్టాలు పంచి ప్రజలను మోసం చేశారని, ఇప్పుడు ఆ భూములపై చట్టపరమైన చిక్కులు సృష్టించి పేదలను ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. ఆ పట్టాలపై సమగ్ర విచారణ జరిపి, నిజంగా భూమి అనుభవిస్తున్న అర్హులైన పేదలకు రాజకీయాలకు అతీతంగా శాశ్వత హక్కు పట్టాలు అందిస్తామని ప్రకటించారు.

గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూకుంభకోణాలపై ప్రత్యేక దర్యాప్తు అవసరమని, ప్రజల ఆస్తుల విషయంలో జరిగిన అక్రమాలపై జిల్లా యంత్రాంగం కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్‌ను కోరారు. కండలేరు నిర్వాసితుల పునరావాసం, అంకుపల్లి పాఠశాల నిర్మాణం, పొదలకూరు కో-లోకేటెడ్ పీహెచ్‌సీ భవనం, ఇతర పెండింగ్ అభివృద్ధి పనులపై కూడా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేరును ప్రస్తావిస్తూ, గతంలో కక్షసాధింపు రాజకీయాలతో జిల్లాను అస్తవ్యస్తం చేశారని, ఇప్పుడు కోర్టు కేసులు, స్టేల పేరుతో అభివృద్ధి పనులకు అడ్డంకులు సృష్టిస్తున్నారని సోమిరెడ్డి ఆరోపించారు. ప్రజా ప్రయోజనాల కంటే రాజకీయాలకే ప్రాధాన్యం ఇచ్చిన ఫలితంగా జిల్లాలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయని అన్నారు. కండలేరు స్పిల్‌వే వద్ద ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, మరో అన్నమయ్య ప్రాజెక్టు తరహా విషాదం పునరావృతం కాకుండా ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరిస్తోందని తెలిపారు. మెట్ట ప్రాంతమైన పొదలకూరులో ఉద్యాన పంటల సాగు రైతులకు అధిక ఆదాయం తెస్తోందని, అదే నమూనాను డెల్టా ప్రాంత గ్రామాలకు విస్తరించేందుకు ప్రత్యేక పైలట్ ప్రాజెక్టు చేపడతామని వెల్లడించారు. పొదలకూరు డయాలసిస్ సెంటర్‌కు కొత్త భవనం నిర్మించి అదనంగా 15 పడకలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని, ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని సోమిరెడ్డి స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను వినే పరిపాలన, వెంటనే స్పందించే అధికార యంత్రాంగం ద్వారానే ప్రజల విశ్వాసం గెలుచుకోవచ్చని ఆయన అన్నారు.

# వ్యర్థాల నిర్వహణలో ప్రజారోగ్య రక్షణకు అత్యంత ప్రాధాన్యత

**●ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్‌ను పరిశీలించిన స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్**



కడప (చైతన్యరథం): కడప నగరంలో ఘన వ్యర్థాల నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టడంతో పాటు ప్రజారోగ్య భద్రతకు ఎలాంటి విఘాతం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కడప నగర పాలక సంస్థ పరిధిలోని కసుమలోపల్లి వద్ద నిర్వహణలో ఉన్న ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. అక్కడి డంప్ యార్డులో వ్యర్థాల సెగ్రిగేషన్, రీసైక్లింగ్ విధానాన్ని పరిశీలించిన అనంతరం.. కేంద్రంలో వ్యర్థాల సేకరణ, వర్గీకరణ, శుద్ధి, నిర్వహణ విధానాలను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కేఏసీ పర్యావరణ ఇంజినీర్లు, ప్రజారోగ్య అధికారులు, పారిశుధ్య అధికారులకు పలు సూచనలు చేశారు. వ్యర్థాల నిర్వహణలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ నిర్వహణలో ప్రజారోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు నగర పరిశుభ్రతను మరింత మెరుగుపరచాలని, ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాల సాధనకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని పట్టాభిరామ్ సూచించారు.

# పామిడి ప్రజాదర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



గుంతకల్లు (చైతన్యరథం): నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం మరియు ఆయన తనయుడు యువనేత పామిడి మరియు గుత్తి ఇన్‌ఛార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ పామిడి పట్టణ టీడీపీ కార్యాలయం నందు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ... ప్రజలకు అందుబాటులో ఉండేందుకు వారి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి వినతి పత్రాలను స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ప్రజల నుండి వినతి పత్రాలను స్వీకరించి వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడి నేరుగా పరిష్కరించడం లేదా దీర్ఘకాలిక సమస్యలను పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపడం జరుగుతుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తెలియజేశారు. మనమందరము కలిసికట్టుగా ఉండి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మన పార్టీ తరపున నిలబడిన అభ్యర్థులను గెలిపించుకుని గుంతకల్ నియోజకవర్గం నుండి నారా చంద్రబాబునాయుడుకి బహుమతిగా ఇవ్వాలని అందుకోసం ప్రతి గ్రామంలో ప్రతి వార్డులో కూటమి నాయకులందరూ కలిసికట్టుగా పోరాడాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సూచించారు. ఈ కార్యక్రమంలో పామిడి పట్టణ మరియు మండల కూటమి నాయకులు కార్యకర్తలు సంబంధిత అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సాహసం మా పథం

## ఐస్‌లాండ్‌లో ఎన్ఆర్ఐల కొత్త రికార్డు

## 'లాగావెగర్' ట్రెక్కింగ్ విజయవంతం

### 90 కిలోమీటర్ల దూరం నాలుగు రోజుల్లోనే పూర్తి

**ఐస్‌లాండ్:** ప్రకృతి వైపరీత్యాలు, ఎముకలు కొరికే చలి, అగ్నిపర్వతాల నడుమ సాగే ప్రపంచంలోనే అత్యంత కఠినమైన, అందమైన ఐస్‌లాండ్ ట్రెక్కింగ్ మార్గంలో ప్రవాస తెలుగు బృందం అడుగుజాడలు వేసింది. లండన్‌కు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ నిమ్మగడ్డ శేషగిరి నేతృత్వంలో ఐదు దేశాలకు చెందిన 39 మంది తెలుగు సాహసికుల బృందం 'లాగావెగర్' ట్రెక్కింగ్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. ఈ బృందంలో పలువురు డాక్టర్లు, సాఫ్ట్‌వేర్, సివిల్ ఇంజనీర్లు ఉన్నారు. సాధారణంగా చేసే 60 కిలోమీటర్ల లాగావెగర్ ట్రెక్‌తో పాటు దానికి అనుసంధానంగా ఉన్న అత్యంత ప్రమాదకరమైన 'ఫిమ్‌వోర్దుహాల్స్' మార్గాన్ని (30 కి.మీ) కూడా కలిపి కేవలం నాలుగు రోజుల్లోనే మొత్తం 90 కిలోమీటర్ల సుదీర్ఘ దూరాన్ని ఈ బృందం అధిగమించడం విశేషం.

### ప్రకృతి అద్భుతాల నడుమ సాహస యాత్ర

ఈ యాత్రలో బృంద సభ్యులు భిన్నమైన వాతావరణ పరిస్థితులను తట్టుకుంటూ ముందుకు సాగారు. అగ్నిపర్వత ఖనిజాల ఆక్సీకరణ కారణంగా.. ఎరుపు, పసుపు, ఆకుపచ్చ, గులాబీ, నారింజ రంగుల్లో



మెరిసిపోయే వింత పర్వతాలు వీరికి స్వాగతం పలికాయి. తీవ్రమైన గాలులు, ఎడతెరిపి లేని వర్షం, దట్టమైన మంచు పలకలను దాటుకుంటూ బృందం సాగింది. వంతెనలు లేని ఉధృతమైన చిన్న



నదులను దాటడానికి ప్రత్యేకమైన షూస్, సాక్స్ ధరించి ప్రాణాలకు తెగించి ముందుకు కదిలారు. రెండు, మూడో రోజు రాత్రి వేళల్లో నల్లటి లావాతో నిండిన అగ్నిపర్వత ప్రాంతాల్లో తాత్కాలికంగా టెంట్లు వేసుకుని బస చేశారు.

### 'స్కోగాఫాస్' జలపాతం వద్ద ఘన ముగింపు

నాలుగో రోజు సాయంత్రానికి లాగావెగర్ ట్రెక్ పూర్తయ్యాక పచ్చటి



మైదానంలో బృందం విడిది చేసింది. ఇక్కడితో 14 మంది తమ యాత్రను ముగించుకోగా.. మిగిలిన 25 మంది సభ్యులు మరింత పట్టుదలతో ముందుకు సాగి 'ఫిమ్‌వోర్దుహాల్స్' ట్రెక్‌ను విజయవంతంగా ముగించారు. దాదాపు 60 మీటర్ల ఎత్తు నుంచి ఉధృతంగా ప్రవహించే ప్రసిద్ధ 'స్కోగాఫాస్' జలపాతం వద్ద ఈ సాహస యాత్ర ముగిసింది.

### ఎవరెస్ట్ బేస్ క్యాంప్ నుంచి ఐస్‌లాండ్ దాకా...

ఈ తెలుగు బృందానికి ఇలాంటి సాహసాలు కొత్తేమీ కాదు. 2019 నుంచి ప్రతి ఏటా సరికొత్త లక్ష్యాలతో దూసుకెళ్తున్న ఈ బృందం... గతంలో ఆఫ్రికాలోని ఎత్తైన శిఖరం కిలిమంజారో, నేపాల్‌లోని ఎవరెస్ట్ బేస్ క్యాంప్, అత్యంత కఠినమైన అన్నపూర్ణ సర్క్యూట్ వంటి ఎన్నో అంతర్జాతీయ సాహస యాత్రలను విజయవంతంగా పూర్తి చేసిన ఘన చరిత్ర కలిగి ఉంది.

### శారీరకంగా, మానసికంగా పెద్ద సవాల్

ఈ ట్రెక్ శారీరకంగానే కాకుండా మానసికంగానూ ఎన్నో సవాళ్లను విసిరింది. ప్రతికూల వాతావరణాన్ని తట్టుకుంటూ ఇంత పెద్ద బృందాన్ని సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చడం ఎంతో సంతృప్తి ఇచ్చింది.

**డాక్టర్ నిమ్మగడ్డ శేషగిరి, బృంద నాయకుడు**

### బృందంలో సభ్యులు వీరే...

యూకే నుంచి నరసింహరావు గుడె, గోపీనాథ్ తోట, అశోక్ పులిగారి, సునీల్ పిల్లి, నవీన్ వాసిరెడ్డి, రవి దండమూడి, సౌజన్య గద్దె, రిచర్డ్ ఫెర్నాండెజ్, రవిశంకర్ నాగరాజ, కపిల్ లల్వానీ, అనిల్ భువనగిరి, మాధవి అడుసుమల్లి, జాహ్నవి వీరమాసునేని, అమెరికా నుంచి ఉమా చింతపల్లి, గిరీశ్ రామిరెడ్డి, మోహన్ తుమ్మల, రమణ మండవ, శ్రీదేవి తాల్లూరి, సత్య చింతపల్లి, సుబ్రహ్మణ్యం కుప్ప, సురేష్ మామిడాల, రాజ్ గింజుపల్లి, మురళీకృష్ణ చెలికాని, జర్మనీ నుంచి సందీప్ చిలుకూరు, యూఏఈ నుంచి రమేష్ భాస్కరన్, భారత్ నుంచి రఘురామ్ ఈడ్పుగంటి ఈ బృందంలో ఉన్నారు. వీరితో పాటు ఐస్లాండిక్ గైడ్ మాగ్నస్ వైకింగ్, అతడి సహాయకుడు థార్ (చెఫ్) బృందానికి సహాయకులుగా వ్యవహరించారు. అర్నీ, హెల్గర్, జాకబ్, మరో ముగ్గురు గైడ్లు ఈ సాహస యాత్రకు సహకరించారు.



# 'నాట్స్' డల్లాస్ చాప్టర్ సమావేశం సక్సెస్



### 2027 మేలో 'తెలుగు సంబరాల'కు ప్రత్యేక కార్యాచరణ

### నూతన కమిటీ ప్రకటన

### మహాసభల కన్వీనర్‌గా ప్రేమ్ కలిదిండి నియామకం

**డల్లాస్:** నార్త్ అమెరికా తెలుగు సొసైటీ (నాట్స్) డల్లాస్ చాప్టర్ సమావేశం విజయవంతంగా ముగిసింది. మూడు గంటలకు పైగా సాగిన సమావేశానికి నాట్స్ చైర్మన్ కిషోర్ కంచర్ల అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డల్లాస్ చాప్టర్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించడంతో పాటు మే 2027లో ప్రతిష్టాత్మకంగా జరగబోయే 9వ నాట్స్ అమెరికా తెలుగు సంబరాల సన్నాహక కార్యక్రమాలపై విపులంగా చర్చించారు. నాట్స్ మహాసభలకు కన్వీనర్‌గా ప్రేమ్ కలిదిండి, డల్లాస్ చాప్టర్ కో-ఆర్డినేటర్లుగా కిరణ్ నారె, పావని నున్నలను నియమించారు. అనుభవజ్ఞులు, యువత కలయికతో సమతూకంతో ఏర్పడిన ఈ నూతన డల్లాస్ చాప్టర్ జట్టుకి నాట్స్ చైర్మన్ కిషోర్ కంచర్ల, అధ్యక్షుడు రాజ్ అల్లాడ ప్రత్యేక అభినందనలు తెలిపారు. సమావేశంలో నాట్స్ జాతీయ జట్టు నుంచి పలువురు ప్రముఖులు కిషోర్ కంచర్ల, ప్రేమ్ కలిదిండి, అజయ్ గోవాడ, విజయ్‌శేఖర్ అన్నె, భాను లంక, కిషోర్ నారె, రత్నాకర్ శెట్టిపల్లి, శ్రావణ్ నిడిగంటి, ధనుంజయ్ నూతి పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన చాప్టర్ జట్టు భవిష్యత్తులో చేపట్టబోయే ఈ కింది అంశాలపై కూలంకషంగా చర్చించింది.

- నాట్స్ సంస్థలో, సేవా కార్యక్రమాల్లో యువత, మహిళలకు మరింత భాగస్వామ్యం కల్పించడం.
- మే 2027లో డల్లాస్ వేదికగా అంగరంగ వైభవంగా జరగనున్న 9వ అమెరికా తెలుగు సంబరాల నిర్వహణకు పక్కా ప్రణాళికలు రచించడం.
- నాట్స్ మహాసభలను విజయవంతం చేసేందుకు మరింత మంది వాలంటీర్లు ఉత్సాహంగా ముందుకు రావాలని చైర్మన్ కిషోర్ కంచర్ల, కన్వెన్షన్ కన్వీనర్ ప్రేమ్ కలిదిండి పిలుపునిచ్చారు. తెలుగువారి ఐక్యతను చాటే ఈ వేడుకల్లో అందరూ భాగస్వాములు కావాలని వారు కోరారు.

### కాలిఫోర్నియాలో ఆగస్టు 1న

## 'సిలికానాంధ్ర' రజతోత్సవ వేడుకలు

**కాలిఫోర్నియా:** సిలికానాంధ్ర సంస్థ తన 25 ఏళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఆగస్టు 1న కాలిఫోర్నియాలోని ఓక్లాండ్ అరేనాలో సిలికాన్ ఆంధ్ర రజతోత్సవ వేడుకలు నిర్వహించనుంది.
ఈ కార్యక్రమం గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రయత్నానికి కూడా వేదిక కానుంది.
ఉదయం 8.30 గంటలకు శోభా యాత్రతో కార్యక్రమం ప్రారంభమవుతుంది.




ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు: రంగ పూజ, కుంభ హారతి, ప్రారంభోత్సవం, గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రయత్నంలో భాగంగా 'సంగీతామృతవర్షిణి', 'లయామృతవర్షిణి' కార్యక్రమాలు జరుగుతాయి.
మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5 గంటల వరకు: ప్రొక్లమేషన్స్, కూచిపూడి నాట్యామృతవర్షిణి, లలితామృతవర్షిణి, గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రయత్నంలో భాగంగా 'శతక శంఖారావం' నిర్వహిస్తారు.
సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు: అతిథుల సత్కారం, వందేభారతం, దక్షయజ్ఞం, జానపద జాతర జరుగుతాయి. ఈ వేడుకలకు సంబంధించిన మరిన్ని వివరాలు, రిజిస్ట్రేషన్ కోసం silverjubilee.siliconandhra.org వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

# అవినీతి నిరోధక చట్టాలకు మద్దతివ్వండి

## ప్రతిపక్షాలకు డాక్టర్ లక్ష్మణ్ పిలుపు



వికసిత భారత్ 2047 లక్ష్యంతో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరగనున్నాయని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ వెల్లడించారు. గురువారం న్యూఢిల్లీలో ఆయన మాట్లాడారు. దేశంలో అభివృద్ధి, సంస్కరణల ఎజెండాపై సభలో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా ప్రతినిధిగా 25 ఏళ్లు పూర్తయ్యాయని గుర్తు చేశారు. ఇది అభివృద్ధి పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. డిజిటల్ ఇండియా నుంచి ఆత్మనిర్భర్ భారత్ వరకు చారిత్రక నిర్ణయాలు తీసుకున్నారని వివరించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుతో వారి సాధికారతకు ఊతం అవుతుందని బీజేపీ ఎంపీ చెప్పారు. మహిళా బిల్లుతోపాటు డీలిమిటేషన్‌ను ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని విమర్శించారు. డీలిమిటేషన్‌తో ఏ రాష్ట్రానికీ నష్టం జరగదని స్పష్టం చేశారు. ప్రస్తుత సీట్లు తగ్గకుండా 50 శాతం వరకు పెంపునకు బీజేపీ కట్టుబడి ఉందన్నారు. ఒకే దేశం, ఒకే ఎన్నిక దేశ ప్రయోజనాల కోసమేనని తెలిపారు. అవినీతి నిరోధక చట్టాలకు మద్దతు ఇవ్వాలని ప్రతిపక్షాలకు ఆయన సూచించారు. జేపీసీ నివేదిక తర్వాత కీలక బిల్లులపై ముందడుగు పడుతుందని ఎంపీ లక్ష్మణ్ ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులు, మహిళలు, యువత అంశాలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తెలంగాణలోని పెండింగ్ ప్రాజెక్టులపై పార్లమెంట్‌లో స్వరం వినిపిస్తామని అన్నారు. తెలంగాణకు కేంద్రం భారీగా నిధులు, అభివృద్ధి ప్రాజెక్టులు ఇచ్చిందని ఆయన వివరించారు. ఈ వర్షాకాల సమావేశాల్లో సభను అడ్డుకోవద్దని.. చర్చల్లో పాల్గొనాలని ప్రతిపక్షాలకు ఆయన స్పష్టం చేశారు. దేశ ప్రయోజనాలే అందరికీ అత్యున్నత ప్రాధాన్యత కావాలని తెలిపారు. వర్షాకాల సమావేశాలు దేశాభివృద్ధికి కొత్త దిశానిర్దేశం చేస్తాయని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో అన్ని అంశాలపై చర్చలకు సిద్ధంగా ఉన్నామని బీజేపీ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ వివరించారు.



# 20 నుంచి పార్లమెంటు సమావేశాలు

## బిజినెస్ లిస్ట్ విడుదల చేసిన సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న బిజినెస్ లిస్ట్‌ను సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్ గురువారం విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం 5 కొత్త బిల్లులను ప్రవేశపెట్టనుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను 33 నుంచి 37కి పెంచేందుకు చట్ట సవరణ చేయనుంది. గ్లోబల్ మార్కెట్ ఒడిదుడుకుల నేపథ్యంలో ఆదాయపు పన్ను చట్టంలో కీలక సవరణలు చేపట్టనుంది. విదేశీ విరాళాల నియంత్రణ సవరణ బిల్లుపై ఈ సమావేశాల్లో చర్చించి.. ఆమోదం తెలపనుంది. ఉభయ సభల సంయుక్త కమిటీ పరిశీలనలో ఉన్న 'వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు'పై తుది నిర్ణయం తీసుకోనుంది. జనన, మరణాల ఆలస్యం రిజిస్ట్రేషన్ల నిబంధనలను మరింత కఠినతరం చేయనుంది. జాతీయ గౌరవానికి భంగం కలిగించడాన్ని నిరోధించే చట్టానికి మరికొన్ని సవరణలు చేయనుంది. మీడియా రంగంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఆలస్యపు చెల్లింపుల పరిష్కారం కోసం సరికొత్త బిల్లులను ఈ సమావేశాల్లో తీసుకురానుంది. రాష్ట్రాలు సొంతంగా మీడియా ఫెసిలిటేషన్ కౌన్సిళ్లను ఏర్పాటు చేసుకునేలా చట్ట సవరణ చేయనుంది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అదనపు నిధుల వ్యయంపై లోక్‌సభలో ఓటింగ్ నిర్వహించనుంది. ఆగస్ట్ 13వ తేదీతో ఈ వర్షాకాల సమావేశాలు ముగుస్తాయి.

# దీదీకి దెబ్బ మీద దెబ్బ



తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ)కి, ఆ పార్టీ అధ్యక్షురాలు మమతా బెనర్జీకి రాజ్యసభ ఎంపీ రుక్మిణి మల్లిక్ (కోయెల్ మల్లిక్) షాక్ ఇచ్చారు. టీఎంసీకి, రాజ్యసభ సభ్యత్వానికి రుక్మిణి మల్లిక్ ఇవాళ (గురువారం) రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌కు ఆమె సమర్పించారు. దీంతో రాజ్యసభ నుంచి వైదొలగిన నాలుగో టీఎంసీ ఎంపీగా రుక్మిణి నిలిచారు. ఇప్పటికే ఆ పార్టీ నుంచి సుఖేందు శేఖర్ రాయ్, ప్రకాశ్ చిక్ బరైక్, సుష్మితా దేబ్ తమతమ రాజ్యసభ ఎంపీ పదవులకు రాజీనామా చేశారు. ఈ ఏడాది ఆరంభంలోనే రాజ్యసభకు రుక్మిణి మల్లిక్ ఎన్నికయ్యారు. టీఎంసీ 2026 ఫిబ్రవరి 27న రాజ్యసభ ఎన్నికలకు ఆమె అభ్యర్థిత్వాన్ని ప్రకటించింది. దీంతో ఏకగ్రీవంగా ఎన్నికై ఏప్రిల్ 6న రాజ్యసభ ఎంపీగా రుక్మిణి ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికైన వెంటనే టీఎంసీ, మమతా బెనర్జీకి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. బెంగాల్ ప్రజలకు సేవ చేసే అవకాశం లభించడం ఎంతో గౌరవంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇది ఓ కొత్త ప్రయాణానికి ఆరంభమని, ఉత్తమంగా పని చేసేందుకు ప్రయత్నిస్తానని రుక్మిణి చెప్పుకొచ్చారు. అయితే ఎంపీగా ఎన్నికై నాలుగు నెలలు గడవక ముందే తన పదవికి ఆమె రాజీనామా చేయడం సంచలనంగా మారింది. కాగా, రుక్మిణి మల్లిక్ రాజీనామాపై టీఎంసీ, మమతా బెనర్జీ ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటనా చేయలేదు. రుక్మిణి మల్లిక్.. కోయెల్ మల్లిక్ పేరుతో బెంగాలీ చిత్ర పరిశ్రమలో అగ్రశ్రేణి నటి. టాలీ-క్వీన్‌గా ప్రసిద్ధి చెందిన రుక్మిణి రెండు దశాబ్దాలకు పైగా నటించి మంచి పేరు తెచ్చుకున్నారు. 'నాటర్ గురు', 'శుభోదృష్టి', 'మోన్ మానే నా', 'ప్రేమేర్ కహానీ', '100% లవ్', 'రంగబాజ్' వంటి వరుస హిట్ చిత్రాల్లో ఆమె నటించి మెప్పించారు. రుక్మిణి నటనకు గానూ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ బంగ్లా, రెండు బీఎఫ్‌జేఏ అవార్డులు, ఆనందలోక్ పురస్కార్ వంటి అనేక గౌరవాలను అందుకున్నారు. 2023లో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఆమెకు మహానాయక్ సమ్మాన్‌ను కూడా ప్రదానం చేసింది. అనంతరం టీఎంసీ పార్టీ ఆమెను రాజ్యసభకు నామినేట్ చేసింది.

# జగన్నాథ రథయాత్రలో అపశృతి : ఒకరి మృతి



ఒడిశాలోని పూరీ జగన్నాథ రథయాత్రలో అపశ్రుతి చోటుచేసుకుంది. గ్రాండ్ రోడ్డులో రద్దీ విపరీతంగా పెరగడంతో తొక్కిసలాట తరహా పరిస్థితి నెలకొంది. ఈ ఘటనలో ఒకరు మరణించగా 100 మందికి పైగా గాయపడ్డారు. వెంటనే స్పందించిన ఎమర్జెన్సీ సిబ్బంది క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, రద్దీ విపరీతంగా పెరగడంతో ఓ వ్యక్తికి ఊపిరాడక స్పృహ తప్పిపోయినట్లు తెలిసింది. వెంటనే ఆ వ్యక్తిని పూరీ జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు ప్రకటించారు. అయితే, ఈ విషయంపై అధికారులు ఇంకా ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు. మరోవైపు, రద్దీ ఎక్కువైన ప్రాంతంలోని మిగిలిన వారిని సహాయక సిబ్బందీ తక్షణం తరలించారు. సుమారు 120 మందిని ఆసుపత్రిలో చేర్పినట్టు తెలుస్తోంది. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటన నేపథ్యంలో రద్దీ నియంత్రణకు అధికారులు మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టినట్టు సమాచారం. ప్రపంచప్రఖ్యాతి గాంచిన పూరీ జగన్నాథుడి రథయాత్ర లక్షల మంది భక్తుల మధ్య గురువారం ప్రారంభమైన విషయం తెలిసిందే.

# మూసివేసిన రైల్వే ఓవర్‌బ్రిడ్జిపై జన్మదిన వేడుకలు



## ఈవెంట్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేసిన పోలీసులు

భద్రతా కారణాల దృష్ట్యా మూసివేసిన ఓ రైల్వే ఓవర్‌బ్రిడ్జిపై జన్మదిన వేడుకలు నిర్వహించడం కలకలం రేపింది. నిర్మాణ లోపాలతో మూసివేసిన ఆ బ్రిడ్జిపై పెద్దఎత్తున డీజేలు ఏర్పాటు చేసి వందలాది మంది హుషారుగా నృత్యాలతో హోరెత్తించారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అవి పోలీసుల దృష్టికి వెళ్లడంతో నిందితులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ ఘటన బిహార్‌లోని బక్సర్ జిల్లాలో చోటుచేసుకుంది. బక్సర్ జిల్లాలో మే 31న బక్సర్, ఇటార్హి రైల్వే ఓవర్‌బ్రిడ్జి ప్రారంభమైంది. ఈ ప్రాజెక్టును దాదాపు 12 ఏళ్ల పాటు రూ.26.4కోట్ల వ్యయంతో అధికారులు నిర్మించారు. అయితే, వాహనాల రాకపోకలకు తెరిచిన కేవలం నాలుగు రోజులకే బ్రిడ్జి దెబ్బతింది. ఐదో పిల్లర్‌పై ఉన్న స్లాబ్ ఒక్కసారిగా కుంగిపోయింది. దీంతో అధికారులు మొదట భారీ వాహనాలను వంతెనపైకి రాకుండా నిషేధించారు. ఆ తర్వాత రైల్వే ఓవర్‌బ్రిడ్జిని నిశితంగా పరిశీలించి జూన్ 5 నుంచి వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. బ్రిడ్జిపైకి ఎవరూ వెళ్లకుండా ఆంక్షలు విధించారు. అయితే, అధికారుల ఆంక్షలను ఓ స్థానిక కుటుంబం లెక్కచేయలేదు. జూలై 11న పుట్టినరోజు వేడుకను ఘనంగా నిర్వహించింది. ఆ రోజు వందల మంది బ్రిడ్జిపై గుమిగూడారు. పెద్దపెద్ద డీజేలు పెట్టి నచ్చిన పాటలకు డ్యాన్సులు చేస్తూ సంబరాలు చేసుకున్నారు. వాటిని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఆ వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ప్రజా వినియోగానికి సురక్షితం కాదని ప్రకటించిన వంతెనపై ఇలాంటి కార్యక్రమానికి ఎలా అనుమతి ఇచ్చారని ప్రశ్నలు వెల్లువెత్తాయి. ఈ విషయం బక్సర్ ఎస్పీ శుభమ్ ఆర్య దృష్టికి వెళ్లింది. దీంతో ఈవెంట్ నిర్వాహకుడు రాకేశ్ కుమార్ సింగ్‌పై కేసు నమోదు చేశారు. అయితే, పుట్టినరోజు వేడుకలు నిర్వహించిన కుటుంబంపైనా చర్యలు తీసుకుంటారా, లేదా? అనేది వేచి చూడాలి.

# ట్రంప్‌ను చంపేస్తాం




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శవపేటికలో ఉన్నట్లున్న చిత్రాన్ని ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని ఓ హోర్డింగ్‌పై ప్రదర్శించడం ప్రస్తుతం కలకలం రేపుతోంది. ట్రంప్‌ను అంతం చేస్తామన్న హెచ్చరికను ఇంగ్లిష్, పర్షియన్ భాషల్లో చిత్రంపై రాశారు. ఎంఘిలాబ్ స్క్వేర్ ప్రాంతంలోని ఓ హోర్డింగ్‌పై ఈ వార్నింగ్‌ను ప్రదర్శించారు. మినాబ్‌కు చెందిన చిన్నారుల స్మృత్యర్థం అని కూడా చిత్రంపై రాశారు. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై జరిగిన తొలి దాడిలో మినాబ్ నగరంలోగల ఓ స్కూల్లోని విద్యార్థులు కూడా మరణించిన విషయం తెలిసిందే. ఈ ఘటనను ఉద్దేశిస్తూ బిల్‌బోర్డుపై నిరసనకారులు ఈ హెచ్చరిక చేశారు.

### గతంలోనే ఇజ్రాయెల్ హెచ్చరికలు

ట్రంప్‌ను చంపేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఇజ్రాయెల్ కొద్ది రోజుల క్రితమే యూఎస్‌ను హెచ్చరించినట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇజ్రాయెల్ నిఘా వర్గాలు అమెరికాను ఈ మేరకు అప్రమత్తం చేసినట్టు తెలుస్తోంది. ట్రంప్‌నకు ముప్పు ఉండవచ్చనే సంకేతాలు అమెరికా నిఘా వర్గాల దృష్టికి కూడా వచ్చినట్టు సీఎన్‌ఎన్ వార్తాసంస్థ ఒక కథనాన్ని ప్రచురించింది. అయితే, ట్రంప్‌ను అంతం చేసేందుకు ప్రత్యేకంగా కుట్ర జరుగుతోందని ఇజ్రాయెల్ హెచ్చరించడం ఇదే తొలిసారని అమెరికా మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ కథనాలు వైరల్ అయిన కొద్ది సేపటికే ట్రంప్ ఇరాన్‌కు గట్టి వార్నింగ్ కూడా ఇచ్చారు. ఇరాన్ వైపు 1000 మిసైల్స్‌ను గురిపెట్టి ఉంచామని అన్నారు. తనను టార్గెట్ చేస్తే మరిన్ని మిసైల్స్ ఇరాన్ వైపు దూసుకొస్తాయని హెచ్చరించారు.

# గ్రీన్‌కార్డు కోసం లక్ష డాలర్ల బాండ్

## అమెరికా కొత్త ప్రతిపాదన




అమెరికాలోకి వలసలను నిరోధించేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్న ట్రంప్ ప్రభుత్వం గ్రీన్ కార్డుకు సంబంధించి మరో కొత్త ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. విదేశాల్లోని యూఎస్ కాన్సులేట్‌ల నుంచి గ్రీన్ కార్డు కోసం అప్లై చేసుకునే కొందరు లక్ష డాలర్ల వరకూ బాండ్ సమర్పించే నిబంధన ప్రవేశపెట్టేందుకు యోచిస్తున్నట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అయితే, ఈ ప్రతిపాదన ఇంకా పరిశీలన దశలోనే ఉన్నట్టు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు కూడా వెల్లడి కావాల్సి ఉంది. మీడియా కథనాల ప్రకారం, విదేశాల్లోని కాన్సులేట్లల్లో దరఖాస్తు చేసుకునే కొందరు ఈ బాండ్‌ను సమర్పించాల్సి ఉంటుంది. గ్రీన్ కార్డు వచ్చాక ఈ మొత్తాన్ని తిరిగిచ్చేస్తారు. మొదట్లో కొన్ని దేశాల్లో పైలట్ ప్రాజెక్టు కింద ఈ విధానాన్ని ప్రవేశపెట్టే విషయాన్ని అమెరికా ప్రభుత్వం పరిశీలిస్తోంది. అయితే, ఏయే దేశాలకు ఈ కొత్త నిబంధన వర్తిస్తుందనే విషయాన్ని అమెరికా అధికారులు వెల్లడించలేదు. అమెరికా ఏటా విదేశీయులకు 1.40 లక్షల ఉద్యోగ ఆధారిత గ్రీన్ కార్డులు జారీ చేస్తున్న విషయం తెలిసిందే. ఒక్కో దేశానికి 7 శాతం మించకుండా వీటిని జారీ చేస్తోంది. గ్రీన్ కార్డుల కోసం భారతీయులు ఎక్కువగా దరఖాస్తు చేసుకుంటుండటంతో బ్యాక్‌లాగ్స్ పెరిగిపోతున్నాయి. తమ వంతు కోసం అనేక మంది దరఖాస్తుదారులు దశాబ్దాల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. అంతేకాకుండా, తక్కువ ఆదాయం ఉన్న వారిని ఈ నిబంధన మరిన్ని కష్టాలపాలు చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం అమెరికా ఈ బాండ్ అంశాన్ని పరిశీలిస్తోంది. అమలు చేసేందుకు సిద్ధమయ్యాకే ఈ రూల్‌కు సంబంధించి పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉంది.

# పాక్ మునీర్‌కు రాజకీయ సెగ

పాక్ రాజకీయాల్లో ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ జోక్యం అంతకంతకూ పెరుగుతున్న తీరుపై స్థానిక రాజకీయ ప్రముఖుడు, మౌలానా ఫజ్లుర్ రెహ్మాన్ తాజాగా అగ్గిమీద గుగ్గిలమయ్యారు. ఆసిమ్ మునీర్‌కు దమ్ము ఉంటే మిలిటరీ పదవికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి రావాలని సవాలు విసిరారు. రాజకీయ వ్యవహారాల్లో మిలిటరీ జోక్యం మితిమీరుతున్న వైనంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. 'నీకు రాజకీయాలు చేయాలని ఉంటే యూనీఫామ్ తొలగించి రాజకీయాల్లోకి రా.. ఎన్నికల్లో పోటీ చేయి. అప్పుడు నీకు ఎన్ని ఓట్లు రాలతాయో తేలిపోతుంది' అని రెహ్మాన్ మండిపడ్డారు. దేశాన్ని ఎవరు పరిపాలించాలో నిర్ణయించాల్సింది మిలిటరీ కాదని స్పష్టం చేశారు. దేశ జనాభా నియంత్రణకు సంబంధించిన బాధ్యతలను కూడా పాక్ ప్రభుత్వం ఆర్మీ చీఫ్‌కు కట్టబెట్టిన నేపథ్యంలో రెహ్మాన్ ఈ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

ఉగ్రవాదంపై పోరాడేందుకు సామాన్యులు సాయుధ దళాలుగా ఏర్పడాలన్న సూచనపై కూడా రెహ్మాన్ తీవ్రంగా విమర్శించారు. దేశానికి భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం, ఆర్మీదేనని స్పష్టం చేశారు.



## పశ్చిమాసియాలో

# మళ్లీ యుద్ధ బీభత్సం

పశ్చిమాసియాలో మళ్లీ పూర్తిస్థాయి యుద్ధం దిశగా అడుగులు పడుతున్నాయి. పరస్పర దాడులు ఉధృతమవడం, ఇరాన్ హోర్ముజ్‌ను మూసివేయడం, అమెరికాతో డీల్ నుంచి తప్పుకొంటున్నట్టు ప్రకటించడం, హోర్ముజ్ వెలుపల అమెరికా నౌకా దిగ్బంధం వంటి పరిణామాలు ఆందోళన రేపుతున్నాయి. కాల్పుల విరమణ ప్రకటన తర్వాత ఇప్పటివరకూ ఇరాన్‌పై అర్ధరాత్రి తర్వాత మాత్రమే, అదీ పరిమితంగా దాడులు చేస్తూ వచ్చిన అమెరికా.. ఇప్పుడు పూర్తిస్థాయి యుద్ధం తరహాలో పగటి పూట కూడా బాంబులు వేయడం మొదలుపెట్టింది. ఇరాన్ కీలక ప్రాంతాలపై బుధవారం తెల్లవారుజాము నుంచి ఏడు గంటల పాటు బాంబుల వర్షం కురిపించింది. అటు ఇరాన్ కూడా పగలు, రాత్రి తేడా లేకుండా గల్ఫ్‌లోని అమెరికా సైనిక స్థావరాలపైకి డ్రోన్లు, క్షిపణులను ప్రయోగిస్తోంది. పదుల కొద్దీ డ్రోన్లు, క్షిపణులు తమవైపు వచ్చాయని, వాటిని మధ్యలో అడ్డుకున్నామని బహ్రెయిన్, కువైట్, జోర్డాన్, యూఏఈ ప్రకటించాయి. అయితే బహ్రెయిన్‌లోని అమెరికా 5వ ఫ్లీట్ నౌకాదళ కమాండ్ సెంటర్‌ను, ఇంధన ట్యాంకులను ధ్వంసం చేశామని.. కువైట్‌లోని మినా అబ్దుల్లా అమెరికా స్థావరంలో మిలిటరీ వ్యవస్థలను దెబ్బతీశామని ఐఆర్‌జీసీ పేర్కొంది. గత వారంలో రోజుల్లో అమెరికా దాడుల్లో ఇరాన్‌లో మృతుల సంఖ్య 30కి, గాయపడ్డవారి సంఖ్య 260కి పెరిగినట్టు ఇరాన్ ఆరోగ్యశాఖ ప్రతినిధి బుధవారం వెల్లడించారు. బుధవారం ఒక్కరోజే ఏడుగురు మరణించినట్టు తెలిపారు. బుధవారం సాయంత్రం హోర్ముజ్‌లో కీలకమైన గ్రేటర్ టంబ్ దీవిపై అమెరికా భారీ దాడి చేసింది. ఇరాన్– యూఏఈ మధ్య వివాదమున్న ఈ దీవి కొన్నేళ్లుగా ఇరాన్ ఆధీనంలో ఉంది. గ్రేటర్ టంబ్ దీవిపై దాడితో ఇరాన్ హోర్ముజ్‌లో నౌకలపై దాడి చేసే సామర్థ్యం మరింత తగ్గిపోయిందని అమెరికా పేర్కొంది. హోర్ముజ్ జలసంధి బయట అమెరికా నౌకా దిగ్బంధం కొనసాగుతోందని, జలసంధి దాటేందుకు ప్రయత్నించిన రెండు ఇరాన్ సంబంధిత నౌకలను వెనక్కి పంపామని తెలిపింది.

### హోర్ముజ్ మూత..
### చమురు ఎగుమతులు బంద్!

అమెరికాతో అవగాహన ఒప్పందం నుంచి పూర్తిగా తప్పుకొంటున్నట్టు ఇరాన్ ప్రకటించింది. ఏదేమైనా సరే హోర్ముజ్ జలసంధిపై తమ సార్వభౌమాధికారాన్ని వదులుకునే ప్రసక్తే లేదని పేర్కొంది. హోర్ముజ్‌ను పూర్తిగా మూసివేస్తున్నామని, పరిస్థితి చక్కబడే వరకు ఎలాంటి నౌకా ప్రయాణానికి వీలు లేదని ఐఆర్‌జీసీ ప్రకటించింది. హోర్ముజ్ బయట అమెరికా దిగ్బంధంపై మండిపడింది. పశ్చిమాసియా, గల్ఫ్ ప్రాంతాల్లోని ఇరాన్ సహా అన్ని దేశాల నుంచి ఎలాంటి ఆటంకం లేకుండా చమురు, గ్యాస్ ఎగుమతులు జరగాలని.. లేదా ఏ దేశం నుంచీ, ఎలాంటి ఎగుమతులు జరగడానికి వీల్లేదని స్పష్టం చేసింది.

### మౌలిక సదుపాయాలు
### ధ్వంసం చేస్తాం: ట్రంప్

ఇరాన్ వచ్చే వారంలోగా చర్చలకు రాకపోతే.. ఆ దేశం అంతుచూస్తామని, మౌలిక సదుపాయాలనూ ధ్వంసం చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. ట్రంప్ బుధవారం కీలకమైన సిట్యువేషన్ గదిలో సమావేశం నిర్వహించారు. సాధారణంగా విదేశాల్లో సైనిక చర్యలు, దాడులు చేపట్టినప్పుడు ఈ గది నుంచి సమీక్షిస్తుంటారు. ప్రస్తుతం ఇరాన్‌తో మళ్లీ యుద్ధం చేపట్టవచ్చున్న అంచనాల నేపథ్యంలో ట్రంప్ ఇదే గదిలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ, రక్షణ మంత్రులు మార్కో రూబియో, పీట్ హెగ్సెత్, రక్షణశాఖ ఉన్నతాధికారులు ఈ భేటీలో పాల్గొన్నారు.



# బాంగ్లాదేశ్ అమ్మాయిల వెంట పడొద్దు

బంగ్లాదేశ్‌లో వధువులను కొనుగోలు చేయడం, మానవ అక్రమ రవాణాకు పాల్పడడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని చైనా తన పౌరులను హెచ్చరించింది. ఈ తరహా నేరాలకు పాల్పడితే బంగ్లాదేశ్ చట్టాల ప్రకారం కఠిన శిక్షలు, అత్యంత తీవ్రమైన సందర్భాల్లో మరణశిక్ష కూడా విధించే అవకాశం ఉందని ఢాకాలోని చైనా రాయబార కార్యాలయం అత్యవసర సూచన విడుదల చేసింది. ప్రస్తుతం చైనాలో అమ్మాయిల సంఖ్య చాలా తక్కువగా ఉంది. 2020 జనాభా లెక్కల ప్రకారం, చైనాలో వివాహ వయస్సులో ఉన్న మహిళల సంఖ్య కంటే పురుషుల సంఖ్య దాదాపు 2 కోట్లు ఎక్కువగా ఉంది. అమ్మాయిల కొరతను ఆసరాగా తీసుకుని, అక్రమ రవాణాదారులు వివాహం పేరుతో మోసాలకు పాల్పడుతున్నారు. పేద దేశాలకు చెందిన యువతులను, ముఖ్యంగా బంగ్లాదేశ్ అమ్మాయిలను పెళ్లి చేసుకోవడానికి చైనీయులు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో చైనా రాయబార కార్యాలయం అత్యవసర హెచ్చరిక జారీ చేసింది. విదేశాల్లో వివాహం పేరుతో జరిగే మోసాలు, మానవ అక్రమ రవాణా ముఠాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ముఖ్యంగా మధ్యవర్తులు లేదా సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయమైన వ్యక్తుల మాటలను నమ్మి అక్రమ వివాహాలు చేసుకోవద్దని హెచ్చరించింది. ఇలాంటి చర్యలు స్థానిక చట్టాల ఉల్లంఘనకు దారితీస్తాయని పేర్కొంది. బ్రోకర్లు కుదిర్చే ఈ వివాహాల వల్ల స్త్రీపురుషులు ఇద్దరూ బాధితులుగా మారుతున్నారు. చైనా పురుషులు భార్యను వెతుక్కోవడానికి వేల యువాన్‌లు ఖర్చు చేస్తున్నారు. కానీ ఆ విదేశీ వధువులు డబ్బులు తీసుకుని రహస్యంగా అదృశ్యమవుతున్నారు. మరికొన్ని కేసులలో, పేద దేశాలకు చెందిన మహిళలను అపహరించి, చైనా పురుషులను పెళ్లి చేసుకోమని బలవంతం చేస్తున్నారు. నేపథ్యంలో మానవ అక్రమ రవాణా, వధువుల కొనుగోలు, నకిలీ వివాహాలకు సంబంధించిన ఏ కార్యకలాపాల్లోనూ పాల్గొనవద్దని చైనా రాయబార కార్యాలయం స్పష్టం చేసింది. ఏవైనా అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే స్థానిక పోలీసులను లేదా చైనా రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించింది. విదేశాల్లో చట్టాలను ఉల్లంఘించడం వల్ల వ్యక్తిగత స్వేచ్ఛతో పాటు జీవితానికే ముప్పు ఏర్పడే అవకాశముందని కూడా హెచ్చరించింది.

# అంతా అతిరథులే!

## అతిగా పొగిడితే వెనకబడతారు - గంభీర్‌కు డివిల్లీర్స్ సూచన





ఇటీవలి యూకే పర్యటనలో టీమిండియా వరుసగా టీ 20 సిరీస్‌లను కోల్పోయిన నేపథ్యంలో కోచ్ గౌతమ్ గంభీర్‌కు దక్షిణాఫ్రికా మాజీ ఆటగాడు ఏబీ డివిల్లీర్స్ కీలక సూచన చేశాడు. ప్రస్తుతం టీమిండియాలో స్టార్లుగా చెలామణి అవుతున్న యువ ఆటగాళ్లను నేల మీదకు దించాలని సూచించాడు. లేకపోతే భారత క్రికెట్ ప్రమాదంలో పడుతుందని హెచ్చరించాడు. 'వైభవ్ సూర్యవంశీ, సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ వంటి అసాధారణ ప్రతిభ కలిగిన బ్యాటర్లు టీమిండియాలో ఉన్నారు. అయితే అంతర్జాతీయ క్రికెట్‌లో దీర్ఘకాలం రాణించాలంటే కేవలం ప్రతిభ సరిపోదు. క్రమశిక్షణ, మానసిక దృఢత్వం, సరైన మార్గదర్శకత్వం కూడా అవసరం. యువ ఆటగాడిని అతిగా పొగడకూడదు. అతడు ఇంకా నేర్చుకునే దశలో ఉన్నాడనే విషయాన్ని గుర్తుంచుకోవాలి' అని తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ డివిల్లీర్స్ పేర్కొన్నాడు. 'ఐపీఎల్‌లో ఎన్నో పరుగులు చేసిన ఆటగాళ్లను ఈ పరాజయాలు వాస్తవంలోకి తీసుకువస్తాయి. ఇది అంతర్జాతీయ క్రికెట్ అని వారు అర్థం చేసుకోవాలి. ఇక్కడ బలహీనతకు తావు లేదు. ఐపీఎల్‌లో, మనం పరుగులు చేయగలమని భావించే ఒకరిద్దరు బౌలర్లు ఎప్పుడూ ఉంటారు. అంతర్జాతీయ క్రికెట్‌లో దాక్కోవడానికి చోటు ఉండదు. మీకు ఒకటి, రెండు కంటే ఎక్కువ గేర్లు అవసరం. మీరు ఎల్లప్పుడూ ఐదో గేర్‌లో బ్యాటింగ్ చేయలేరు' అని డివిల్లీర్స్ పేర్కొన్నాడు.

## అర్జెంటీనా అదుర్స్

### ఇంగ్లండ్‌పై గెలుపుతో రెండోసారి ఫైనల్‌కు

చిరకాల ప్రత్యర్థి ఇంగ్లండ్‌తో జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌లో అర్జెంటీనా అద్భుత విజయాన్ని నమోదు చేసింది. వరుసగా రెండో సారి ఫైనల్ బరిలోకి అడుగుపెట్టింది. చివరి క్షణాల్లో అద్భుతంగా పుంజుకున్న అర్జెంటీనా.. ఇంగ్లండ్‌పై 2–1తో విజయాన్ని సాధించింది. ఈ నెల 19న జరగబోయే మెగా ఫైనల్‌లో స్పెయిన్‌తో తలపడనుంది. మ్యాచ్ ప్రారంభం నుంచే ఇరు జట్లు దూకుడుగా ఆడినా తొలి అర్ధభాగంలో గోల్ నమోదు కాలేదు. మ్యాచ్ 55వ నిమిషంలో ఆంథోనీ గోర్డన్ ఒక గోల్ సాధించడంతో ఇంగ్లండ్‌కు ఆధిక్యం లభించింది. ఆ తర్వాత కూడా ఇంగ్లండ్ రక్షణ పటిష్ఠంగా కనిపించడంతో ఆ జట్టు ఫైనల్‌కు చేరుతుందనే భావన నెలకొంది. అయితే చివరి నిమిషాల్లో అర్జెంటీనా తన ఆటను పూర్తిగా మార్చేసింది. 85వ నిమిషంలో ఎంజో ఫెర్నాండెజ్ గోల్ సాధించి స్కోరును సమం చేయడంతో మ్యాచ్ ఉత్కంఠగా మారింది. ఇక, ఆ తర్వాత అదనపు సమయంలో లియొనెల్ మెస్సి ఇచ్చిన అద్భుతమైన క్రాస్‌ను లౌటారో మార్టినెజ్ హెడ్డర్‌తో గోల్‌గా మలిచి అర్జెంటీనాకు చరిత్రాత్మక విజయాన్ని అందించాడు.



ఈ మ్యాచ్‌లో అర్జెంటీనా కెప్టెన్ లియోనాల్ మెస్సి తన అనుభవాన్ని అంతా ఉపయోగించి ఆడాడు. కీలక సమయంలో మెస్సి అందించిన అసిస్ట్ అర్జెంటీనా విజయంలో కీలక పాత్ర పోషించింది. ఈ టోర్నీలో మొత్తం 8 గోల్స్‌తో గోల్డెన్ బూట్ రేసులో కూడా ముందున్నాడు. 19వ తేదీన జరిగే ఫైనల్ మ్యాచ్‌లో స్పెయిన్‌తో అర్జెంటీనా తలపడనుంది. ఆ మ్యాచ్‌లో కూడా సత్తా చాటి వరుసగా రెండో టైటిల్ సాధించాలని అర్జెంటీనా ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. మరోవైపు టోర్నీ ఆసాంతం జోరు కనబరిచిన స్పెయిన్ కూడా టైటిల్‌పై కన్నేసింది. ఈ పోరు కోసం ఫుట్‌బాల్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## పదహారేళ్ల తరువాత ఫైనల్‌కు

### ఫ్రాన్స్‌పై అనూహ్య విజయం

దాదాపు పదహారేళ్ల క్రితం ఫిఫా ప్రపంచకప్‌లో స్పెయిన్ చాంపియన్‌గా నిలిచింది.. ఆ తర్వాత మూడు పర్యాయాలు కప్పులో కనీసం నాకౌట్ దశ కూడా దాటలేకపోయింది.. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఈసారి టోర్నీలో అడుగుపెట్టిన స్పానిష్ జట్టు అంచనాలకు అందని ఆటతో అదర గొట్టింది. ఒక్కో ప్రత్యర్థిని అలవోకగా దాటుకుంటూ అజేయంగా దూసుకెళు _న్న స్పెయిన్.. అంతేదీటుగా సెమీఫైన ల్లో హాట్ ఫేవరెట్ ఫ్రాన్స్‌పైనా విజృం భించింది. సారథి ఎంబాపె, డెంబెలె లాంటి స్టార్లున్న బలమైన ఫ్రెంచ్ జట్టుకు ఒక్క గోల్‌కు కూడా అవకాశ మివ్వకుండా 2–0తో షాకిచ్చి ఫైనల్ చేరింది. నాటి స్వర్ణయుగాన్ని మరిపి స్తూ స్పానిష్ ఆటగాళ్లు వ్యూహాత్మక ఆటతీరుతో మాజీ చాంపియన్ ఫ్రాన్స్‌ను చిత్తుచేశారు. మైకేల్ ఓయర్జబల్ (22వ నిమిషం), పెడ్రో పోరో (58వ) చెరో గోల్ చేసి స్పెయిన్ విజయంలో కీలకపాత్ర పోషించారు. స్పెయిన్ దూకుడుతో ఫ్రాన్స్ పూర్తిగా చేతులెత్తేసింది. ముఖ్యంగా ఫ్రెంచ్ సూపర్‌స్టార్ ఎంబాపె గోల్ అవకాశాలను సృష్టించలేకపోయాడు. ప్రత్యర్థి డిఫెన్స్‌ను ఛేదించలేకపోయాడు. దీంతో.. వరుసగా మూడోసారి ఫైనల్ చేరాలన్న ఆ జట్టు కల భగ్నమైంది. రెండుసార్లు ప్రపంచకప్ విజేత (1998, 2018) అయిన ఫ్రాన్స్, ఈ మెగా టోర్నీలో సెమ?సలో ఓడడం ఇది నాలుగోసారి. ఇక.. 17వ సారి ప్రపంచకప్ ఆడు తోన్న స్పెయిన్ ఒకేఒక సారి టైటిల్ నెగ్గింది. తొలిసారిగా 2010లో ఫైనల్ చేరడంతో పాటు విజేతగా నిలిచింది.





## గోల్డెన్ బూట్ రేసులో మెస్సీ లీడింగ్

ఫిఫా వరల్డ్ కప్‌లో అర్జెంటీనా స్టార్ ప్లేయర్ తన ఆటతీరుతో ఆకట్టుకుంటున్నాడు. దిగ్గజ ఫుట్‌బాల్ ప్లేయర్‌గా పేరొందిన మెస్సీ తన మ్యాజిక్ గేమ్‌తో ప్రత్యర్థులను చిత్తు చేస్తున్నాడు. ఇంగ్లండ్‌తో జరిగిన సెమీఫైనల్లోనూ అతడు టాలెంట్ ప్రదర్శించాడు. రెండు అసిస్ట్‌లు ఇచ్చి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అయితే వరల్డ్‌కప్ టోర్నీలో ఇచ్చే గోల్డెన్ బూట్ అవార్డు రేసులో ప్రస్తుతం అర్జెంటీనా ప్లేయర్ లియోనల్ మెస్సీ ముందున్నారు. మెస్సీ ఖాతాలో 8 గోల్స్, 4 అసిస్ట్‌లు ఉన్నాయి. దీంతో అతను అడిడాస్ గోల్డెన్ బూట్ అవార్డు రేసులో దూసుకెళ్తున్నాడు.

అయితే ఫ్రాన్స్‌ను సెమీస్ వరకు తీసుకెళ్లిన ఆ జట్టు కెప్టెన్ కైలియన్ ఎంబాపే కూడా మెస్సీ వెనుకే దూసుకొస్తున్నాడు. ఎంబాపే ఖాతాలో 8 గోల్స్, మూడు అసిస్ట్‌లు ఉన్నాయి. గోల్డెన్ బూట్ కోసం రెండో స్థానంలో ఎంబాపే ఉన్నాడు. నార్వేకు చెందిన ఎర్లింగ్ హాలాండ్, ఇంగ్లండ్ ప్లేయర్ జూడ్ బెల్లింగ్‌హామ్.. కేన్, ఫ్రాన్స్ ప్లేయర్ డెంబ్లే, స్పెయిన్ ప్లేయర్ ఒయర్‌జెబల్ తర్వాత స్థానాల్లో ఉన్నారు. ఇంగ్లండ్‌పై ఊహించని రీతిలో కోలుకుని అర్జెంటీనా విక్టరీ నమోదు చేయడంతో గోల్డెన్ బూట్ రేసులో ముందు వరుసలోకి వచ్చేశాడు. వాస్తవానికి ఎంబాపే, మెస్సీ మధ్య గోల్స్ సంఖ్య సమంగా ఉన్నా.. అసిస్ట్‌ల సంఖ్యలో మెస్సీ ఆధిక్యంలో ఉన్నాడు. దీంతో గోల్డెన్ బూట్ రేసు ఆసక్తికరంగా మారింది. ఇక మూడో స్థానం కోసం ఇంగ్లండ్‌తో జరిగే మ్యాచ్‌లో ఫ్రాన్స్ తలపడనున్నది. ఒకవేళ ఆ మ్యాచ్‌లో ఎంబాపే గోల్స్ చేస్తే, అప్పుడు పరిస్థితి మారే అవకాశం ఉంటుంది.

## అప్పుడు స్నానం చేయించిన చిన్నారే... ఇప్పుడు ప్రత్యర్థి

ఫుట్‌బాల్ ప్రపంచంలో అరుదైన సంఘటన కు ఫిఫా ప్రపంచ కప్–2026 ఫైనల్ వేదిక కానుంది. 19 ఏళ్ల క్రితం అర్జెంటీనా దిగ్గజ ఆటగాడు మెస్సీ తన చేతులతో స్నానం చేయిం చిన ఓ చిన్నారి... ఇప్పుడు ప్రపంచకప్ ఫైనల్లో అతడికే ప్రత్యర్థిగా నిలుస్తున్నాడు. ఆ చిన్నారి మరెవరో కాదు.. స్పెయిన్ యువ సంచలనం లామిన్ యమాల్. మరోవైపు అతడికి ఎదురుగా నిలిచేది అర్జెంటీనా దిగ్గజం మెస్సీ

2007లో బార్సిలోనాలో నిర్వహించిన యుని సెఫ్ స్వచ్ఛంద కార్యక్రమం కోసం క్యాలెండర్ ఫొటోషూట్ ఏర్పాటు చేశారు. ఆ కార్యక్రమంలో యువ మెస్సీ... అప్పటికి కేవలం కొన్ని నెలల వయసున్న లామిన్ యమాల్‌కు స్నానం చేయి స్తూ ఫొటోలకు పోజులిచ్చాడు. ఆ సమయంలో ఈ చిన్నారి భవిష్యత్తులో ప్రపంచ ఫుట్‌బాల్ స్టార్‌గా ఎదుగుతాడని ఎవరూ ఊహించి ఉండ రు. ఫుట్‌బాల్ అంటే విపరీతంగా ఇష్టపడే ఆ చిన్నారి అంచెలంచెలుగా ఎదిగి స్పెయిన్ జట్టు లో స్థానం సంపాదించాడు. క్లబ్, దేశం తరపున ఆడుతున్న యమాల్ రికార్డుల మీద రికార్డులు బద్దలుకొడుతూ దూసుకుపోతున్నాడు. ఫుట్‌బాల్ తర్వాతి తరం సూపర్‌స్టార్‌గా ఎదుగుతున్నాడు. ఒకప్పుడు తనకు స్నానం చేయించిన దిగ్గజ ఆటగాడికి ప్రత్యర్థిగా యమాల్ ఫిఫా ప్రపంచకప్ ఆడబోతున్నాడు. జులై 19వ తేదీన అర్జెంటీనా, స్పెయిన్ జట్ల మధ్య ఫిఫా ప్రపంచకప్–2026 ఫైనల్ మ్యాచ్ జరగబోతోంది.





చైతన్య రథం సినిమా
శుక్రవారం 17 జూలై 2026 IX

# రాగిణి 3 షూటింగ్ షురూ

## లీడ్ రోల్‌లో మిల్క్ బ్యూటీ

మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా లీడ్ రోల్‌లో నటిస్తున్న క్రేజీ హారర్ థ్రిల్లర్ 'రాగిణి 3' షూటింగ్ అధికారికంగా ప్రారంభమైంది. లండన్‌లో శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని 2027లో గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. శశాంక ఘోష్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా, బాలీవుడ్‌లో విజయవంతమైన 'రాగిణి' హారర్ ఫ్రాంచైజీకి కొనసాగింపుగా రాబోతోంది. తమన్నా కెరీర్‌లోనే అత్యంత బోల్డ్ గ్లామరస్ పాత్రలో ఈ చిత్రంలో కనిపించనుండటం విశేషం. ఈ చిత్రంలో అమీర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ ఒక కీలక పాత్రలో నటిస్తున్నాడు. గత కొన్నేళ్లుగా గ్లామర్ డోస్ పెంచుతూ డిజిటల్ స్పేస్‌లోనూ సంచలనం సృష్టిస్తున్న తమన్నా, కేవలం సౌత్ సినిమాలకే పరిమితం కాకుండా హిందీ వెబ్ సిరీస్‌లు, ఓటీటీ ప్రాజెక్ట్‌లతో బాలీవుడ్ ప్రేక్షకులకు మరింత దగ్గరైంది.ఇటు తెలుగు, తమిళ భాషల్లో కమర్షియల్ చిత్రాలను బ్యాలెన్స్ చేస్తూ దూసుకుపోతోంది. ముఖ్యంగా 'జైలర్' సినిమాలోని "కావాలా" వంటి స్పెషల్ సాంగ్స్ దేశవ్యాప్తంగా చార్ట్‌బస్టర్‌గా నిలవడంతో, ఐటెం సాంగ్స్ స్పెషల్ అప్పియరెన్స్‌లకు తమన్నా ఇప్పుడు ప్రైమ్ ఛాయిస్‌గా మారింది. ఈ క్రేజీ హారర్ ఫ్రాంచైజీలో తమన్నా గ్లామర్ నటన సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి.



# లేటయినా లేటెస్ట్‌గా...

## సిద్ధమైన ప్రభాస్ ఫౌజీ




పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం చేస్తున్న అవైటెడ్ చిత్రాల్లో టాలెంటెడ్ దర్శకుడు హను రాఘవపూడి కలయికలో చేస్తున్న భారీ పీరియాడిక్ యాక్షన్ చిత్రమే "ఫౌజీ". యంగ్ హీరోయిన్ ఇమాన్వి ప్రభాస్ సరసన నటిస్తూ తెలుగు సినిమాకి పరిచయం అవుతోంది. ఈ నేపథ్యంలో ఎప్పుడు నుంచో షూటింగ్ జరుపుకుంటున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్ రిలీజ్ ఇప్పుడు అనేది సస్పెన్స్‌గా మారింది. ప్రభాస్ అభిమానులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న ఈ అప్డేట్ వెనుక ఉన్న సస్పెన్స్‌ని మేకర్స్ ఫైనల్‌గా ఇప్పుడు బ్రేక్ చేశారు. ఇలా ప్రభాస్ పై ఓ క్రేజీ పోస్టర్ తో సినిమా విడుదలని ఈ ఏడాది డిసెంబర్ 3న భారీ ఎత్తున విడుదల చేస్తున్నట్టుగా ఖరారు చేసేసారు. ఇక దీనిపై వదిలిన పోస్టర్ మాత్రం ఫ్యాన్స్‌లో ఊహించనిదిగా థ్రిల్లింగ్‌గా మారింది. ప్రభాస్ భీకర యుద్ధం చేసి పంచె కట్టులో రైఫిల్ పట్టుకొని సేద తీరుతున్న ప్రభాస్ లుక్ అదిరిపోయింది అని చెప్పాల్సిందే. సో మొత్తానికి ఇది మాత్రం ప్రభాస్ అభిమానులకి బిగ్గెస్ట్ ట్రీట్‌గా ఈ ఏడాదిలో నిలిచే అవకాశం ఉందని చెప్పొచ్చు. ఇక ఈ చిత్రానికి విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తుండగా మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.







# టోంగా... టోంగా...

## 'హుషారు పిట్టలు' నుంచి హుషారైన గీతం విడుదల

అన్షు, వాసవి గణేషన్ కాంబోలో రూపొందుతోన్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'హుషారు పిట్టలు'. పద్మ అమ్మ, బీవీజీ స్టూడియోస్ సమర్పణలో రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి బిక్షు దర్శకుడు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు ఏషియన్ సురేష్ ఫిలింస్ సంస్థలు విడుదల చేస్తున్నాయి. ఆగస్టు 15న ఈ చిత్రాన్ని థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన ఈ చిత్రం టీజర్‌కు అనూహ్యమైన స్పందన వచ్చింది. కాగా తాజా ఈ చిత్రం నుంచి టోంగా టోంగా అనే ఓ హుషారు గీతాన్ని బుధవారం విడుదల చేశారు. చరణ్ అర్జున్ సంగీత దర్శకత్వంలో ఎస్.ఎస్.చిరంజన్ సాహిత్యంతో, మెయిన్ కొరియోగ్రఫీతో ఈ పాట తెరకెక్కింది.

# ఒక రోజు ముందే పండుగ

## 'జన నాయగన్' విడుదల తేదీ ప్రకటించిన సహ నిర్మాత

కోలీవుడ్ స్టార్ హీరో ప్రస్తుత తమిళనాడు సీఎం విజయ్ హీరోగా నటించిన ఆఖరి సినిమానే జన నాయగన్. మంచి అంచనాలు ఉన్న ఈ సినిమా ఈ ఏడాది జనవరిలోనే విడుదల కావాల్సి ఉంది. కానీ అనేక కారణాలు రీత్యా సినిమా వాయిదా పడుతూ వచ్చింది. ఫైనల్‌గా విజయ్ సీఎం అయ్యాక అయినా వెంటనే వస్తుంది అనుకుంటే ఇక్కడ కూడా ఆలస్యం అవుతూ వచ్చింది. అయితే ఈ కొన్ని రోజుల నుంచి ఈ జూలై 24 డేట్ కన్ఫర్మ్ అయినట్టు వార్తలు వచ్చాయి. కానీ ఇప్పుడు సినిమా సహ నిర్మాత, విజయ్ పీఎస్ జగదీష్ పళనిస్వామి జన నాయగన్ విడుదల ఒక రోజు ముందే అంటే జూలై 23నే ఉంటుంది అని కన్ఫర్మ్ చేసేశారు. సో ఫ్యాన్స్‌కి దళపతి సీఎం విజయ్ ఓ రోజు ముందే పండుగ తెస్తున్నారు అని చెప్పొచ్చు. ఇక ఈ సినిమాకి హెచ్ వినోద్ దర్శకత్వం వహించగా పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించింది. అలాగే మమితా బైజు కీలక పాత్రలో నటించగా అనిరుద్ సంగీతం అందించారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ వారు నిర్మాణ బాధ్యతలు చేపట్టారు.

# 'కనగరాజ్ డీసీ' వచ్చేస్తున్నాడు

## కొత్త రిలీజ్ డేట్ ఆగస్టు 7

కోలీవుడ్ స్టార్ దర్శకుడు లోకేష్ కనగరాజ్ కేవలం దర్శకునిగానే కాకుండా హీరోగా కూడా పలు సినిమాలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఆ చిత్రాల్లో దర్శకుడు అరుణ్ మాతేశ్వరన్ తెరకెక్కించిన సాలిడ్ వైలెంట్ యాక్షన్ చిత్రమే 'డీసీ'. వామికా గబ్బి హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రం ఇప్పుడు వరకు వచ్చిన సాలిడ్ కంటెంట్ మంచి బజ్‌ని ఆడియెన్స్‌లో రేకెత్తించింది. అయితే ఈ సినిమా సెన్సార్ పూర్తి చేసుకున్నట్టు మేకర్స్ కన్ఫర్మ్ చేశారు. ఈ చిత్రానికి సెన్సార్ యూనిట్ వారు ఏ సర్టిఫికెట్‌ని ఇవ్వడం విశేషం. ఈ సినిమా పెద్దలకి మాత్రమే కానీ చిన్న పిల్లలకి కాదు అని క్లారిటీ వచ్చేసింది. అలాగే దీనితోనే మేకర్స్ కొత్త రిలీజ్ డేట్‌ని కూడా ప్రకటించారు. ముందుగా మేకర్స్ ఈ సినిమా డేట్‌ను జూలై 31కి లాక్ చేశారు. కానీ ఇప్పుడు కొత్త డేట్‌గా ఆగస్టు 7 నుంచి థియేటర్స్‌లో సందడి చేస్తుందని ఆ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ తెలిపింది.

